
రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


విచ్ఛిన్న శక్తులపై పోరాటం కొనసాగింపునకు ప్రతిన

గచ్చిరోలిలో ఎన్‌కౌంటర్ నలుగురు మవోయిస్టులు మృతి

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 174 | శనివారం | 24-05-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## జోహార్లు



సాయుధపోరాట యోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి నేడు

## కోటాలోనే విద్యార్థుల మరణాలు ఎందుకు?

- రాజస్థాన్ సర్కారుపై 'సుప్రీం..సీరియస్'
- ఒక్క ఏడాదిలోనే 14మంది విద్యార్థుల ఆత్మహత్యలు నమోదా అని విస్మయం
- మార్గదర్శకాలు జారీచేసినా ఎఫ్ఐఆర్ నమోదులో ఇంత నిర్లక్ష్యమా? అని పోలీస్ అధికారిపై బెంచ్ ఆగ్రహం




**న్యూఢిల్లీ :** కోటా నగరంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరగడంపై శుక్రవారం సుప్రీంకోర్టు రాజస్థాన్ ప్రభుత్వాన్ని విచారించింది. ఈ 'పరిస్థితి తీవ్రమైనది' అని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి.పార్థివాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మాట్లాడుతూ ఈ ఒక్క ఏడాదే ఇప్పటివరకూ కోటా నగరం నుంచి 14ఆత్మహత్యలు నమోదు తరువాయి 2లో

## కెసిఆర్ చుట్టూ దెయ్యాలు

- నా లేఖ బైటికి రావడం కోవర్టుల పనే
- పార్టీలో నా పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటి?
- బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు రాసిన లేఖపై ఎమ్మెల్సీ కవిత
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అభిమానుల ఘన స్వాగతం
- సిఎం కవితక్క అంటూ నినాదాలు




ప్రజాపక్షం / హైదరాబాద్

"కెసిఆర్ గారు దేవుడు. కానీ కెసిఆర్ చుట్టూ కొన్ని దెయ్యాలు ఉన్నాయి. వాళ్ళ వల్ల పార్టీకి నష్టం జరుగుతున్నది. పార్టీలో ఉండే నేను, కెసిఆర్ కూతురుని, అంతర్గతంగా నేను రాసిన లేఖనే బైటికి వచ్చిందంటే, మరి ఇతర సామాన్యుల సంగతి, పార్టీలో ఇతరుల పరిస్థితి ఏమిటని చర్చ జరగాల్సిన అవసరం ఉన్నది" అని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కె.కవిత అన్నారు.కుట్రలు కుతంత్రాలు జరుగుతున్నాయని తాను చెప్పిన కొద్ది రోజుల్లోనే కెసిఆర్‌కు తాను రాసిన లేఖ బహిర్గతం కావడమంటే, పార్టీలో ఉన్న అందరు ఆలోచించుకోవాల్సిన విషయమని చెప్పారు. పార్టీలో కొందరు కోవర్టులు ఉన్నారని, వారిని ఏమి చేయాలో పార్టీ నిర్ణయించుకోవాలన్నారు. అమెరికా నుండి శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. తన భర్త, కుమారుడితో కలిసి ఆమె రాత్రి 8:55 గంటలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వెలుపలికి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న మీడియాతో తాను 20 రోజుల క్రితం బిఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్‌కు రాసిన లేఖపై స్పందించారు. తొలుత 'జై తెలంగాణ' అంటూ మూడుసార్లు నినాదాలు తరువాయి 2లో

## బాంబులు వేశారనడం సిగ్గుచేటు

- తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే కెటిఆర్ గోబెల్ ప్రచారం
- కాళేశ్వరంపై బాంబులు వేస్తే ఎఫ్ఐఆర్‌లో ఎందుకు పేర్కొనలేదు
- ఆధారాలు అందజేస్తే ఇప్పటికైనా ఎఫ్ఐఆర్‌లో చేరుస్తాం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టీకరణ
- పిసి గోష్ కమిషన్ నోటీసులకు ఎందుకు అంత వణికారని మండిపాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్ఎస్ పాలనలో కమీషన్లకు కక్కుర్తిపడి మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కాళేశ్వరం నిర్మాణం పేరుతో లక్ష కోట్ల రూపాయలను వృధా చేయడమే కాకుండా గడిచిన పదేళ్ల కాలంలో తెలంగాణలో నీటిపారుదల రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యకం చేశారు. సచివాలయంలో శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని కప్పి పుచ్చుకునేందుకు ఇప్పుడు ఎవరో బాంబులు పెట్టడం కారణగానే కాళేశ్వరం కుంగిపోయిందని మాజీ మంత్రి కెటిఆర్ నిస్సిగ్గుగా గోబెల్ ప్రచారానికి తెర లేపారని విమర్శించారు. ఇదే అంశాన్ని గత ఏడాది కాలంగా విచారణ కొనసాగిస్తున్న రిటైర్డ్ జస్టిస్ పిసిఘోష్ కమిషన్‌కు ఎందుకు ఆధారాలు అందజేయలేదని ప్రశ్నించారు. ఈ ఘటన బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని, ఎఫ్ఆర్ఐ కూడా నమోదు చేశారని, ఇందుకు సంబంధించిన ఆధారాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో అందజేస్తే ఇప్పటికైనా ఎఫ్ఆర్ఐలో చేర్చి విచారణ చేపడుతామని మంత్రి స్పష్టం చేశారు. దేశంలోని అన్ని రాజ్యాంగ సంస్థలు కూడా కాళేశ్వరంలో అవినీతి చోటుచేసుకుందని, నిర్మాణంలో ఘోర తప్పిదాలకు పాల్పడ్డారని తరువాయి 2లో

## అసెంబ్లీకి రండి... సమస్యలపై చర్చించండి




- తప్పులు చేస్తే సూచనలు ఇవ్వండి.. సరిదిద్దుకుంటాం
- అధికారం ఉంటేనే అసెంబ్లీకి వస్తానంటే... ప్రజలే బుద్ధి చెబుతారు
- మాజీ సిఎం కెసిఆర్‌పై సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య
- రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టు అనుమతులను పొందడానికి ప్రధానిని ఎన్నిసార్లయినా కలుస్తానని స్పష్టీకరణ




ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. 'ప్రతిపక్ష నాయకుడికి నేను విజ్ఞప్తి చేస్తున్నా.. శాసనసభకు రండి... ప్రజా సమస్యలపై చర్చించండి...మేం ఏదైనా తప్పులు చేస్తే సూచనలు ఇవ్వండి.. సరిదిద్దుకుంటాం... అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తామని మీరు అనుకుంటే.. ప్రజలు గుణపాఠం చెబుతారు. ప్రజాప్రతినిధులుగా నిత్యం ప్రజలకు అండగా ఉండాలి. గెలిచినా, ఓడినా నేను ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నా. ముఖ్యమంత్రి అయ్యాక కూడా నేను ఏనాడు అహంభావం ప్రదర్శించలేదు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరినీ కలుస్తున్నా' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం ఇచ్చే వరకు నేను నిద్రపోయేది లేదని స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం పస్తాపూర్‌లో శుక్రవారం జరిగిన ప్రజాపాలన–ప్రగతి బాట బహిరంగ సభ ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టు అనుమతులను పొందడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని '50 సార్లు' కలవడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి, అభివృద్ధిని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వ, ప్రతిపక్షాల సహకారం ప్రాముఖ్యతను నొక్కి తరువాయి 2లో



## రాష్ట్రంలో మళ్ళీ కరోనా

- హైదరాబాద్‌లో తొలి కేసు నమోదు
- ఓ వైద్యునికి పాజిటివ్‌గా నిర్ధారణ
- దేశంలో విజృంభిస్తున్న మహమ్మారి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి వళ్లీ వచ్చింది. తెలంగాణలో కొవిడ్ కలకలం రేపింది. రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్‌లో తొలి కరోనా కేసు నమోదు అయింది. కూకట్ పల్లిలో ఓ వైద్యునికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని అధికారులు ప్రకటించారు. గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయనకు ఆర్‌టిపిసిఆర్ టెస్ట్ చేయగా పాజిటివ్ వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఆయనను క్వారంటైన్‌లో ఉంచామని, ఆయన కుటుంబ సభ్యులకు కూడా కరోనా పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. అయితే ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అప్రమత్తంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాలలో తరువాయి 12లో

## రాజీనామా యోచనలో యూనస్



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో మళ్లీ రాజకీయ అనిశ్చితి నెలకొంటోంది. దేశంలోని రాజకీయ పార్టీల మధ్య సఖ్యత లేకపోవడం మధ్యంతర ప్రధాన సలహాదారుడిని కలవరపాటుకు గురిచేస్తున్నాయి. తాజా పరిణామాలతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న మహమ్మద్ యూనస్ పదవి బాధ్యతల నుంచి తప్పుకోవాలని భావిస్తున్నారు. 'ఇలాంటి పరిస్థితుల్లో ఎలా పనిచేస్తాను...నేను పనిచేయలేను... బాధ్యతల నుంచి తప్పుకుంటా' అని యూనస్ అసహనం వ్యక్తం చేసినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కోటా పోరుతో తరువాయి 2లో

## భారత విదేశాంగ విధానం కుప్పకూలింది

- ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని ఎవరు అడిగారో చెప్పాలి
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్
- భారత ప్రతిష్ఠతో ప్రధాని మోదీ రాజీపడ్డారని ఆరోపణ
- దేశ ప్రయోజనాలను త్యాగం చేయడంపై మండిపాటు



**న్యూఢిల్లీ :** భారతదేశ విదేశాంగ విధానం 'కుప్పకూలింది' అని శుక్రవారం ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్ పాకిస్తాన్‌తో ఎందుకు హైఫన్ చేయబడిందని, రెండు దక్షిణాసియా పొరుగు దేశాల మధ్య మధ్యవర్తిత్వం చేయమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఎవరు అడిగారో వివరించాలని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌ను డిమాండ్ చేశారు. డచ్ బ్రాడ్‌కాస్టర్ ఎన్ఒఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు పహల్గామ్ ఉగ్రవాద దాడి, భారత్–పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలపై జైశంకర్ సమాధానమిచ్చిన వీడియో క్లిప్‌ను కాంగ్రెస్ చేసిన పోస్ట్‌ను రాహుల్ ట్యాగ్ చేశారు. 'భారత్ పాకిస్తాన్‌తో ఎందుకు హైఫన్ చేయబడింది? పాకిస్థాన్‌ను ఖండించడంలో ఒక్క దేశం కూడా మనల్ని ఎందుకు సమర్థించలేదు? భారత్–పాకిస్తాన్ మధ్య మధ్యవర్తిత్వం చేయమని ట్రంప్‌ను ఎవరు అడిగారు?' తరువాయి 2లో

## సామాజిక న్యాయం అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళండి

- ఇది ఎన్నికల అంశం కాదు.. కాంగ్రెస్ సైద్ధాంతిక నిబద్ధత..
- కాంగ్రెస్ అధికార ప్రతినిధుల వర్క్‌షాప్‌లో మల్లిఖార్జున ఖర్గే



**న్యూఢిల్లీ :** సామాజిక న్యాయం అంశాన్ని నిర్భయంగా ప్రజలలోకి తీసుకెళ్ళాలని, అది ఎన్నికల అంశం కాదని, సైద్ధాంతిక నిబద్ధతకు సంబంధించిన అంశమని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. సామాజిక న్యాయంపై ఢిల్లీలో శుక్రవారం ఏర్పాటు చేసిన అధికార ప్రతినిధులు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం అంశాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్ళి, ప్రజలలో అవగాహన సృష్టించాల్సిన బాధ్యత పార్టీ అధికార ప్రతినిధులదేనని చెప్పారు. కులగణన గురించి దేశానికి అవగాహన వస్తున్నదని, కాబట్టి సామాజిక న్యాయం అంశాన్ని వాస్తవాలు, సున్నితత్వంతో ప్రజలలోకి భయం లేకుండా తీసుకు వెళ్ళాలని సూచించారు. అధికార ప్రతినిధులే పార్టీ ఆలోచనలకు గొంతుక అని ఖర్గే అన్నారు. ఇది కేవలం సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటం కాదని, రాజ్యాంగం ఆత్మను పరిరక్షించేందుకు జరుగుతున్న పోరాటమని, ఇది ఎన్నికల అంశంగా కాకుండా సైద్ధాంతిక నిబద్ధతగా చూడాలని అన్నారు. ఇదొక చరిత్రాత్మక ప్రయత్నమని, అందరం కలిసి ప్రతి ఒక్క పౌరునికి గుర్తింపు, మర్యాద, హక్కులతో పాటు సమాన గౌరవం ఉండే భారతదేశాన్ని కలిసి కట్టుగా నిర్మిద్దామన్నారు. దేశం కుల న్యాయం గురించి మాట్లాడుకుంటున్నదని, ఇలాంటి సమయంలో ఆ చర్చకు సరైన దిశ ఇవ్వాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదని, దీనిని నినాదం స్థాయి నుంచి విధానం స్థాయికి తీసుకెళ్ళాలని అధికార ప్రతినిధులకు మల్లిఖార్జున ఖర్గే నిర్దేశించారు. 'జిత్నా ఆబాది ఉత్నా హక్ (జనాభా ఎంతో అంతే హక్కు)' తరువాయి 2లో

## కన్న తల్లే కడతేర్చింది...!

అపహరణకు గురైన బాలుడి కథ విషాదాంతం

చంపి బావిలో పడేసి కిడ్నాప్ డ్రామా ఆడిన వైనం

భర్త నుండి విడిపోవడానికే హత్య..!

ప్రజాపక్షం/దుబ్బాక

పేగు బంధానికి తలవంపులు.... నవ మాసాలు మోసి జన్మనిచ్చిన కన్నతల్లి మానవత్వం మరిచి కర్కశంగా మారింది. అభం శుభం తెలియని రెండు నెలల బాలుడిని తల్లే చంపేసి బావిలో పడేసింది. ఆపై తన ఒడి లో నుండి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని డ్రామా ఆడి చివరికి కటకటాల పాలైంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట రూరల్



మండలం పుల్లూరు గ్రామానికి చెందిన రామగళ్ళ శ్రీమాన్ నంగునూర్ మండలం నర్మెట్టకు చెందిన కవితను మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకొని తరువాయి 12లో


## చిన్నారులను చిదిమేస్తున్నారు..!

- యథేచ్ఛగా లింగనిర్ధారణలు... భ్రూణ హత్యలు
- పరీక్షలకు రూ.15వేలు- అబార్షన్‌కు రూ.35వేలు

ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు కాసులకు కక్కుర్తి పడి గర్భస్థ శిశువులను కడుపులోనే చిదిమేస్తున్నారు. లింగనిర్ధారణ... భ్రూణ హత్యలు నేరమని ప్రభుత్వం ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినా వాటిని ఏమాత్రం పట్టించుకోవడంలేదు. చిన్నారుల పసి ప్రాణాలను పిండం దశలోనే గాలిలో కలుపుతున్నారు. తల్లికడుపులో పెరుగుతున్న పిండం ఆడా?మగా? అని నిర్ధారించడానికి రూ.15వేలు, గర్భస్రావం చేయడానికి రూ.35 వేలు తీసుకుంటున్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా లింగ నిర్ధారణలు... భ్రూణ హత్యలు గత కొన్నేళ్లుగా యథేచ్ఛగా సాగుతున్నాయి. అయినా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 229 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ఇందులో 35కు పైగా ప్రసూతి ఆసుపత్రులు, 44 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పట్టణ ప్రాంతాలలో ఉన్నాయి. ఆసుపత్రుల నిర్వాహకులు, వైద్యులు కాసులకు కక్కుర్తి పడి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడా? మగా ? బిడ్డ అని పరీక్షలు చేసి ఆడశిశువే అని నిర్ధారించిన తర్వాత కడుపులోనే చిదిమేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో లింగనిర్ధారణ, భ్రూణ హత్యలపై ప్రభుత్వం తీసుకవచ్చిన చట్టాలపై అవగాహన లేకపోవడంతో అనేక మంది పేద, మధ్యతరగతి తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## దక్షిణాఫ్రికా బంగారు గనిలో కొనసాగుతున్న సహాయక చర్యలు



**జొహాన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికాలోని బంగారు గని ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. క్లూఫ్ గనిలోని స్కిప్ మార్గం వద్ద ప్రమాదం జరగ్గా, కొంత మంది సురక్షితంగా బయటకు వచ్చరని సిబన్యే స్టిల్‌వాటర్ మైనింగ్ కంపెనీ ప్రకటించింది. అయితే, ఇంకా 260 మంది వరకూ కార్మికులు గనిలోనే ఉన్నారని, వారిని సాధ్యమైనంత త్వరలో వెలికితెచ్చే ప్రయత్నం జరుగుతున్నదని చెప్పారు. అందరూ సురక్షితంగానే ఉన్నారని పేర్కొంది.






## వేరే వర్సిటీకి వెళ్లండి..

### హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశంపై ట్రంప్ సర్కారు నిషేధం

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్శిటీలో విదేశీ విద్యార్థుల ప్రవేశంపై ట్రంప్ ప్రభుత్వం నిషేధం విధించింది. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొంటూ యూనివర్శిటీకి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) కార్యదర్శి క్రిస్టి నోయెమ్ లేఖ రాశాలు. ఇది వరకే హార్వర్డ్ యూనివర్సిటీ నిధులను భారీగా తగ్గించిన ట్రంప్ ప్రభుత్వం, ఇప్పుడు విదేశీ విద్యార్థుల ప్రవేశంపై నిషేధం విధించడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే ఈ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విదేశీ విద్యార్థులు వరే వర్సిటీకి వెళ్లాలని లేదా దేశం విడిచి వెళ్లాలని వర్సిటీకి రాసిన లేఖలో స్పష్టం చేశారు. ఇకపై హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు ఉండవని ప్రకటించారు. ఉత్తర్వులను ఉల్లంఘించే విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, విదేశీ విద్యార్థులు అమెరికాలో చదువుకునేందుకు ప్రవేశం పొందే వ్యవస్థ అయిన విశ్వవిద్యాలయం స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (ఎస్ఇవిఐఎస్) సర్టిఫికేషన్ కూడా ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. కొంతకాలంగా హార్వర్డ్ వర్సిటీపై ట్రంప్ సర్కారు ఆగ్రహంతో ఉంది. అక్కడ చదువుతున్న విదేశీ విద్యార్థులు ఇజ్రాయెల్ పట్ల కక్షపూరితంగా, అమెరికాకు వ్యతిరేకంగా, హమాస్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్నారని ట్రంప్ ప్రభుత్వ ఆరోపణ. చైనా కమ్యూనిస్టు పార్టీతో వర్సిటీ కలిసి పని చేస్తున్నదని కూడా విమర్శిస్తున్నది. మాసచూసెట్స్‌లోని హార్వర్డ్ వర్సిటీ కేంబ్రిడ్జ్ క్యాంపస్‌లోనే, ప్రపంచ వ్యాప్తంగా సుమారు 140 దేశాలకు చెందిన, దాదాపు 6,800 మంది విదేశీ విద్యార్థులు ఏటా ప్రవేశం పొందుతున్నారు.

## కోర్టులో హార్వర్డ్ దావా




**బోస్టన్ (మాసచూసెట్స్/ అమెరికా):** ఐవీ లీగ్ స్కూల్‌లో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడంపై నిషేధం విధిస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హార్వర్డ్ యూనివర్సిటీ కోర్టులో సవాలు చేసింది. కేవలం ఒక్క సంతకంతో యూనివర్సిటీ విదేశీ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీయడడం ఎంత వరకు సమంజసమని కోర్టులో వేసిన దావాలో ప్రశ్నించింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో అమెరికా వ్యతిరేక విధానాలు అమలవుతున్నాయని, ఉగ్రవాదులకు కొమ్ముకాస్తున్నారని ట్రంప్ ప్రభుత్వం చేసిన విమర్శలను వర్సిటీ ఖండించింది. విదేశీ విద్యార్థుల ప్రవేశంపై నిషేధం విధించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా అభివర్ణించింది. ఇలాంటి నిర్ణయాలు వర్సిటీకి మాత్రమేగాక,యావత్‌అమెరికాకు కూడా నష్టాన్ని కలుగచేస్తుందని ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. దీనిపై తాము తదుపరి చర్యలకు సిద్ధమైనట్లు పేర్కొంది. అయితే, ట్రంప్ సర్కార్ నిర్ణయంతో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని విదేశీ విద్యార్థులంతావేరేయూనివర్శిటీకి బదిలీ కావాల్సి ఉంటుంది. లేదంటే.. అమెరికాలో చట్టపరమైన హోదాను కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే, ఈ హోదాను పునరుద్దరించుకోవాలనుకుంటే, మూడు రోజుల్లో తమ ఆరు డిమాండ్లను అంగీకరించాలని హార్వర్డ్ యూనివర్శిటీకి ట్రంప్ సర్కార్ ఓ అవకాశం ఇచ్చింది.

### ఆరు కండీషన్లు ఇవే..

1) గత ఐదేళ్లలో యూనివర్శిటీలో చదువుతున్న విద్యార్థులు క్యాంపస్‌లో లేదా బయట జరిపిన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన రికార్డులన్నీ సమర్పించాలి. ఆడియో, వీడియో పుటేజీలతో సహా అందజేయాలి.

2) గత ఐదేళ్లలో వలసదారు కాని (నాన్ ఇమిగ్రెంట్) విద్యార్థులు పాల్పడిన ప్రమాదకర, హింసాత్మక చర్యలకు సంబంధించిన రికార్డులను ఆడియోలు, వీడియో పుటేజ్‌లతో అందజేయాలి.

3) నాన్ ఇమిగ్రెంట్ విద్యార్థులు.. ఇతర విద్యార్థులు లేదా యూనివర్సిటీ సిబ్బందిని బెదిరిస్తే ఆ రికార్డులను సమర్పించాలి.

4) గత ఐదేళ్లలో వలసేతర విద్యార్థులు క్యాంపస్‌లో లేదాబయటఇతరహక్కులనుహరించిన ఘటనలుచోటుచేసుకుంటే ఆ వివరాలు అందించాలి.

5) గత ఐదేళ్లలో హార్వర్డ్‌లో నమోదుచేసుకున్న వలసేతర విద్యార్థుల క్రమశిక్షణ రికార్డులను ఇవ్వాలి.

6) క్యాంపస్‌లో వలసేతర విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొంటే ఆ ఆడియో, వీడియో ఫుటేజ్‌లను ప్రభుత్వానికి సమర్పించాలని క్రిస్టి నోయెమ్ ఆదేశించారు.

## కెసిఆర్ చుట్టూ దెయ్యాలు (మొదటి పేజీ తరువాయి)

చేశారు. తన కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని వచ్చే లోపల ఏదో లేఖ లీక్ అయిందని ,రెండు మూడు రోజులుగా హంగామా అవుతుందని తెలుస్తున్నదని, రెండు వారాల క్రితం తాను పెద్దలు కెసిఆర్‌కు లేఖ రాసానని కవిత చెప్పారు. ఇదివరకు కూడా తాను కెసిఆర్‌కు లేఖ ద్వారా అభిప్రాయాలను వెల్లడించేదానిని అని, ఈసారి కూడా రెగ్యులర్‌గా ఇచ్చిన ఫీడ్ బ్యాకేనని, అందులో ప్రత్యేకత ఏమి లే దన్నారు. అయితే, ఈసారి మాత్రం లేఖ బైటికి రావడం బాధాకరంగా ఉన్నదని వ్యాఖ్యానించారు. పార్టీలో అన్నిస్థాయిలో ఉన్న నాయకులందరూ అనుకుంటున్న విషయాలు, ఇటీవల దాదాపు సగం తెలంగాణలో తాను పర్యటించిన సందర్భంలో తెలంగాణ ప్రజలు అనుకుంటున్న అంశాలనే లేఖలో చెప్పానే తప్ప వ్యక్తిగత ఎజెండా లేదన్నారు. కానీ, మా నాయకునికి రాసిన లేఖ బహిర్గతమైందంటే ఆలోచించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. పార్టీలో చిన్న చిన్నలోపాలను చర్చించుకొని,సవరించుకొని, కోవర్టులను పక్కకు జరుపుకుంటూ ముందుకుపోతే పార్టీ పది కాలాల పాటు చల్లగా ఉంటుందనే భావన ఉన్నదన్నారు.లేఖలో కూడా తాను కెసిఆర్‌కు వ్యతిరేకంగా ఏమీ రాయలేదని, పార్టీని బలోపేతం చేసేందుకు రాసానని చెప్పారు. ఈ లేఖను చూసి కాంగ్రెస్, బిజెపి బాగా సంబరపడుతున్నట్లుగా ఉన్నాయని, ఏదో బిఆర్‌ఎస్ ఆగమైపోతుందని, కెసిఆర్‌కు ఏమో అయింది అనుకుంటున్నాయని పేర్కొన్నారు. మా నాయకుడు కెసిఆరేనని, ఆయన నాయకత్వంలోనే తెలంగాణ బాగుపడుతుందని, ఆయన నాయకత్వంలోనే బిఆర్‌ఎస్ ముందుకు పోతుందని బలంగా నమ్ముతున్నట్లు కవిత వెల్లడించారు.

**కవితకు కొత్త బ్యానర్‌ల స్వాగతం :** కెసిఆర్ కుమార్తె కె.కవిత శుక్రవారం సాయంత్రం అమెరికా నుంచి తరిగి వస్తున్న సందర్భంలో శంషాబాద్ విమానాశ్రయంలో కోలాహలం చోటుచేసుకుంది. తండ్రికి కవిత రాసిన లేఖ ఐడియాలు సోషల్‌మీడియాలో పెద్ద ప్రచారం పొందటం దీనికి నేపథ్యం. ఆమెకు స్వాగతం చెప్పటానికి బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలెవరూ రాలేదు. గులాబీరంగు జెండాల జాడలేదు. బిసి సంఘాల పేరుతో, కవిత మహిళా సంఘం జనజాగృతి పేరుతో బ్యానర్లు, ప్లకార్డులతో జనాలు చేరారు. సామాజిక తెలంగాణ కోసం పోరాటం చేస్తున్న కవితకు స్వాగతం పలికారు. బ్యానర్ కూడా గులాబీ రంగు కాదు. నీలం రంగు బ్యాక్‌గ్రౌండ్‌పై పసుపుపచ్చలో అక్షరాలు. ప్లకార్డులపై కూడా గులాబీ లేదు. వీరెవరు, ఎవరు ఆర్గనైజ్ చేశారు, బిఆర్‌ఎస్‌లో దీని పర్యవసానమేమిటో రోజులు గడిస్తే గాని తెలియదు.

## టార్గెట్ 'కొలంబియా'?



**న్యూయార్క్:** హార్వర్డ్ యూనివర్సిటీపై తొలుత ఆరోపణలు చేసి, నిధుల్లో కోతపెట్టి, అనంతరం విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేసిన ట్రంప్ సర్కారు,ఇప్పుడు తన దృష్టిని కొలంబియా వర్సిటీపై కేంద్రీ కరించినట్టు స్పష్టమవుతున్నది. అక్కడ ఇజ్రాయెల్ విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని అమెరికా సెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ ఆరోపించింది. కొలంబియా విశ్వవిద్యాలయంలో జాతీయ పౌర హక్కుల చట్టంలోని ఆరో అధికరణ ఉల్లంఘన జరుగుతున్నదని ఒక నివేదికలో పేర్కొంది. కొంతకాలం క్రితం కూడా ఇలాంటి ఆరోపణలే వెలువడ్డాయి. అనంతరం 400 మిలియన్ డాలర్ల సాయాన్ని ట్రంప్ ప్రభుత్వం ఆ వర్సిటీకి నిలిపివేసింది. హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడాన్ని నిషేధించక ముందు ఇవే పరిణామాలు చోటు చేసుకున్నాయి. అందుకే, కొలంబియా వర్సిటీకి కూడా విదేశీ విద్యార్థుల చేరికపై ఆంక్షలు విధించడం లేదా పూర్తిగా నిషేధించడం జరగవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏ రకంగా చూసినా ట్రంప్ సర్కారు తదపరి లక్ష్యం కొలంబియా వర్సిటీగానే కనిపిస్తున్నది.

## మాస్కోపై డ్రోన్ దాడులు!

### భారత ఎంపిల బృందం విమానం ఆలస్యం

**మాస్కో:** ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేయడంతోపాట, పాకిస్తాన్ వైఖరిని అంతర్జాతీయంగా ఎండగట్టేందుకు భారత పార్లమెంటు సభ్యులు(ఎంపిలు)వివిధ దేశాల్లో పర్యటిస్తున్న క్రమంలో, మాస్కో చేరాల్సిన బృందం నిర్ణీత సమయం కంటే సుమారు 40 నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది. డిఎంకె సభ్యురాలు కనిమొళి నేతృత్వంలోని భారత ఎంపిల బృందం డొమొడెడొవొ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుందని రష్యా అధికారులు ప్రకటించారు. వివిధ కారణాల వల్ల 153 విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయని తెలిపారు. అయితే, కారణాలు వెల్లడించలేదు. కానీ, స్థానికులను ఉటంకిస్తూ పిటిఐ ఇచ్చిన సమాచారం మేరకు, మాస్కో విమానాశ్రయం లక్ష్యంగా ఉక్రేన్ డ్రోన్ల దాడిని కొనసాగిస్తున్నది. ఈ కారణంగానే పలు రన్‌వేలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విమానాల రాకపోకలకు ఇదే ప్రధాన కారణం.

## యోచనలో యూనస్

(మొదటి పేజీ తరువాయి)

షేక్ హసీనా ప్రభుత్వం కూలిన తర్వాత బంగ్లాదేశ్‌లో శాంతి భద్రతలు క్షీణించాయి. ఆపద్ధర్మ ప్రభుత్వంలోనూ పరిస్థితులు పూర్తిస్థాయిలో చక్కబడలేదు. ప్రజాందోళనలు ఉధృతమవుతున్నాయి. నిరసనలు పెరుగుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కొరవడింది. దీంతో నెలకొన్న రాజకీయ ప్రతిష్ఠంభనపై ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో తీవ్ర అసహనం ఉంది. ప్రభుత్వ వర్గాల్లోనూ అసంతృప్తి ఉంది. దేశాన్ని పాలించగల యూనస్ సామర్థ్యంపై ప్రశ్నలు వస్తున్నాయి. దీంతో ఆయన పదవీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని భావిస్తున్నట్లు నేషనల్ సిటిజన్ పార్టీ కన్వీనర్ నహీద్ ఇస్లాం తెలిపారు. తాజా సలహా మండలి సమావేశంలో యూనస్ తన అభిప్రాయాన్ని వెల్లడించినట్లు మీడియా నివేదికలు పేర్కొన్నాయి. బంగ్లాదేశ్‌లోని ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం, అంతర్గత విభేదాలు తలెత్తుండటం, తన పరిపాలనా సామర్థ్యంపై ప్రశ్నలు వస్తుండటంతో మదన పడుతున్న యూనస్‌ను ఆయన అధికారిక నివాసంలో సమాచార సలహాదారు మెహఫూ ఆలం, ప్రభుత్వ సలహాదారు ఆసిఫ్ మహమూద్ షోజిబ్ భూయన్, నేషనల్ సిటిజన్ పార్టీ నహీద్ ఇస్లాం కలిశారు. పెరుగుతున్న వివాదాస్పద డిమాండ్లపై యూనస్ ఆందోళన వ్యక్తంచేసినట్లు ఇస్లాం అనంతరం మీడియాకు తెలిపారు. 'నేను ఇలా పని చేయలేను. రాజకీయ పార్టీలన్నింటి మధ్య ఏకాభిప్రాయం లేకుండా ముందుకెళ్లలేం' అని యూనస్ అన్నారన్నారు. తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని తాను యూనస్‌ను కోరినట్లు ఇస్లాం చెప్పారు. పార్టీల మధ్య ఐక్యతకు యూనస్ హామీ ఇవ్వగలరని, ఆయనకు అందరి సహకారం లభిస్తుందని నహీద్ ఇస్లాం ఆకాంక్షించారు. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ సహా ఇతర పార్టీలు తాత్కాలిక ప్రభుత్వంపై తీవ్ర అసంతప్తి వేళ బంగ్లా సైన్యాధికారి వకార్‌ఉజ్‌జమాన్‌తో విభేధాలు సమస్యను పెంచాయి. అయితే ఎన్నికల నిర్వహణ, సైనిక వ్యవహారాల్లో జోక్యం సహా యూనస్ నిర్ణయాలతో వీరి మధ్య విభేదాలు పెరిగినట్లు తెలుస్తోంది. 2026 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని యూనస్ పేర్కనడంపై అభ్యంతరం వ్యక్తమైంది. 'యూనస్‌కు 84 ఏళ్లు. ఇంతటి ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు' అని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కాగా, దేశ భద్రత, భవిష్యత్తు కోసం బలంగా ఉండాలని రాజీనామా ఆలోచన మానుకోవాలని యూనస్‌ను తాను కోరినట్లు నహిద్ ఇస్లాం వెల్లడించారు.

## మరణాలు ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

అయ్యాయని విస్మయం వ్యక్తం చేసింది. 'రాష్ట్ర ప్రభుత్వంగా మీరు ఏమి చేస్తున్నారు?. ఎందుకు ఈ పిల్లలు కోటా నగరంలో మాత్రమే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?. ఒక రాష్ట్రంగా మీరు ఏ ఆలోచనా చేయలేదా?' అని జస్టిస్ పార్థివాలా రాజస్థాన్ ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాదిని ఉద్దేశించి ప్రశ్నించారు. విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేశామని న్యాయవాది చెప్పారు. ఖరగ్‌పూర్ ఐఐటిలో 22ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయమై అత్యున్నత న్యాయస్థానం విచారణ జరిపింది. మే 4న ఆ విద్యార్థి తన హాస్టల్ రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటాన్ని కనుగొన్నారు. ఎన్ఇఇటి (నీట్) ఆశావహ విద్యార్థిని కోటాలోని తన రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన మరో కేసును కూడా ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఆ బాలిక తన తల్లిదండ్రులతో కలిసి కోటాలో నివసిస్తున్నారు. ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థి మరణానికి సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ధర్మాసనం గమనించింది. అయితే మే 8న నమోదైన ఎఫ్ఐఆర్ నమోదుకు సంబంధించి 4 రోజుల ఆలస్యం ఎందుకు అయ్యిందని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది.'ఈ విషయాలను తేలికగా తీసిపారేయొద్దు. ఇవి చాలా సీరియస్‌గా తీసుకోవాల్సిన విషయాలు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మార్చి 24న అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఉన్నత విద్యాసంస్థలలో పునరావృతం అవుతున్న విద్యార్థుల ఆత్మహత్యల కేసులను పరిగణనలోనికి తీసుకుని, విద్యార్థుల మానసిక సంఘర్షణలను పరిష్కరించడానికి, అటువంటి సమస్యలను నివారించడానికి సుప్రీంకోర్టు ఒక జాతీయ స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. శుక్రవారం ధర్మాసనం మాట్లాడుతూ ఇలాంటి ఆత్మహత్యల కేసులలో సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా త్వరగా ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం అవసరమని ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. కోర్టుకు హాజరైన పోలీస్ అధికారిని ఉద్దేశించి ధర్మాసనం మాట్లాడుతూ 'మీరు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసేందుకు ఎందుకు 4రోజుల సమయాన్ని తీసుకున్నారు?. ధర్మాసనం ప్రశ్నకు ఆ పోలీస్ అధికారి స్పందిస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని విన్నవించారు. చట్ట ప్రకారం మీరు మీ దర్యాప్తును కొనసాగించండి' అని ధర్మాసనం ఆయనను ఆదేశించింది. ఆత్మహత్య గురించి తెలుసుకున్న తర్వాత ఐఐటి ఖరగ్‌పూర్ అధికారులు పోలీసులను అప్రమత్తం చేసినట్లు రికార్డుల్లోకి వచ్చింది. అయితే ఐఐటి ఖరగ్‌పూర్ తరపు న్యాయవాది, పోలీస్ అధికారి చెప్పిన వివరణకు ధర్మాసనం సంతృప్తి చెందలేదు.' ఈ విషయం గురించి కఠినమైన అభిప్రాయానికి వచ్చాం. పోలీస్ స్టేషన్ జ్యూరీస్‌డిక్షన్‌కు సంబంధించి ఇన్‌చార్జి పోలీస్ ఆఫీసర్‌కు వ్యతిరేకంగా కంటెంప్ట్ కింద కూడా మేం ముందుకు వెళతాం' అని ధర్మాసనం స్పష్టం చేసింది. దర్యాప్తు తప్పనిసరిగా సరైన దిశలో జరగాలని బెంచ్ చెప్పింది. కోటా ఆత్మహత్య కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేయకపోవడాన్ని ధర్మాసనం తిరస్కరించింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నదని, రాష్ట్రంలోని ఆత్మహత్యల కేసుల గురించి ప్రత్యేక దర్యాప్తు బృందానికి అవగాహన ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది బెంచ్‌కు తెలియజేశారు. కోటాలో ఎంతమంది యువ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారో చెప్పండి అని ధర్మాసనం ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాదిని ప్రశ్నించింది. దీనికి న్యాయవాది సమాధానమిస్తూ 14మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ధర్మాసనానికి నివేదించగా బెంచ్ దీనిని తిప్పికొడుతూ ఎందుకు ఈ విద్యార్థులు చనిపోతున్నారని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన టాస్క్ ఫోర్స్ కోర్టుకు మిశ్రమ నివేదికను ఇవ్వడానికి ముందు దాని సమయం ఆసన్నమైందని పేర్కొంది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'మీరు మా తీర్పును ధిక్కరిస్తున్నారు. మీరు ఎందుకు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయలేదు' అని రాజస్థాన్ ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. బెంచ్ మాట్లాడుతూ 'విద్యార్థి విద్యాసంస్థ కల్పిస్తున్న వసతులను వినియోగించుకుంటూ వారు కల్పించిన నివాసంలో ఏమీ ఉండలేదు కదా? 2024లో విద్యార్థిని వెళ్లిపోయి తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నది కదా' అని బెంచ్ చెప్పింది. సుప్రీంకోర్టు మార్గనిర్దేశానికి అనుగుణంగా నడుచుకోవడం సంబంధిత పోలీస్ అధికారిగా మీ డ్యూటీ చేయాలి. ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి దర్యాప్తు జరపాల్సిన డ్యూటీ మీది. అయితే ఇన్‌చార్జి అధికారి గా పోలీస్‌స్టేషన్ ప్రాదేశికానికి సంబంధించిన డ్యూటీని నిర్వర్తించడంలో ఆయన వైఫల్యం చెందారు. కోర్టు జారీచేసిన ఆదేశాలను ఆయన ఏ మాత్రం పాటించలేదు' అని బెంచ్ అసహనం వ్యక్తం చేసింది. కోటా కేసులో పరిస్థితిని వివరించేందుకు సంబంధిత పోలీస్ అధికారిని జులై 14న హాజరుకావాలని ఆదేశిస్తూ అత్యున్నత న్యాయస్థానం సమన్లు జారీ చేసింది.

## కుప్పకూలింది

(మొదటి పేజీ తరువాయి)

అని రాహుల్ ప్రశ్నిస్తూ వీటికి వివరణ ఇస్తారా అని నిలదీశారు. భారత విదేశాంగ విధానం కూలిపోయిందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ భారత ప్రతిష్టతో రాజీ పడ్డారని రాహుల్ గురువారం ఆరోపించారు. పాకిస్తాన్‌పై సైనిక వైరాన్ని నిలిపివేయడానికి అంగీకరించడం ద్వారా మోదీ దేశ ప్రయోజనాలను ఎందుకు త్యాగం చేశారని నిలదీశారు. 'మోదీ జీ.. ఖాళీ ప్రసంగాలు చేయడం ఆపండి. ఒక్క మాట చెప్పండి: ఉగ్రవాదంపై పాకిస్థాన్ ప్రకటనను మీరు ఎందుకు నమ్మారు? ట్రంప్‌కు తలవంచి భారతదేశ ప్రయోజనాలను ఎందుకు త్యాగం చేశారు? కెమెరాల ముందు మాత్రమే మీ రక్తం ఎందుకు మరుగుతుంది? మీరు భారతదేశ ప్రతిష్టతో రాజీ పడ్డారు!' అని ఆయన ఎక్స్‌లో చేశారు. విదేశాంగ మంత్రిని కాంగ్రెస్ నాయకులు 'జైచంద్ జైశంకర్' అని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయంలోని ఎఐసిసి కార్యదర్శి గౌరవ్ పాంధి మాట్లాడుతూ 'జైచంద్ జైశంకర్ విదేశాంగ మంత్రిగా కొనసాగుతున్న ప్రతి రోజు, ఆయన కేవలం ఒక బాధ్యత మాత్రమే కాదు, భారతదేశ జాతీయ ప్రయోజనాలకు తీవ్రమైన ముప్పుగా మిగిలిపోతున్నారు. ఆయనను వెంటనే పదవి నుండి తొలగించాలి. ఆయన వైఫల్యాలను పరిశోధించడానికి స్వతంత్ర విచారణ ఏర్పాటు చేయాలి' అన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సాయుధ దళాలు బలంగా ముందుకు సాగుతున్న సమయంలో ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. ఇండోపాక్ వివాదంపై తమ నాయకుల ప్రకటనలపై కాంగ్రెస్, బిజెపి మధ్య మాటల యుద్ధం తీవ్రమైంది. అధికార పార్టీ రాహుల్ గాంధీని 'ఆధునిక యుగం మీర్ జాఫర్' అని, ప్రతిపక్ష పార్టీ జైశంకర్‌ను 'నవ యుగం జైచంద్' అని అభివర్ణిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై చేసిన వ్యాఖ్యలపై రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకున్నాయి. సోషల్ మీడియాలో మీమ్‌లను కూడా పోస్ట్ చేశాయి. దేశానికి ద్రోహం చేస్తున్నారని పరస్పరం ఇరు పార్టీలు నిందించుకుంటున్నాయి. ఆపరేషన్ సిందూర్ గురించి పాకిస్థాన్‌ను ముందే హెచ్చరించారని ఆరోపిస్తూ కాంగ్రెస్, రాహుల్ గాంధీ జైశంకర్‌పై విమర్శల చేశారు. భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలను పరిష్కరించడానికి తాను సహాయం చేశానని అమెరికా అధ్యక్షుడు పదేపదే చెబుతున్నారు.

## ప్రజల్లోకి తీసుకెళ్ళండి

(మొదటి పేజీ తరువాయి)

అనేది నినాదం కాదని, జాతీ నిర్ణయం అని తెలిపారు. కులగణన కొత్తదేమి కాదని, కాంగ్రెస్ పార్టీ నిరంతరం ఈ అంశాన్ని లేవనెత్తిందని, మానిఫెస్టోలో, పార్లమెంటులో, వీధుల్లో, సామాజిక న్యాయం గురించి మాట్లాడే ప్రతి వేదికపై లేవనెత్తిందని గుర్తు చేశారు. ''దేశ అధికార వ్యవస్థలో ఒబిసి, దళితులు, ఆదివాసీల భాగస్వామ్యం ఎంత? అని మనం ప్రశ్నించాలి. ఆ వర్గాల జనాభాకు అనుగుణంగా మీడియా, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు, కార్పొరేట్ రంగంలో, ఉన్నత విద్యా సంస్థల్లో ప్రాతినిధ్యం ఉందా? లేకపోతే, అందుకు కారణమేమిటి? దానికి పరిష్కారమేమిటి?' అని ఖర్గే అన్నారు. ''దాని నిజాన్ని బైటికి తీసుకురావడమే పరిష్కారమని, సామాచారాన్ని ప్రజల ముందుంచాలని, తరువాత విధానాలను పునర్నిర్మించాలి. అందుకే కుల గణనను మేము అంకెల కసరత్తులా కాకుండా భారతీయ ప్రజాస్వామ్య నైతిక కర్తవ్యంగా భావిస్తున్నామ''ని ఖర్గే వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5) ప్రకారం ఒబిసి, దళితులు, ఆదివాసీ విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ కల్పించాల్సిందిగా స్పష్టంగా డిమాండ్ చేసిందన్నారు. కొత్త సమాచారం ఆధారంగా 50 శాతం రిజర్వేషన్ పరిమితిని పునః పరిశీలించాలని కోరామని అన్నారు.

### తెలంగాణ నమూనాకు కేంద్రం స్వీకరించాలి

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన కుల సర్వే ఒక నమూనాను అందించిందని, ఇందులో సమాజం, నిపుణులు, ప్రభుత్వం అన్ని వర్గాలు పాల్గొన్నాయని ఖర్గే తెలిపారు. ఇలాంటి ప్రజలకు అనుగుణమైన, పారదర్శక నమూనానే కేంద్ర ప్రభుత్వం స్వీకరించాలని, ఈ ప్రక్రియలో సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## చర్చించండి

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. కెసిఆర్ తన హయాంలో రాష్ట్ర అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని, ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఫార్మా, ఐటి రంగాలను బలోపేతం చేయడంతో పాటు పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచి సంపదను సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి మెదక్ ప్రాంతానికి ఇందిరమ్మకు ఉన్న అనుబంధం విడదీయలేనిదని ఆయన అన్నారు. మెదక్ పేరు గురుకు వస్తేనే ఇందిరమ్మను తలచుకుంటామని తెలిపారు. ఇందరమ్మ తన చివరి రోజుల్లో మెదక్ ఎంపిగా కొనసాగారని గుర్తు చేశారు. రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసా రూ. 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. వరి వేసుకుంటే ఊరే అని ఆనాటి పాలకులు అన్నారని, కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం రూ.5500 కోట్లు కేటాయించామని, కోటి మంది మహిళల కోటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునుద్ఘాటించారు. మిని వరల్డ్ కాంపిటేషన్‌కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నామని, మీరందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిమ్జ్ అభివృద్ధి కుంటుపడిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిమ్జ్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచామని, భూ సేకరణను వేగవంతం చేశామని చెప్పుకొచ్చారు. త్వరలో హ్యుందామ్ కార్ల తయారీ కంపెనీ ఇక్కడ పనులు ప్రారంభిస్తోందని చెప్పారు. నిమ్జ్ భూ నిర్వాసితులైన 5612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తామన్నారు. పటాన్ చెరు మినీ ఇండియా ప్రాంతం బిహెచ్‌ఎల్ , బిడిఎల్, నీమ్జ్ ,ఇక్రిశాట్, ఇవన్ని కాంగ్రెస్ హయంలో వచ్చినవేనన్నారు. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్‌గా మారుస్తామని ముఖ్య మంత్రి వ్యాఖ్యానించారు. 15 నెలల్లో తెలంగాణకు 3 లక్షల కోట్ల పెట్టు బడుల్ని తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. జహీరాబాదు చెరుకు రైతులు సహకార సంఘంగా ఏర్పడి ముందుకు వస్తే నిమ్జ్‌లో స్థలం కేటాయించి చెరుకు కర్మాగారం ఏర్పాటుకు సహకారం అందిస్తామని చెప్పారు. ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏ రోజూ తాను సిఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. ప్రతిపక్షాలు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామన్నారు. ప్రపంచంలో తెలంగాణాన్ని గొప్ప రాష్ట్రంగా తీర్చుదిద్దుతామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు దామదర్ రాజనర్సిహ, కొండాసురేఖ, ఎం.పి సురేష్ శేట్కర్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, మాణిక్యరావు, జిజిఐఐసి నిర్మల జగ్గారెడ్డి, పిసిసి వర్కింగ్‌ప్రసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు, వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ పరితోష్ ఫంకజ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి,జిల్లా అదికారులు తదితరులు పాల్గొన్నారు.

### బసవేశ్వర విగ్రహం ఆవిష్కరణ

అంతకు ముందు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. హుగ్గెల్లి కూడలిలో బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాచునూరులో కేంద్రీయ విద్యాలయం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పస్తాపూర్ చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణంలో రూ. 498.67 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అక్కడ మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం పరిశీలించారు.

## సిగ్గుచేటు (మొదటి పేజీ తరువాయి)

తేల్చాయని, అన్ని నివేదికలను క్రోడీకరించి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన మూడేళ్లకే కూప్పకూలడానికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నామని మంత్రి స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఇప్పటికే 17 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది గత ప్రభుత్వం రాజకీయ దురుద్దేశం, కాసుల కక్కుర్తితో లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరానికి బదులుగా ప్రతిపాదిత బిఆర్ అంబేద్కర్–ప్రాణహిత చెవేళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద రూ.38 వేల కోట్లతో నిర్మించి ఉంటే ఆ ప్రాజెక్టు పూర్తై దాదాపు 17లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరు అందేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మిగిలిన రూ.62 వేల కోట్లతో రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పాలమూరు రంగారెడ్డి, నెట్టంపాడు, బీమా, ఎస్ఎల్‌బిసి, డిండి, సీతారామసాగర్, సమ్మక్క సారక్క ప్రాజెక్టులు కూడా పూర్తైయ్యేవని, తద్వారా తెలంగాణ సస్యశామయ్యేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కానీ మాజీ సిఎం కెసిఆర్ మాత్రం తెలంగాణ ప్రజలను తాకట్టు పెట్టి మరీ అధిక వడ్డీ రేటుతో స్వల్పకాలిక రుణాలను తెచ్చి మేడిగడ్డ వద్ద కాళేశ్వరంపేరుతో ప్రాజెక్టు నిర్మించి నీటిని తరలించి రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం మోపారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు.

### కమిషన్ నోటీసులకే ఎందుకంతా వణుకు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలపై ఏర్పాటు చేసిన రిటైర్డ్ జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లకు నోటీసులు జారీ చేస్తే ఎందుకంతా వణుకుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఏ తప్పు చేయకుండా నిర్భయంగా కమిషన్ ముందు తమ వివరణను ఇవ్వవచ్చు కదా అన్నారు. గతంలో దేశంలో ఏర్పాటైన అనేక కమిషన్ల ముందు పెద్ద నాయకులు సైతం హాజరై తమ వివరణ ఇచ్చారని వారి కంటే కెసిఆర్ పెద్ద నాయకుడేమీ కాదని ఆయన పేర్కొన్నారు. దేశంలో అత్యున్నత పదవులు నిర్వహించిన వ్యక్తి జస్టిస్ పిసి.ఘోష్‌తో న్యాయ విచారణ కమిటీ ఏర్పాటు చేశారని, ఇది పూర్తిగా స్వతంత్ర కమిటీ అని, ప్రభుత్వానికి ఏలాంటి సంబంధంలేదని, ఆలాంటి కమిటీని కూడా బిఆర్‌ఎస్ నాయకులు తప్పు పట్టడం అర్ధరహితమన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎవరైనా మావోయిస్టులు ఉంటే లొంగిపోండి : డిజిపి జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎవరైనా మావోయిస్టులు ఉంటే పోలీసుల ముందు లొంగిపోవాలని డిజిపి డాక్టర్ జితేందర్ శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఇప్పటి వరకు 300 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారికి పోలీసు శాఖ తరపున పునరావాసం కల్పించామని తెలిపారు. అయితే ఛతీస్‌ఘడ్ రాష్ట్రంలో (కర్రెగుట్ట) జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లపై డిజిపి జితేందర్ స్పందించారు. మావోయిస్టులకు ఉనికి లేదని..తెలంగాణ రాష్ట్రంలో ఏ మూలన ఎవరైనా మావోయిస్టులు ఉంటే భయపడాల్సిన అవసరం లేదని..వారంతా పోలీసుల ముందు లొంగిపోతే వారికి పునరావాసం చట్టప్రకారం కల్పిస్తామని జితేందర్ పేర్కొన్నారు.

**'ఉగ్ర' స్లీపర్ సెల్స్‌లను గుర్తిస్తున్నాం :** పేలుళ్ల కుట్ర సూత్రధారి సమీర్ కేసు దర్యాప్తు కొనసాగుతోందని డిజిపి జితేందర్ తెలిపారు. నిందితులు ఉగ్ర కుట్రలో భాగంగా ఒక గ్రూప్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తే తాము విచ్ఛిన్నం చేశామని చెప్పారు.

## ఆశయం, ఆచరణ సమ్మిళితుడు గిరిప్రసాద్

### నేడు 29వ వర్ధంతి



నమ్మిన సిద్ధాంతంకై నడిచిన రణధీరుడు ఆయన. యుక్త వయస్సులోనే తెలంగాణ గ్రామీణ ప్రాంత ఈతి బాధలను చూసి చలించి ఉన్నత విద్యను వదిలి సరాసరి రాజకీయ శిక్షణా శిబిరానికి చేరుకున్న కార్యశీలి. సామాన్య కార్యకర్తగా మొదలైన ఆ ప్రస్థానం భారత కమ్యూనిస్టు పార్టీలో అగ్రస్థానానికి చేరుకుంది. ఆశయం, ఆచరణ మూర్తీభవించిన మహనీయుడు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి నేడు. గిరిప్రసాద్ 29వ వర్ధంతి ఒక పరిస్థితిలో జరుపుకుంటున్నాం. 99 సంవత్సరాల ఉద్యమ ప్రస్థానాన్ని ముగించుకుని సిపిఐ శత వసంతంలోకి అడుగిడింది. నాటి ఉద్యమ ఘట్టాలను నేటి తరానికి తెలియజేస్తూ కార్యకర్తలను భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేస్తున్న సందర్భమిది. వాడవాడలా పార్టీ శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్న విషయం విదితమే. మరోపక్క పెరుగుతున్న మతోన్మాదం, ఆర్థిక అంతరాలు దేశాన్ని సంక్లిష్ట స్థితికి నెట్టివేస్తున్న సమయం, నాటి తెలంగాణ సాయుధ పోరాటం దళ కమాండర్ నుంచి రాజ్యసభ సభ్యునిగా, సిపిఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి వరకు సాగిన గిరిప్రసాద్ జీవితాన్ని మననం చేసుకుని ఆ స్ఫూర్తితో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని ప్రజా పోరాటాలను నిర్వహించాలి. నల్లమల గిరిప్రసాద్ ఖమ్మం జిల్లా మధిర మండలం తొండలగోపవరం గ్రామంలో ఎగువ మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. మద్రాస్ కళాశాలలో చదువుకుంటూ తెలంగాణలోని పరిస్థితులు, ఆంధ్రమహాసభ కార్యక్రమాలను తెలుసుకుని విద్యను మధ్యలో వదిలేసి ఇప్పటి ఎన్‌టిఆర్ జిల్లా తునికిపాడు గ్రామంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యాడు. ఆ తర్వాత గ్రామ రక్షణ దళంలో సభ్యునిగా చేరాడు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గిరి దళానికి నాయకత్వం వహించాడు. పాల్వంచ ప్రాంతంలో గ్రామాలను విముక్తి చేసి వందలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశాడు. మన్యం ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందిన గిరిప్రసాద్‌ను అంతం చేసేందుకు నిజాం రక్కసిమూకలు అనేక ప్రయత్నాలు చేశాయి. గిరిదళంపై కాల్పులు జరపటంతో తుపాకి గుండ్లకు గిరిప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. రక్తం మడుగులో ఉన్న గిరిప్రసాద్‌ను గిరిజనులు రక్షించారు. సాయుధ పోరాట విరమణ అనంతరం ఖమ్మం నుంచి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో ఉవ్వెత్తున సాగిన విశాఖ ఉక్కు సాధనోద్యమ సందర్భంగా తన తోటి సిపిఐ సభ్యులతో కలిసి రాజీనామా చేశారు. 1992లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఖమ్మంజిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, సిపిఐ జాతీయ ఉపప్రధాన కార్యదర్శిగా గిరిప్రసాద్ పనిచేశారు. పార్టీ నిర్మాణంపై గిరిప్రసాద్ మాటలు సదా అనుసరణీయం. కమ్యూనిస్టులకు నిర్మాణమే ఏకైక ఆయుధమని సమర్థులు, చైతన్యవంతులైన కార్యకర్తలు మాత్రమే ఆశయాలను, లక్ష్యాలను నెరవేర్చగలరని ఆయన బోధించేవారు. నిరంతరం నూతన కార్యకర్తలను పార్టీ వైపు ఆకర్షించడం, వారికి సైద్ధాంతిక శిక్షణనిచ్చి పార్టీని బలోపేతం చేయడం నాయకులా పార్టీ బాధ్యుల కర్తవ్యం కావాలని గిరిప్రసాద్ చెప్పేవారు. గ్రామస్థాయి నుండి అన్ని కమిటీలు పట్టుదలతో పనిచేసినప్పుడే ఇతర ప్రాంతాలకు, ఇతర రంగాలకు పార్టీ విస్తరించగలుగుతామని ఆయన చెప్పిన మాటలు అక్షర సత్యాలు. ప్రజల ఆలోచనల్లో మార్పులు వచ్చాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో అన్ని సంబంధాలు దాదాపుగా ఆర్థిక సంబంధాలుగా మారుతున్నవేళ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షించడం, వారిని సుశిక్షితులైన కార్యకర్తలుగా తయారు చేయడం అంత తేలికైన పనికాదు. ఇందు కోసం వివిధ బాధ్యతల్లో ఉన్న నాయకత్వం మరింతగా శ్రమించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా గిరిప్రసాద్ మాటలను జ్ఞప్తికి తెచ్చుకోవాలి. 1980 దశకంలో మధిరలో జరిగిన ఓ సమావేశానికి హాజరైన గిరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు నాయకుల వద్దకు భవిష్యత్తులో రాకపోవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఉండకపోవచ్చు. ఎవరైతే జనంలోకి వెళతారో వారే నాయకులుగా మిలుగుతారన్నారు. నేటి పరిస్థితిని దాదాపు మూడు దశాబ్దాల క్రితమే చెప్పిన కమ్యూనిస్టు తత్వవేత్త గిరిప్రసాద్. శత వసంతంలోకి కమ్యూనిస్టు పార్టీ అడుగిడిన సందర్భంగా నేటి క్యాడర్‌లో నూతన ఉత్తేజం నింపడంతో పాటు కమ్యూనిస్టు భావజాలానికి దూరంగా జరుగుతున్న యువతను ఆకర్షించాలి. ప్రజా సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి బహుముఖ పోరాటాలు నిర్వహించడమే గిరిప్రసాద్‌కు మనమిచ్చే నివాళి. శత వసంత వేళ కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో నిప్పులు చెరగని సూర్యుడిలా మసకబారని చంద్రునిలా నిలిచిన గిరిప్రసాద్‌కు అక్షరాంజలి ఘటిస్తున్నాం.


**ప్రజాపక్షం— ఖమ్మం**

## ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ నెల 27న పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు. అయితే రాగల రెండురోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయన్నారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, దాంతో పాటు కర్నాటక, తమిళనాడుతో పాటు దక్షిణ మధ్య ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు.

## 42శాతం బిసి రిజర్వేషన్లు అమలుకు కృషి

### ఢిల్లీలో కులగణనపై టిపిసిసి మహేష్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. కులగణన వల్ల రాష్ట్రంలో కులాల వారీగా లెక్కలు తేలాయని, దాంతో ఏ కులానికి ఎంత రిజర్వేషన్లు ఇవ్వాలో లెక్క తేలిందన్నారు. ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయం ఇందిరా భవన్‌లో శుక్రవారం ఆయన కులగణనపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశంలో ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు జైరాం రమేష్, కొప్పుల రాజు, మధుయాష్కీ, దేశవ్యాప్తంగా ఉన్న ఎఐసిసిసి జాతీయ అధికార ప్రతినిధులు, మీడియా ఇంచార్జ్‌లు పాల్గొన్నారు. సుమారు రెండున్నర గంటలపాటు సాగిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన కులగణన ప్రక్రియను కూలంకుషంగా వివరించారు. బిసి కులగణన హామీతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కులగణన హామీ ఇవ్వడంతో సమాజంలో బిసిలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వేగవంతమైన కార్యాచరణతో చేసిన కులగణన దేశానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. కులగణన దేశంలోనే మొదటిసారి తెలంగాణలో జరగడం, అది కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరగడం గొప్ప విషయమన్నారు. రాహుల్‌గాంధీ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణలో కులగణన చేపట్టామన్నారు. రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపినట్లు వివరించారు. ఇది చరిత్రాత్మక నిర్ణయం, దేశంలో మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వకారణమన్నారు.



## బూటకపు ఎన్‌కౌంటర్‌లు ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** బూటకపు ఎన్‌కౌంటర్‌లు ఆపాలి.. మావోయిస్టులతో చర్చలు జరపాలని, మతోన్మాదానికి వ్యతిరేకంగా జనసేవాదళ్ కార్యకర్తలు పోరాడాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. జనసేవాదళ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాలు ఈనెల 26 నుండి 31 వరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరుగుతున్న నేపథ్యంలో శిక్షణ శిబిరాలు విజయవంతం చేయాలని వరంగల్ శివనగర్‌లోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్, సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కె.బాష్‌మియా, పనాస ప్రసాద్, జనసేన రాష్ట్ర నాయకులు బోయిని అశోక్, మారెపాక అనిల్ కుమార్, దండు లక్ష్మణ్, బుస్సా రవీందర్‌తో కలసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మత ఉన్మాదం పెరిగిపోయి దేశ సమైక్యతకు ముప్పువాటిల్లే ప్రమాదముందని, ఇలాంటి వాటిని ఎదుర్కోవటానికి జనసేవాదళ్ కార్యకర్తలు ముందుండాలని కోరారు. జనసేవాదళ్ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడానికి మే 26 నుండి 31 వరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఆరు రోజులపాటు యువతకు సామాజిక సేవ, ప్రజలు విపత్కర పరిస్థితిలో ఉన్నపుడు, వరదలు, అగ్నిప్రమాదాలు, రైలు ప్రమాదాలతో పాటు జాతరలో ప్రజలకు సేవలు అందించే విధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను లేకుండా చేస్తామని అమాయక గిరిజనులను హతమారుస్తున్నారని, మావోయిస్టులు చర్చలకు వస్తామన్నా వారితో చర్చించకుండా బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని విమర్శించారు. అడవి సంపదను అంతా కూడా ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితమైన విధానాలను అవలంబిస్తున్నదని ఆరోపించారు. మావోయిస్టులు ఈ దేశ పౌరులేనని, ఇప్పటికైనా మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యలను శాంతియుతంగా పరిష్కరించడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్నారపు రమేష్, కందిక చెన్న కేశవులు, సంగి ఎలేందర్, ఓర్సు రాజు తదితరులు పాల్గొన్నారు.

## కవిత ప్రశ్నించినప్పుడు కెసిఆర్ సమాధానం ఏదీ?

### బిజెపితో బిఆర్ఎస్ దోస్తీపై ముందునుంచే చెబుతున్నాం
### రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** బిఆర్ఎస్, బిజెపి వేర్వేరు కాదని, గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ విమర్శించారు. గత పది సంవత్సరాలు బిఆర్ఎస్, బిజెపి మధ్య ఉన్న సంబంధంపై తాము ప్రశ్నిస్తూనే ఉన్నామన్నారు. తాము అడిగితే రాజకీయం అని అన్నారని, మరి కెసిఆర్ కూతురు కవితనే ఈ ప్రశ్నలు అడిగితే అందుకు కెసిఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తన తండ్రి, బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు రాసిన లేఖపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 2001 నుంచి పార్టీలో ఉన్నవారికి ఎందుకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వడం లేదని, బిజెపిపై సరైన విమర్శలు ఎందుకు చేయలేదని కవిత ప్రశ్నించారని పేర్కొన్నారు. కవిత నేరుగా పార్టీ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశారని తెలిపారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, హరీష్‌రావులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. గతంలో తెలంగాణ సగటు మనిషికి ఉన్న అనుమానాన్ని కవిత వ్యక్తం చేశారన్నారు. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు బలీయంగా నిజనిర్ధారణ జరిగే విధంగా కవిత లేఖ ఉందన్నారు. కాంగ్రెస్, బిజెపిలోని కొందరితో బిఆర్ఎస్ పార్టీలోని కొంత మంది స్నేహపూర్వకంగా ఉంటున్నారని కవిత ప్రశ్నించారని పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం తప్పు చేస్తున్నా కెసిఆర్ ఎందుకు ప్రశ్నించడం లేదని కాంగ్రెస్ అడిగితే రాజకీయం అన్నారన్నారు. ప్రజాస్వామ్యానికి అవకాశం లేని పార్టీ బిఆర్ఎస్ అన్నారు. పార్టీ అధ్యక్షుడు సామాన్య కార్యకర్తలను కలవడం లేదని కూతురే విమర్శిస్తోందన్నారు. అధ్యక్షుడు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, కార్యకర్తల కష్టాలు పంచుకోవడం లేదన్నారు. అంత పెద్ద సభలో 2001 నుంచి పార్టీలో ఉన్న సీనియర్‌లకు మాట్లాడే అవకాశం ఎందుకు ఇవ్వలేదని కవిత లేఖలో ప్రశ్నించారన్నారు. కవిత లేవనెత్తిన అంశాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ ట్రబుల్ షూటర్ అని చెప్పుకునే హరీష్‌రావు, అధ్యక్షుడు కెసిఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో బిజెపి నాయకత్వం సైతం సమాధానం చెప్పాలన్నారు. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయికారి ఒప్పందం ఉందన్నారు. బిజెపి అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉన్నప్పుడు బిజెపి, బిఆర్ఎస్ రాజకీయ అగ్రిమెంట్ ప్రకారం కెసిఆర్ సూచన మేరకే కిషన్ రెడ్డి అధ్యక్షుడు అయ్యారని పేర్కొన్నారు. కిషన్ రెడ్డి కెసిఆర్ ప్రతిపాదించిన అధ్యక్షుడు కాదా? దీనిపై స్పందించాలన్నారు. దేశబడ్జెట్‌లో తెలంగాణకు రూపాయి ఇవ్వకపోయినా కెసిఆర్ ప్రశ్నించలేదన్నారు. విభజన హామీలు అమలు కాకపోయినా మాట్లాడలేదన్నారు. సీలేరు ప్రాజెక్ట్ ఎత్తుకుపోతే ఎందుకు మౌనంగా ఉన్నారో ప్రజలకు చెప్పాలన్నారు. కవిత లేఖను, ప్రశ్నల నుంచి ప్రజలను డైవర్షన్ చేయడానికి కెటిఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికపై ఈడీ పేరుతో వేదింపులు జరుపుతున్న కేసు బిజెపి వేదింపు కార్యక్రమేనన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు సంపాదించుకోవాలనుకుంటే లెక్క లేదన్నారు. 50 మంది ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులను చేసిన ఘనత వారిదేనన్నారు. కానీ వారు దేశం కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నారన్నారు. కెటిఆర్, బిజెపి డైరెక్షన్‌లో రేవంత్‌రెడ్డిపై మాట్లాడుతున్నారన్నారు. కాళేశ్వరం బాంబు పెట్టారేమో అని కమిషన్ వేశారన్నారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్‌రెడ్డి పేరుతో సిఎం అవినీతి గుట్టురట్టు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరు పెట్టడంతో సిఎం అవినీతి బండారం మొత్తం బయటపడిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. యంగ్ ఇండియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు ఇప్పిస్తానని రేవంత్ రెడ్డి ప్రలోభపెట్టాడని ఈడి నమోదు చేసిన చార్జిషీట్‌తో సిఎం అవినీతి సామ్రాజ్యం బట్టబయలైందన్నారు. అధికారం కోసం ముఖ్యమంత్రి కాకముందే కాంగ్రెస్ పార్టీ పెద్దలకు వందల కోట్లు కట్టబెట్టిన వ్యవహారం కుండబద్దలు కొట్టినట్టయిందని విమర్శించారు. వందల కోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం గత ఏడాదిన్నరలో సిఎం పదవిని అడ్డం పెట్టుకుని ఏకంగా వేల కోట్లకు చేరిందని ఆరోపించారు. నాలుగు కోట్ల ప్రజల ముందు ముఖ్యమంత్రి అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో కుడితిలో పడిన ఎలుకలా తయారైందన్నారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఈసారైనా రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకుం టుందా? లేదా రేవంత్ రెడ్డి పొంగులేటి తరహాలో చీకట్‌లో బిజెపి పెద్దల కాళ్లు పట్టుకుంటాడా? ఈడి, కేవలం చార్జిషీటులో పేరు పెట్టడం వరకే పరిమితం అవుతుందా? లేదా అమృత్ పథకం వంటి స్కామ్‌ల తరహాలో వదిలిపెడతారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న అన్నారు.

**మీ తప్పులు ఎత్తి చూపిస్తే కోర్టు తీర్పులను అపహాస్యం చేస్తారా? : కెటిఆర్**

కంచె గచ్చిబౌలి అయినా, పాలమూరు ప్రాజెక్ట్ అయినా, మీ తప్పులు ఎత్తి చూపిస్తే కోర్టు తీర్పులను అపహాస్యం చేస్తారా? అని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేయడంపై టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలతో పూర్తిగా విస్మయం చెందానని అన్నారు. ఈ వ్యాఖ్యలు చేయడం సుప్రీంకోర్టును మాత్రమే కాదు, భారత రాజ్యాంగాన్ని కూడా కించపరచడమన్నారు.

## 'నేడు' నీతి ఆయోగ్ సమావేశానికి సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** 'వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్—2047' ఎజెండాతో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం శనివారం ఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరగనుంది. 2018 తర్వాత తొలిసారిగా తెలంగాణ ముఖ్యమంత్రి నీతి ఆయోగ్ సమావేశానికి హాజరవుతున్నారు. ఇందు కోసం సిఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం 'తెలంగాణ రైజింగ్—2047 విజన్'ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. తెలంగాణలో 2047నాటికి సాధించదల్చుకున్న లక్ష్యాలు, సుపరిపాలన విధానాలతో పాటు సమగ్రాభివృద్ధికి కేంద్రం అందించాల్సిన సహాయ సహకారాలపై శనివారం ఢిల్లీలో జరగనున్న నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నివేదికను సమర్పించనున్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పెట్టుబడుల సాధన, మౌలిక వసతుల అభివృద్ధికి 'తెలంగాణ రైజింగ్'తో ముందుకు సాగుతున్న తీరును, ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సమగ్రంగా వివరిస్తారు. ముఖ్యంగా ఐటి, ఫార్మా, అర్బనైజేషన్ ముందున్న తెలంగాణ వాటిల్లో మరింత వేగంగా ముందుకు పోయేందుకు చేపడుతున్న చర్యలను వివరించనున్నారు. తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పన, సమగ్రాభివృద్ధిలో భాగంగా రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లు, డ్రైపోర్ట్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐటిఐలను ఎటిసిలుగా మార్పు, యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ప్రపంచ స్థాయి సౌకర్యాలతో యూనివర్సిటీల ఏర్పాటుపై ప్రభుత్వం తీసుకున్న చొరవను గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ముందు వివరించనున్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి చేసిన రుణమాఫీ, వరికి బోనస్, సంక్షేమంలో భాగంగా అందిస్తున్న సన్న బియ్యం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ.500లకే సిలిండర్ సరఫరా వంటి రాష్ట్రంలో నిరుపేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేస్తారు. సామాజిక సాధికారతలో భాగంగా ఎస్‌సి కులాల ఉప వర్గీకరణ, కులగణన, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని శాసనసభలో తీర్మానించిన అంశాలనూ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు.

## బిజెపి, బిఆర్ఎస్ సంబంధం ఏమిటో తెలంగాణ ప్రజలకు స్పష్టమైంది

### మెట్టు సాయి కుమార్ పిసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కవిత లేఖ ద్వారా బిజెపి, బిఆర్ఎస్ సంబంధం ఏమిటో తెలంగాణ ప్రజలకు, సమాజానికి స్పష్టమైందని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ వేర్వేరు కాదని గతంలో కాంగ్రెస్ పార్టీ అనేక సార్లు చెప్పిందని, అదే విషయాన్ని ఎమ్మెల్సీ కవిత బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు రాసిన లేఖలో ప్రస్తావించారని అన్నారు. తెలంగాణను అవమానించిన బిజెపితో కలిసి పనిచేసినందుకు తెలంగాణ సమాజానికి బిఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట కవిత రాసిన లేఖలో అడిగిన ప్రతి ప్రశ్నకూ సమాధానం చెప్పాల్సిన బాధ్యత బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై ఉందని అన్నారు. బిఆర్ఎస్ విధానాలు ఏమిటని కవిత తన తండ్రిని అడిగారని, ఈ ప్రశ్నలకు కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు కాకుండా ఇంకెవరు సమాధానం చెప్తారని ఆయన ప్రశ్నించారు. బిజెపి, బిఆర్ఎస్ మిలాకత్‌కు నిదర్శనం పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి గెలిచిన సీట్లేనని పేర్కొన్నారు. కెటిఆర్ వద్ద ఆయన సోదరి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఉందా అని ప్రశ్నించారు. ఇప్పుడు కెటిఆర్ యూట్యూబ్ ఛానల్‌లు ఏమయ్యాయని, ఈ వార్త ఎందుకు కెటిఆర్ పేపర్‌లో, యూట్యూబ్ ఛానల్‌లలో రావడంలేదని సాయి కుమార్ నిలదీశారు. బిజెపికి మద్దతు ఇవ్వడంలో కెటిఆర్ ముందు వరుసలో ఉంటారన్నారు. తెలంగాణలో ఇక బిఆర్ఎస్ పార్టీకి మనుగడలేదన్నారు.

## హుస్సేన్‌సాగర్‌లో ఎస్‌డిఆర్‌ఎఫ్ ప్రదర్శన

### పర్యవేక్షించిన డిజిపి డాక్టర్ జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ (టిజిఎస్‌పి) సిబ్బంది తో ఏర్పాటైన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్) హుస్సేన్ సాగర్‌లో శుక్రవారం ప్రదర్శించింది. డిజిపి డాక్టర్ జితేందర్, అదనపు డిజిపి మహేష్ భగవత్,టిజిఎస్‌పి అదనపు డిజిపి సంజయ్‌కుమార్ జైన్‌లు పర్యవేక్షించారు.వరదలు సంభవించినప్పుడు ప్రజలను కాపాడేందుకు తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్‌లోని అన్ని బెటాలియన్ల సిబ్బందితో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. గత డిసెంబర్ నెలలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. 1వ బెటాలియన్ యూసుఫ్‌గూడ, 2వ బెటాలియన్ ఆదిలాబాద్, 3వ బెటాలియన్ ఇబ్రహీంపట్నం, 4వ బెటాలియన్ వరంగల్, 5వ బెటాలియన్ ములుగు, 6వ బెటాలియన్ కొత్తగూడెం, 7వ బెటాలియన్ నిజామాబాద్, 8వ బెటాలియన్ కొండాపూర్, 10వ బెటాలియన్ బీచ్‌పల్లి, 12వ బెటాలియన్ నల్గొండ, 13వ బెటాలియన్ మంచిర్యాల, 17వ బెటాలియన్ సిరిసిల్ల సిబ్బందితో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) సిబ్బందితో శిక్షణ ఇప్పించారు. కటక్ (ఒడిశా), ఆర్కోణం (తమిళనాడు) వడోదర (గుజరాత్), పూణే (మహారాష్ట్ర), విజయవాడ (ఎపి) లోని ఎన్‌డిఆర్‌ఎఫ్ కేంద్రాలలో రెండు నెలల శిక్షణ పొందారు. శిక్షణ పొందిన టిజిఎస్‌పి సిబ్బంది హుస్సేన్ సాగర్ లోని బోట్ క్లబ్ వద్ద ప్రదర్శన ఇచ్చారు. బాధితులు నీళ్లలో మునిగిపోయినప్పుడు, ఆపదలో చిక్కుకున్నప్పుడు వారిని రక్షించే ప్రయత్నాలను ప్రదర్శన ద్వారా చూపించారు.

## పోలీస్ ఎన్‌కౌంటర్‌లో విజయలక్ష్మి మృతి

### కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన మహిళగా గుర్తింపు



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పోలీసులకు, నక్సల్‌కు జరిగిన ఎదురు కాల్పుల్లో విజయలక్ష్మి అలియాస్ భూమిక మృతి చెందినట్లు అధికారులు ధృవీకరించారు. చత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన వన్నాడ సాయిలు గౌడ్ మొదటి భార్య రాధమ్మకు ముగ్గురు ఆడపిల్లలు, మూడో సంతానం విజయలక్ష్మి జన్మించిన ఏడాదికే పాము కాటుకు గురై రాధమ్మ మృతి చెందింది. అక్కడి నుండి విజయలక్ష్మి కేశంపేటలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి మహబూబ్‌నగర్‌లో డిగ్రీ పూర్తి చేసిన తరువాత హైదరాబాద్ లోని నిజాం కళాశాలలో ఎల్ఎల్‌బి చదువుతున్న సమయంలో ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై ఉద్యమ బాట పట్టిన విజయలక్ష్మి అలియాస్ భూమిక మృతి చెందినట్లు వివరించారు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్ళిన యువతి అక్కడి నుండి అన్నల ఉద్యమాలకు ఆకర్షితురాలై పన్నెండు ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉండిపోయింది. ఉద్యమాలకు ఆకర్షితురాలై వెళ్ళి మృత్యువు ఒడిలోకి చేరుకుంది. అప్పటి నుండి కుటుంబ సంబంధాలను తెంచుకొని ఉద్యమంలోకి వెళ్ళిన తర్వాత విజయలక్ష్మి తో ఏనాడు మాట్లాడలేదని, గ్రామానికి రాలేదని కుటుంబ సభ్యులు వివరించారు. పన్నెండు ఏళ్లుగా గ్రామానికి రాకుండా పోయిం ఎక్కడ ఛత్తీస్‌గఢ్‌లో రాష్ట్రంలో జరిగిన ఆపరేషన్ కగార్‌లో మృత్యువుపాలు కావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఇన్నేళ్లుగా ఎక్కడ ఉందో..ఏమి చేస్తుందో తెలియక గ్రామస్తులు విజయలక్ష్మిని పూర్తిగా మరచిపోయిన తరుణంలో నక్సల్స్ బరిలో ఉంటూ ఉద్యమాల కోసమే ఊపిరి పోయిందన్న సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.


**మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం: కల్వకుర్తి నాగర్‌కర్నూల్ జిల్లా**

'ఈ'– ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

టెండర్ నోటీసు నం. E1/పెయింటింగ్/W-1/GF/2025-26/001, తేదీ. 23.05.2025

కల్వకుర్తి మునిసిపాలిటీలో జనరల్ ఫండ్ కింద (1) పనులకు 'ఈ'సేకరణ ప్లాట్‌ఫాంలో టెండర్లు పిలవబడినవి. 1. అంచనా విలువ: రూ. 3.50 లక్షలు, 2. పని పేరు: జనరల్ ఫండ్ 2025-26 కింద కల్వకుర్తి మునిసిపాలిటీలోని మున్సిపల్ కార్యాలయ భవనానికి నిర్వహణ మరియు పెయింటింగ్; 3. బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ మరియు సమయం: 24.05.2025 @ ఉదయం 11 గం.లకు; 4. బిడ్ సమర్పణ ముగింపు తేదీ మరియు సమయం: 26.05.2025 @ మధ్యాహ్నం 4.30 గం.లకు మరిన్ని వివరాలను 'ఈ'-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చు అంటే 'www.eprocurement.gov.in బిడ్డను ఆహ్వానించే అధికారి కమిషనర్, కల్వకుర్తి మునిసిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సెల్ నెం. 9110540243, 7331109838.

DIPR R.O.No: 2386-PP/CL/ADVT/1/2025-26 Date: 23-05-2025 Sd/- కమిషనర్, కల్వకుర్తి మునిసిపాలిటీ

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శనివారం, మే 24

# అకాల వర్షాలు – అపారనష్టం

వాతావరణ పరిస్థితులు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ఎండలు మండే మే నెల లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు దంచికొట్టాయి. గాలులు వీచాయి. పగలు ఎండ – రాత్రి చల్లదనం, కొన్ని రోజులు ఉక్కపోత. ప్రధానంగా మెదక్, సూర్యాపేట, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో వరి రైతులకు అపారమైన నష్టం సంభవించింది. ఇందుకు వికటించిన ప్రకృతితోపాటు, ధాన్యసేకరణలో ప్రభుత్వ వైఫల్యాలు కారణం. పంట చేలల్లో నిలువుమీద ఉండగా, పంట కళ్లాల్లో ఉండగా చెదురుమదురుగా కురిసే అకాల వర్షాలకు నష్టపోవటం రైతు వ్యవసాయ జీవితంలో సర్వసాధారణం. కాని కోతలన్నీ అయిపోయి కొనుగోలు కేంద్రాలకు చేరినాక వారం – పది రోజులు కొనుగోలు జరగక పోవటం, ఇంతలో వర్షాలు కురిసి ధాన్యం కొట్టుకుపోవటం, తడిసిపోవటం, కాపాడుకునేందుకు తగినన్ని టార్పాలిన్‌లు లేకపోవటం దారుణం. అవసరమైనంతగా హమాలీలు లభ్యంకాకపోవటం, రవాణాకు లారీలు దొరక్కపోవటం, మిల్లుకు చేరినాక వారు వెంటనే గోతాలు దించుకుని గోదాముకు చేర్చకపోవటం ఇత్యాది – ఒక్కోచోట ఒక అవాంతరం.

వర్షానికి తడిసిన ధాన్యం కొనటానికి అధికారులు తిరస్కరిస్తున్నారని మెదక్ జిల్లా రంగంపేట రైతులు గురువారం రాస్తారోకో చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో రైతు సేవా సహకార సంఘం నిర్వహిస్తున్న ధాన్య సేకరణ కేంద్రం వద్ద ఉప్పుల వెంకన్న అనే రైతు పెట్రోలు పోసుకుని ఆత్మహనన ప్రయత్నం చేయగా, తోటి రైతులు జోక్యం చేసుకుని అతన్ని కాపాడారు. ఆ రైతు 15వ తేదీన తెచ్చిన 150 బస్తాల ధాన్యాన్ని బుధవారం సాయంత్రం వరకు తూకం వేయలేదట! రవాణాలో తలెత్తిన జాప్యాలు కారణమని వివరించిన పౌరసరఫరాల అధికారి, తడిసిన ధాన్యం కూడా కొంటామని రైతులకు ఊరట చేకూర్చారు. అనేక కొనుగోలు కేంద్రాలవద్ద రైతులు కనీసం మూడు రోజులు పడిగాపులు పడుతున్నారు. సూర్యాపేట జిల్లాల్లో బుధవారం కురిసిన భారీ వర్షానికి తుంగతుర్తి, అరవపల్లి, తిర్మల్‌గిరి, నాగారం మండలాల్లోని ఐకెపి కేంద్రాల్లో నిల్వచేసిన దాదాపు 5వేల క్వింటాళ్ల ధాన్యం నీటమునిగింది. జనగామ జిల్లాలో కూడా ధాన్యం కొనుగోలు నెమ్మదిగా సాగుతోంది. 1,85,000 టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా ఇంకా పూర్తికాలేదు. కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి మార్కెట్‌లో వర్షాలకు ధాన్యం దెబ్బతింది. ధాన్యం కొనుగోలుకు తాము 20రోజులుగా ఎదురు చూస్తున్నామని పలువురు రైతులు వాపోయారు. సిద్దిపేటలో వరిధాన్యం నాల్గవసారి నీళ్లలో నానింది. తోగుట, రామాయంపేట, తూప్రాన్ ప్రాంతాల్లో కూడా ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల ధాన్యం పూర్తిగా నీటిప్రవాహంలో కొట్టుకుపోయింది. ఇవి రైతుల దుర్భర అవస్థలకు, మనస్తాపానికీ కొన్ని ఉదాహరణలు. అంతకుముందు ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా ఇటువంటి అవస్థలే ఎదురైనాయి.

రైతులు ఆందోళన చెందవద్దు, తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతుధరకు కొనుగోలు చేస్తామని మంత్రులు రైతులకు భరోసా ఇస్తున్నా, ఆచరణలో తరుగుతీయటం వంటి సమస్యలు తప్పటం లేదు. అంచనాలకు మించి వరి దిగుబడి కూడా ఈ సమస్యకు కారణమనవచ్చు. బిఆర్‌ఎస్ వారి విమర్శలకు జవాబుగా ఇరిగేషన్, పౌరసరఫరాలమంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన సమాధానం దీన్ని సూచిస్తోంది. 2022–23లో రబీ పంట కాలంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం సేకరించిన వరి ధాన్యం 36.63 లక్షల మెట్రిక్ టన్నులు కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంవత్సరం (2024–25 సీజన్)మే 22 వరకు కొనుగోలు చేసిన ధాన్యం 60.61 లక్షల మెట్రిక్ టన్నులు. అంతకుముందు ఖరీఫ్ సీజన్‌లో కూడా ధాన్యం ఇబ్బడిముబ్బడిగా పండింది. ప్రభుత్వం చివరి గింజవరకు కొంటుందని చెబుతూ, వర్షానికి తడిసిన, తేమ ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు. వరిధాన్యం ఉత్పత్తిలో నెం.1 స్థానానికి చేరామని సంబరపడే ప్రభుత్వం రైతుల ఇబ్బందులను తొలగించినపుడే రైతు కంట, ఇంట సంతృప్తి, సంతోషం.

# పాఠ్యపుస్తకాలనుంచి చరిత్ర కత్తిరింపు


రాం పునియాని

నూతన విద్యావిధానం–2020 క్రమం గా అమలులోకి తెస్తున్నారు. మిగతా విషయాలతోపాటు అది భారతీయ జ్ఞాన వ్యవస్థలు, భారతీయ సంప్రదాయాలపై దృష్టి కేంద్రీకరించింది. చరిత్ర కు సంబంధించి చేసిన మార్పుల్లో ఢిల్లీ సుల్తానేట్, మొగలాయీల పాలనను పుస్తకాలనుంచి తొలగించారు. దాదాపు 700 సంవత్సరాల చరిత్ర కనుమరుగు చేయబడింది. ఏ ప్రమాణంతో చూసినా ఇది చాలా సుదీర్ఘకాలం. ఎన్‌సిఇఆర్‌టి ఇంతకుముందే మొగలాయీలు, ఢిల్లీ సుల్తానులపై పాఠ్యాంశాలను కుదించింది. కోవిడ్–19 మహమ్మారి కాలంలో 2022–23లో సిలబస్ తగ్గింపులో భాగంగా అది తుగ్లక్‌లు, ఖిల్జీలు, మాంలుక్‌లు, లోడీలు వంటి రాచరికాల వివరాలను, మొగల్ చక్రవర్తుల సాఫల్యాలకు సంబంధించి రెండు పేజీల పట్టిక అందులో ఉన్నాయి. ఇప్పుడు కొత్తపుస్తకం వారికి సంబంధించిన ప్రస్తావనలన్నింటినీ తొలగించింది.

7వ తరగతి పాఠ్యపుస్తకం నుంచి ఢిల్లీ సుల్తానేట్, మొగల్ పాలకుల ప్రస్తావనలన్నీ తొలగించబడినాయి. ఇతర పుస్తకాలకు సంబంధించి ముస్లిం పరిపాలన ప్రస్తావనలు ఎక్కడవున్నా అవి తొలగించబడినట్లు పరిగణించబడతాయి. తొలగించబడిన వాటిలో ముంబై హింస (92–93) అనంతర, గుజరాత్ హింస (2002) అనంతర ప్రస్తావనలు, అలాగే నాథురాం గాడ్సె ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ అన్న ప్రస్తావన, గాంధీ హత్యానంతరం ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం ప్రస్తావన తదితరాలున్నాయి. కుంభమేళాకు స్థానం లభించింది, ఆ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో అనేకమంది మరణించటం, అలాగే ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట ప్రస్తావనలేదు.

ఇదంతా కోవిడ్ కాలంలో మొదలైంది. విద్యార్థులపై భారం తగ్గించటం సాకుగా చెప్పారు. సిలబస్ 'క్రమబద్ధీకరణ' అన్నారు. హిందూ జాతీయవాద భావజాలానికి ఇబ్బందికరంగా ఉన్న ఈ భాగాలన్నిటినీ తొలగించారు.

ముస్లింలను రాక్షసులుగా చూపేందుకు, వారిపై ద్వేషం వ్యాప్తి చేసేందుకుగాను మొగలాయీలను మన చరిత్రలో విలన్‌లుగా చూపారు. అల్లావుద్దీన్ ఖిల్జీ లాంటి కొందరు అంతకు పూర్వ రాజులు కూడా హిందూత్వ కథనంలో కత్తెరకు గురైనారు. ముస్లిం రాజులను రాక్షసులుగా చిత్రించటమన్నది ఇంతవరకు దేవాలయాల ధ్వంసం చుట్టూ అల్లికతో ఉండేది. హేతువాద చరిత్రకారులు దాన్ని ఖండించా రు. ముస్లిం రాజులు తమ కత్తిని ఉపయోగించి ఇస్లాంను వ్యాప్తి చేశారన్నది ఈ కథనానికి మరో స్తంభం. ఇస్లాంలోకి మతమార్పిడి ఆరంభంలో ముస్లిం అరబ్ వ్యాపారులతో సంబంధాలవల్ల జరిగినందున ఈ అంశం పూర్తిగా అసత్యం. అటుతర్వాత, కుల వ్యవస్థ నిరంకుశత్వాన్ని తప్పించుకోవటానికి దిగువస్థాయి కులాలనేకం ఇస్లాంను ఆలింగనం చేసుకున్నాయి.

హిందూత్వ భావజాలం ఈ కాలాన్ని చీకటికాలంగా, హిందువులకు వ్యతిరేకంగా నరమేధం జరిగిన కాలంగా చిత్రించేంతదూరం వెళ్లింది. రాచరికాల పరిపాలనకాలం రాజకీయ కారణాలతో ఎడతెగని యుద్ధాలు జరిగిన కాలం. తమ రాజ్యాలు విస్తరించాలని రాజులెప్పుడూ కోరుకున్నారు, ఆ క్రమంలో అనేకమంది హతులైనారు. దాన్ని నరమేధం అని పిలవటం పూర్తిగా సత్యదూరం. బ్రిటిష్‌వారు 'విభజించు–పాలించు' విధానం అమలు చేసేందుకు ప్రవేశపెట్టిన మతతత్వ చరిత్ర రచన నుండి హిందూత్వ వాదుల కథనం ఆరంభమైంది. ఇందులో రాజుల ఉద్దేశాలన్నీ మతంతో ముడిపెట్టబడినా యి, రాజులు మొత్తం మత సమాజానికి ప్రతీకగా చిత్రించబడ్డారు.

హిందూ మతతత్వ చరిత్ర రచన ముస్లింలు, క్రైస్తవులను, హిందువులను హింసలుపెట్టిన 'విదేశీయులు'గా చిత్రిస్తూ మరికొంత ముందుకెళ్లింది. ముస్లిం మతతత్వ చరిత్ర రచన ఒకే నాణేనికి రెండో పార్శ్వంగా ముస్లింలను పాలకులుగా, హిందువులను వారికి సేవచేసే పౌరులుగా చిత్రించింది. ముస్లింలు తార్కికంగా ఈ దేశానికి పాలకులు అని వారు చిత్రించారు.

ఈ తర్కాన్ని ముందుకు తీసుకెళ్లటం మన ఉమ్మడి దేశాన్ని భారత్, పాకిస్థాన్‌గా విభజించేందుకు బ్రిటిష్‌వారికి సహాయపడింది. ఈ దేశంలో రెండు జాతులున్నాయని సావర్కార్ వ్యక్తీకరించారు. జిన్నా ముస్లింలకు ప్రత్యేక దేశంగా పాకిస్థాన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ముందుకెళ్లారు. పాకిస్థాన్ దాని ఆవిర్భావం నుంచీ ముస్లిం మతోన్మాదం ఉచ్చులో పడింది. 8వ శతాబ్దంలో మొహమ్మద్ బిన్ కాశింతో పాకిస్థాన్ ఆరంభమైనట్లు వారి పాఠ్యపుస్తకాలు పేర్కొన్నాయి. ఇవాళ వారి పాఠ్యపుస్తకాలు హిందూ పాలకుల ప్రస్తావనను పూర్తిగా తొలగించాయి. హిందూ రాజు లు, సంస్కృతి ప్రస్తావనలన్నింటి తొలగింపులో హిందువులకు వ్యతిరేకం గా ముస్లిం మతోన్మాదం వ్యాప్తి చేసిన ద్వేషం శిఖరాగ్రాన్ని చేరింది.

భారతదేశం గత మూడు దశాబ్దాల్లో ఒక విధంగా పాకిస్థాన్ అడుగుజాడల్లో నడుస్తున్నది. పాకిస్థాన్ ప్రయాణం తీరు ప్రతిబింబాన్ని చివరి కామా వరకు బహుశా అనుసరిస్తున్నారు. పాకిస్థాన్ రచయిత్రి పహమిదా రియాజ్ ఈ అంశాన్ని ఎత్తిచూపారు. బాబ్రీమసీదు కూల్చివేత తర్వాత ఆమె ఇలా రాశారు: "అరె! మీరు కూడా మాలాగా మారారా! ఇప్పటిదాకా ఎక్కడ దాక్కున్నారు?"

భారతదేశ విద్యపై హిందూత్వ భావజాలం పూర్తి నియంత్రణ సాధించకమునుపు, ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు వివిధ పద్ధతుల్లో సమాజ మత స్వరూపం వ్యాప్తి చేస్తుండేవి. శాఖబౌద్ధీలు, ఏకల్ విద్యాలయాలు, శిశుమందిర్ వంటివి వాటిలో ఉన్నాయి. కాలక్రమంలో ప్రధాన స్రవంతి మీడియా, సోషల్ మీడియా దాని సేవలోకి వచ్చాయి.

ఆ విధంగా, సంస్కృతి అనేది నిరంతరాయంగా రూపుదిద్దుకునే క్రమం. చరిత్ర క్రమంలో చాలామార్పులు సంభవించాయి. వాస్తుకళలోనే కాకుండా ఆహారపు అలవాట్లు, దుస్తులు, సాహిత్యం, మతరంగంలో సమ్మిళితం, గొప్ప భక్తి, సూఫీ సంప్రదాయాలు వృద్ధి చెందాయి. ఈ కాలంలోనే సిక్కుమతం ఆవిర్భవించింది, వికసించింది.

ఈ రాజకీయ భావజాలం ఇప్పుడు దాని మార్గాన్ని మార్చుకోవలసి ఉంటుంది. ముస్లిం పాలకులు లేనందున వారిప్పుడు ముస్లింలను రాక్షసులుగా ఎలా చిత్రించగలరు? ఔరంగజేబు లేదా బాబర్ ఇప్పుడు లేరు కాబట్టి కొత్త టెక్నిక్‌లు ఊహిస్తూ ఉండవచ్చు.

జాతీయవాద భావనకు చరిత్ర చాలా కీలకం. 'జాతీయవాదులకు చరిత్ర నల్లమందుకు అలవాటుపడినవారికి నల్లమందు మొక్క లభించటం లాంటిది' అన్నారు ఎరిచ్ ఫ్రోమ్. బిజెపి 1998లో ఎన్‌డిఎగా అధికారంలోకి వచ్చాక వారు చేసిన పెద్దపని 'విద్య కాషాయీకరణ'. ఇక్కడ ముస్లిం రాజులను దుష్టులుగా, దుందుడుకు వాదులుగా, హిందూ రాజులను ఉజ్వలంగా, సాహసోపేతులుగా చిత్రించా రు. వామపక్ష చరిత్రకారులు ఇంతవరకు చరిత్ర రచించారని, వారు ఢిల్లీ పాలకులపైన, ముస్లిం అనుకూలురుపైన దృష్టిపెట్టారని ఆరోపించారు. రాచరిక సామ్రాజ్యాలు చరిత్రలో ఎంతకాలం పరిపాలించాయన్న దాన్నిబట్టి పాఠ్యపుస్తకాల్లో వివరాలు పొందుపరచబడతాయి.

1980వ దశకంలో వచ్చిన పాఠ్యపుస్తకాల్లో హిందూ, అలాగే ముస్లిం రాజులగూర్చి మంచి సమాచారమే ఉంది. కథనం కేవలం మతం చుట్టూ తిరగలేదు. జన సమూహాల గూర్చిన సమగ్ర దృక్పథం – అనగా వాణిజ్యం, సంస్కృతి, సాహిత్యం తదితర అంశాలు పొందుపరచబడ్డాయి.

అయితే మన భవిష్యత్‌ను నిర్మించుకోవటానికి 'రాజు కేంద్రకంగా ఉన్న చరిత్ర' మనకు అవసరం లేదు. అటువంటి కథనాల్లో స్థానం లభించని విభిన్నమైన సామాజిక విభాగాలపై – అనగా దళితులు, మహిళలు, ఆదివాసీలు, చేతివృత్తులవారిపై మనం కేంద్రీకరించాలి.

(ఐపిఎ సర్వీస్)

# సంపూర్ణఅక్షరాస్యత.. మిజోరం ఆదర్శం

సామాజిక అభివృద్ధికి అక్షరాస్యత మూలస్తంభం. అభివృద్ధి చెందాలనుకున్న ప్రతి రాజ్యం, దేశం తమ అక్షరాస్యత స్థాయిని మెరుగుపరచుకునే దిశగా నిరంతరం కృషి చేస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఇటీవల మిజోరం రాష్ట్రం దేశంలో సంపూర్ణ అక్షరాస్యతను (95%) సాధించినట్టు అధికారికంగా ప్రకటించు కోవడం అభినందనీయమైన ఘట్టం. 1991 నుంచి త్రిపుర, కేరళ వంటి రాష్ట్రాలు అక్షరాస్యత పరంగా అగ్రగాములుగా నిలుస్తున్న సమయంలో, ఈ విజయంతో మిజోరం భారత దేశంలో అక్షరాస్యత రంగంలో మరో మార్గదర్శక రాష్ట్రంగా నిలిచింది. ఇక్కడ ఆశ్చర్యకరమైనది ఏమిటంటే, మిజోరం ఒక చిన్న, పర్వత ప్రాంతాల్లో విస్తరించి ఉన్న, దూర ప్రాంతాల్లో గ్రామాలు కలిగిన రాష్ట్రం. పైగా సాంకేతిక వనరులు, లాజిస్టిక్ సదుపాయాలు పరిమితంగా ఉండటం వల్ల అక్కడ విద్యా విస్తరణ అనేది సాధారణంగా కష్టం అనిపించే విషయం. అయినప్పటికీ, మిజోరం ఈ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేయగలగడం వెనుక కారణాలను విశ్లేషించడం అవసరం. ముఖ్యంగా, అక్షరాస్యతశాతం ఇంకా మెరుగుపరచుకోలేని తెలంగాణకిది కీలక పాఠం.

**మిజోరం విజయ రహస్యం:**

ఆదికాలం నుంచే విద్యాపట్ల చైతన్యం ఈ ప్రాంతంలో ఉన్నది. మిజోరంలో క్రైస్తవ మిషనరీల ప్రభావం ఉండటంతో, అనేక దశాబ్దాల క్రితమే విద్యకు ప్రాధాన్యత నిచ్చే సంస్కృతి ఏర్పడింది. ప్రజలలో చదువు గురించి చైతన్యం ఏర్పడినది. స్థానిక పాలనా సంస్థల చురుకు దనంతో గ్రామ స్థాయిలో విద్యా సంస్థలు, బాలబాలికల పాఠశాలల నిర్వహణలో గ్రామస్థాయి పాలనా వ్యవస్థలు ముఖ్యపాత్ర పోషించాయి. ప్రజాప్రతి నిధు లు, కమ్యూనిటీ నాయకులు విద్యాపట్ల అవగాహన కలిగించడంలో భాగమయ్యారు. ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలుప్రాథమిక స్థాయిలోనే కాకుండా, హైస్కూల్ స్థాయి వరకు విద్యా సామగ్రి ఉచితంగా అందించడం వల్ల పేద కుటుంబాల పిల్లలు కూడా చదువుపై ఆసక్తి చూపగలిగారు. క్రమబద్ధమైన సామాజిక ప్రచారాలు, అక్షరాస్యత పై ప్రభుత్వ కార్యక్రమాలు మాత్రమే కాకుండా, ప్రజలలో విద్యపై అవగాహన కలిగించే విధంగా సంఘాలు, సంస్థలు పని చేశాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం, రాష్ట్రం 91.33శాతం అక్షరాస్యత రేటును కలిగి, దేశంలో మూడవస్థానంలో ఉంది. ఈ పునాదిపై, మిగిలిన నిరక్షరాస్యులైన వ్యక్తులను గుర్తించి వారికి విద్యను అందించడానికి ULLAS మరియు నవభారత సాక్షరత కార్యక్రమాలను అమలు చేసారు. 2011జనాభా లెక్కల డేటా ఆధారంగా, సర్వేలు నిర్వహించబడ్డాయి మరియు 3,026మంది నిరక్షరాస్యుల ను గుర్తించి వారిలో1,692 మంది సంభావ్య అభ్యాస కులుగా గుర్తించారు. విద్యార్థు లు, విద్యావేత్తలు, రిసోర్స్ పర్సన్లను మరియు క్లస్టర్ రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్లు సహా మొత్తం 292మంది స్వచ్ఛంధ ఉపాధ్యాయులు ఈ మిషన్‌కు నాయకత్వం వహించడానికి ముందుకు వచ్చారు. సమిష్టి కృషి, అంకితభావం మరియు సమాజ సమీకరణ ఫలితంగా మిజోరం పూర్తి అక్షరాస్యత సాధించింది.

**తెలంగాణలో పరిస్థితి**

తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పడిన కొత్త రాష్ట్రంగా, అభివృద్ధి పథంలో వేగంగా పయనిస్తోంది. తెలంగాణలో అక్షరాస్యత శాతం సుమారు 66.54% కాగా, ఇది జాతీయ సగటుతో పోలిస్తే తక్కువ. ఇది రాష్ట్రానికి మిగిలిన పథకాల విజయాన్ని మసక బార్చే అంశం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల గిరిజన ప్రాంతాల్లో అక్షరాస్యత స్థాయిలో మరింత మెరుగుదల అవసరం ఉంది.

**అక్షరాస్యత పెంచేందుకు చేయాల్సిన కార్యక్రమాలు:**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలి. పల్లెపల్లెకు అక్షరాస్యత చొచ్చుకుపోవాలంటే అక్కడ ప్రత్యేకంగా అక్షరాస్యత కేంద్రాలు, మొబైల్ లైబ్రరీలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.నిరక్షరాస్యులు అయిన వయోజనులకు అక్షరాస్యతను పరిచయం చెయ్యాలి. ప్రాథమిక అక్షరాసత ప్రమాణాన్ని సాధించని వారికి ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు కారు అనే నియ మాలు పెట్టి ప్రజలను చదవడంపట్ల ప్రోత్సహిం చాలి. పెద్దల అక్షరాసత కార్యక్రమాలు శ్రద్ధగా కొనసాగించాలి. స్కూళ్ళకి వెళ్లని పెద్దలకు ప్రత్యేకంగా అక్షరాస్యత శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలి. వీటిని గ్రామ సచివాలయాల ఆధ్వర్యంలో నిర్వహిం చాలి. బాలికల విద్యపై దృష్టి కేంద్రీకరించాలి. బాలికల పాఠశాలల సంఖ్యను పెంచాలి, రవాణా సౌకర్యాలను మెరుగుపర్చాలి. ఎందు కంటే అక్షరాస్యతలేని మహిళలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలోనే ఉంటారు. బహుళ భాషా విధానం విద్యా కార్యక్రమాలను కొనసాగించాలి. కొన్ని ప్రాంతాలలో స్థానిక భాషలలో విద్యా సామగ్రి అందుబాటులో లేకపోవడం వల్ల విద్యాపట్ల ఆసక్తితగ్గి పోతుంది. ములుగు, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో గిరిజన భాష ల్లో పాఠ్య పుస్తకాలు అందించాలి. రాష్ట్ర బడ్జెట్‌లో వయోజన విద్యపెంపుపై సరియగు నిధులు కేటాయించాలి. సాంకేతిక వనరుల వినియోగంనుపెంచి, డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తూ, మొబైల్ యాప్‌లు, రేడియో పాఠా లు, టీవీపై ప్రసారమయ్యే విద్యా కార్యక్రమాలను విస్తృ తంగా వినియోగించాలి. సామాజిక ఉద్యమంగా అక్షరాస్యత రేటు పెంచటం జరగాలి. ఇదిసామాజిక ఉద్యమంగా రూపొందించాలి. స్వచ్ఛ భారత్ లేదా పోలియో నిర్మూలన కార్య క్రమాల్లాగే అక్షరాస్యత సాధనలో కూడా సామాజిక భాగస్వామ్యం కీలకం.

కమలహాసన్ తుమ్మ
జీవశాస్త్ర నిపుణుడు
గౌతం మోడల్ స్కూల్స్, హైదరాబాద్
9505618252

## సిపిఐ మణిపూర్ రాష్ట్ర యూనిట్ మహాసభ

# విచ్ఛిన్న శక్తులపై పోరాటం కొనసాగింపునకు ప్రతిన

భారత కమ్యూనిస్టు పార్టీ మణిపూర్ రాష్ట్ర సమితి 24న మహాసభ మే 16–18 తేదీల్లో ఇంఫాల్ తూర్పు జిల్లాలోని చలోవ్, లాంబాయ్‌లో ఇవావత్ స్మారక మందిరంలో జరిగింది. వచ్చే సెప్టెంబర్‌లో (21–25 తేదీలు) చండీగఢ్‌లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ 25వ పార్టీ కాంగ్రెస్ సన్నాహకంగా మహాసభ జరిగింది. ఇక వరుసబెట్టి అన్ని రాష్ట్రాల్లో జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభల ప్రారంభ సంకేతం ఈ మహాసభ. జాతివైషమ్యాలతో, హింసతో సంవత్సరం పైబడి కల్లోలంగా ఉన్న రాష్ట్రంలో కమ్యూనిస్టు శ్రేణుల నిబద్ధతను, స్థిర సంకల్పాన్ని ఈ మహాసభ వ్యక్తీకరించింది. సిపిఐ జాతీయ సమితి కార్యదర్శి పల్లబ్‌సేన్ గుప్తా మే, 16న మహాసభను ప్రారంభించారు. ప్రతినిధులు, సానుభూతిపరులు పెద్దసంఖ్యలో హాజరైనారు. రాష్ట్ర పార్టీ మాజీ కార్యదర్శి, రాష్ట్ర పార్టీ కంట్రోలు కమిషన్ చైర్మన్ లాంగో ఇబోయైమా, కేంద్ర కంట్రోలు కమిషన్ సభ్యుడు నారాసింగ్, రాష్ట్ర కార్యదర్శి లీసాగ్థం థోయిరన్ కూడా ప్రసంగించారు. వక్తలందరూ దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితిని, ముఖ్యంగా మణిపూర్‌లోని సంక్లిష్టమైన కల్లోల పరిస్థితిని ప్రధానంగా వ్యక్తీకరించారు. కేంద్రంలోని అలాగే రాష్ట్రంలోని ఆర్‌ఎస్‌ఎస్/బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ముమ్మరం చేయాలని పార్టీ సభ్యులు, సానుభూతిపరులకు వారు విజ్ఞప్తి చేశారు. జాతి వైషమ్యాలు రెచ్చగొడుతున్న బిజెపి విభజనవాద ఎత్తుగడలను వారు ఎండగట్టారు. ఈ ఎత్తుగడలు ప్రజలకు విపరీతమైన బాధలు, ప్రాణనష్టం కలిగించడమే గాక, మణిపూర్ ఐక్యత, భౌగోళిక సమగ్రతకు తీవ్రమైన ముప్పు తెస్తున్నది. ప్రజాస్వామ్యం, శాంతి, సామాజిక న్యాయం కాపాడుకోవలసిన అవసరాన్ని వక్తలు ఖండించారు.



అనంతరం ప్రతినిధుల సమావేశంలో రాష్ట్రసమితి కార్యదర్శి థోయిరన్ రాజకీయ నివేదిక, సహాయ కార్యదర్శి జయ కుమార్ నిర్మాణ నివేదిక ప్రవేశపెట్టారు. రాజకీయ నివేదిక మణిపూర్ ఎదుర్కొంటున్న బహుముఖ సమస్యలను, వాటిని పరిష్కరించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాన్ని, "మణిపూర్‌ను కాపాడుదాం–మానవాళిని కాపాడుదాం" నినాదంతో సంవత్సరంపాటు పార్టీ సాగించిన కార్యక్రమాన్ని వివరించింది. ప్రస్తుత సంక్షోభానికి రాజకీయ పరిష్కారాన్ని డిమాండ్ చేసింది. మరుసటి రోజు 17న నివేదికలపై చర్చలో 40మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. విలువైన సూచనలు చేశారు. కొన్ని సవరణలతో రెండు నివేదికలు ఆమోదించబడినాయి. ఆరోజు సాయంత్రం సమావేశంలో సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా ప్రసంగించారు. మతోన్మాద శక్తులకు, ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా నిలబడిన మణిపూర్ ప్రజల, కమ్యూనిస్టుల ధైర్యసాహసాలను ఆయన ప్రశంసించారు. సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజంలను రక్షించుకోవటంలో పార్టీ సూత్రబద్ధ వైఖరిని పునరుద్ఘాటించారు. ఈ ప్రాంతంలో ప్రజల మధ్య విభజనను పెంచటంలో బిజెపి విధానాలను రాజా ఖండించారు. నిరంకుశ పెత్తందారీతనాన్ని, మతోన్మాదాన్ని ప్రతిఘటించేందుకు లౌకిక, ప్రజాతంత్ర శక్తులందరి మధ్య విస్తృత ఐక్యతకు విజ్ఞప్తి చేశారు. రానున్న కాలంలో పార్టీకి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు నిర్మాణరీత్యా పార్టీని పటిష్టం చేయాల్సిన అవసరాన్ని వక్కాణించారు.

రాష్ట్ర పార్టీ కొత్త కార్యదర్శిగా అథోక్‌పం నబచంద్రను, సహాయ కార్యదర్శులుగా నంగ్‌తోంచం సిన్హజిత్‌సింగ్, ఎస్.సరోజినీదేవిలను మహాసభ ఎన్నుకుంది. 13మందితో కార్యవర్గాన్ని, 35మందితో రాష్ట్రసమితిని, ఐదుగురితో కంట్రోలు కమిషన్‌ను ఎన్నుకుంది. ప్రజాసమస్యలపై సెప్టెంబర్ 29న రాష్ట్రస్థాయి పెద్ద ర్యాలీ నిర్వహించాలని రాష్ట్ర మహాసభ నిర్ణయించింది.

# అమెరికాలో 'తెలుగు సంబరాలు'!

ప్రతి ప్రాణి తన ఉనికిని చాటుకోవడం సహజం. ఇంకా ప్రకృతిని, సృష్టిని విశ్వవ్యాప్తంగా విస్తరింపచేస్తున్న మనుషులు తమ ఉనికిని చాటుకోవడం అతిశయోక్తి కాదు. అమెరికాలో కూడా మా తెలుగు తల్లికి మల్లెపూదండ స్ఫూర్తితో తెలుగు సంఘాలు పని చేస్తున్నవి."యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా" (యుఎస్‌ఎ)50 రాష్ట్రాలతో విరాజిల్లుతుంది. అందులో న్యూ జెర్సీ, డెలావేర్, వర్జీనియా, కనెక్టికట్, ఇల్లినాయిస్, టెక్సాస్, కాలిఫోర్నియా, మేరీల్యాండ్, జార్జియా, న్యూహాంప్‌షైర్, వాషింగ్టన్, మసాచుసెట్స్, కాన్సాస్, మిచిగాన్, మిన్నెసోటా, ఉత్తరకరోలినా, అరిజోనా, పెన్సిల్వేనియా, ఒహియో, రాష్ట్రాలలో తెలుగు అమెరికన్స్ నివసిస్తున్నారు. 2024 లెక్కల ప్రకారంగా దాదాపు 12.3 లక్షల మంది తెలుగు ప్రజలు ఉంటున్నారు. అమెరికాలో విదేశీ భాషలు మాట్లాడే ప్రజలలో తెలుగు మాట్లాడే ప్రజలు 11వ స్థానంలో, భారతీయ భాషలు మాట్లాడే ప్రజలలో తెలుగు మాట్లాడే ప్రజలు 3వ స్థానంలో ఉన్నారు. తెలుగు అమెరికన్స్‌కు "స్టెమ్"లో నిష్ణాతులన్న పేరుంది. 2001లో STEM/స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్)ను "నేషనల్ సైన్స్ ఫౌండేషన్" రూపొందించింది. సైన్స్ విభాగంలో పరిశీలన లు, ప్రయోగాలు, సిద్ధాంతాల అభివృద్ధి ప్రాతిపదికన సహజ ప్రపంచాన్ని అధ్యయనం చేస్తారు. టెక్నాలజీ/సాంకేతికత విభాగంలో ఆచరణాత్మక సమస్యలను పరిష్కరించడానికి మరియు సాధనాలను, వ్యవస్థలను రూపొందించి శాస్త్రీయ జ్ఞానాన్ని, నైపుణ్యాలను వెలికితీస్తారు. ఇంజనీరింగ్ విభాగంలో నిర్మాణాలను, యంత్రాలను, వ్యవస్థలను రూపొందించడం మరియు కార్యాచరణను శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే ప్రక్రియను వేగవంతం చేస్తారు. గణితం విభాగంలో సంఖ్యల, ఆకారాల సంబంధాలను అధ్యయనం చేసి శాస్త్రీయ, సాంకేతిక విభాగాల పునాదిని పటిష్టం చేస్తూ విస్తరింపచేస్తారు. అమెరికాలోని వివిధ రాష్ట్రాలలో ఉన్న తెలుగువారు తెలుగు సంఘాలను పెట్టుకుని పండుగల సమయంలో కలుస్తారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా), ఉత్తర అమెరికా తెలుగు సంఘం, అమెరికన్ తెలుగు అసోసియేషన్, గ్రేటర్ అటాంట తెలుగు అసోసియేషన్, బే ఏరియా తెలుగు అసోసియేషన్, చికాగో తెలుగు సంఘం, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, గ్రేటర్ ఇండియానాపోలీస్ తెలుగు అసోసియేషన్, గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సొసైటీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ డెలావేర్ వ్యాలీ, సెంట్రల్ బోవా తెలుగు అసోసియేషన్, డెట్రాయిట్ తెలుగు అసోసియేషన్, మాడిసన్ ఏరియా తెలుగు అసోసియేషన్, హారీస్‌బర్గ్ తెలుగు సంఘం, త్రిరాష్ట్ర తెలుగు సంఘం, తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ (టీనా), తెలుగు అసోసియేషన్ ఆఫ్ సెయింట్ లూయిస్(టాస్) ఇంకా ప్రాంతీయంగా కూడా సంఘాలు ఉన్నాయి. హైదరాబాద్‌కు 13,811 కిలోమీటర్ల దూరంలో సెయింట్ లూయిస్ పట్టణం ఉంటుంది. దీనికి అమెరికాలో 23వ అతి పెద్ద పట్టణంగా పేరుంది. తూర్పు సెంట్ లూయిస్ మెట్రోపాలిటన్ ఇల్లినాయిస్ రాష్ట్రంలో ఉంది. కాని మిగతా 23 చదరపు మైళ్ల పట్టణం అంతా మిస్సోరి రాష్ట్రంలోని మిసిసిపి నదికి పశ్చిమ ఒడ్డున సెయింట్ లూయిస్ మహానగరం ఉంది. అందువలన మిస్సోరి స్టేట్ గానే పరిగణించుచున్నారు.

తెలుగునాట ఆంధ్రప్రదేశ్‌ను నదుల రాష్ట్రంగా పిలుచుకుంటాము. సెయింట్ లూయిస్ ను కూడా రివర్స్ టౌన్‌గా పిలువడంలో అతిశయోక్తి లేదు. పరిసరాల్లో మూడు నదులు ప్రవహించుతాయి. 'మెరామిక్ నది' సెయింట్ లూయిస్‌లోని కాజిల్ వుడ్ పార్క్ సమీపం నుండి ప్రవహించి ఆర్నాల్డ్ మరియు ఓక్విల్లే వద్ద "మిసిసిపి నది"లో కలుస్తుంది. మిస్సోరి రాష్ట్రంకు తూర్పు సరిహద్దుగా పట్టణం దిగువ నుండి "మిస్సోరి నది" ప్రవహిస్తోంది. పట్టణం ఉత్తర భాగంగా "మిసిసిపి నది" ప్రవహిస్తుంది. దాదాపు 61.74 చదరపు మైళ్ల విస్తీర్ణంలో సెయింట్ లూయిస్ పట్టణం ఉంది. లోతులేని లోయలు, సారవంతమైన నేలలు, బొగ్గు, బంక మట్టి, సున్నపు రాయి, మిల్లరైట్ నిక్షేపాలు, ఐ.టి, సీడ్స్ కంపెనీలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, వ్యవసాయంతో ఉపాధి అవకాశాలకు కొంగు బంగారంగా విరాజిల్లుతుంది. మిసిసిపి నది ఒడ్డున 630 అడుగుల స్టెయిన్ లెస్ స్టీల్ గేట్ వే ఆర్చ్ ఉంది. దీనికి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మానవ నిర్మిత స్మారక చిహ్నంగా పేరుంది.

1987లో ప్రముఖ తెలుగు సినిమా దర్శకుడు జంధ్యాల "పడమటి సంధ్యా రాగం" సినిమాను సెయింట్ లూయిస్ పట్టణంలోనే తీశాడు. ఇక్కడ విద్య, ఉపాధి అవకాశాల గురించి వచ్చే కొత్త వ్యక్తులను స్వాగతించే సంస్కృతి ఉంటుంది. నివసిస్తున్న తెలుగు జనాభా నిర్దిష్టంగా అందుబాటులో లేదు. కాని యుఎస్‌ఎ సెన్సస్ బ్యూరో 2021 లెక్కల ప్రకారంగా భారతీయుల జనాభా 17,842 మంది సెయింట్ లూయిస్‌లో నివసిస్తున్నారు. ఇక్కడి భారతీయులు ఐ.టి రంగంలో నిష్ణాతులని, నైపుణ్యులని "ఇంటర్ నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సెయింట్ లూయిస్ ప్రెసిడెంట్ 'ఆరే ఒబెన్సన్' అన్నారు. ఇక్కడి తెలుగు ప్రజలు మాత్రం సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను, సంస్కృతిని, పండుగలను కలిసి చేసుకుంటారు. అలాగే సంఘాలను స్థాపించుకుని ఉనికిని చాటుకుంటున్నారు.

1979లో "తెలుగు అసోసియేషన్ ఆఫ్ సెయింట్ లూయిస్ (టాస్/TAS)ను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం ఉగాది, సంక్రాంతి, దీపావళి పండుగలను పురస్కరించుకుని అందరికి సెలవులు ఉన్న రోజులలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుతారు. అలాగే కుటుంబాల వనభోజనాలను/ఫ్యామిలీ పిక్నిక్‌లను కూడా ఏర్పాటు చేస్తారు. వార్షిక సభ్యత్వ రుసుంగా కుటుంబానికి 125 డాలర్లు(ఒక డాలర్ విలువ రూ.85.44/రూ.10,680), జీవిత సభ్యత్వ రుసుంగా 1500 డాలర్లు, కుటుంబ అతిథులకు, తల్లిదండ్రులకు 150 డాలర్లు వసూలు చేస్తారు. పోయిన వీకెండ్ సెలవు మే 10న "గ్రీన్ స్టెప్ఫ్యూయర్ రిక్రియేషన్" హాల్‌లో "తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు"ఘనంగా జరిగినవి. దాదాపు 200 మంది బాలికలు, 30 మంది బాలురు సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. దాదాపు 600 నుండి 800మంది అమెరికన్స్ తెలుగువారు పాల్గొన్నారు. అలాగే చీరెలు, బట్టలు, డ్రెస్‌లు, ఆభరణాల స్టాల్స్‌లో అమ్మకాలు కూడా జరిగినవి. అమెరికన్స్ సెయింట్ లూయిస్ పట్టణంలో జరిగిన తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించిన నాయనమ్మలు, అమ్మమ్మలు, తాతలు తెలుగు రాష్ట్రాల పండుగలను, సంస్కృతిని ప్రతిబింబించినట్లుగా ఉన్నాయని ముచ్చటించుకున్నారు. అలాగే బాలుర కంటే బాలికలు 150కి పైగా ఎక్కువ మంది సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం ఆశ్చర్యం అయినప్పటికీ సంతోషం.

మేరుగు రాజయ్య,
9441440791.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నేడు నీతి ఆయోగ్ పాలక మండలి భేటీ

**న్యూఢిల్లీ:** నీతి ఆయోగ్ పాలక మండలి 10వ సమావేశం ప్రధాని మోదీ అధ్యక్షతన శనివారం జరగనుంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అభివృద్ధికి కార్యాచరణపై ఈ సమావేశం చర్చించనున్నట్లు ఓ సీనియర్ అధికారి శుక్రవారం తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో ప్రధాని మొదటిసారి భేటీ కానుండటంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. సమావేశంలో 2024–26 బడ్జెట్, ఆర్థిక సవాళ్లపై సమాలోచనలు జరగనున్నట్లు అధికారి వెల్లడించారు. అమెరికా సుంకాల క్రమంలో భారత్ ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.26.7 శాతం మధ్యలో ఉంటుందన్నది అంచనా. 202526లో 6.2 శాతం నుంచి 6.3 శాతం వరకు ఆర్థిక వృద్ధి భారత్‌లో నమోదవుతుందని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు అంచనా వేశాయి. కాగా, నీతి ఆయోగ్ పాలక మండలిలో సభ్యులుగా ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు ఉంటారు. చైర్మన్ బాధ్యతలను మోదీ నిర్వర్తిస్తున్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన క్రమంలో పది రకాల విజన్‌లను సమ్మిళితం చేసి సముచిత పత్రం రూపొందించే బాధ్యతను నీతి ఆయోగ్‌కు 2023లో అప్పగించారు.

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

### నలుగురు మవోయిస్టులు మృతి

**గడ్చిరోలి:** మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పోలీస్ స్పెషల్ కమాండో యూనిట్ సి–60, సీఆర్‌పిఎఫ్ సంయుక్తంగా గడ్చిరోలి జిల్లాలో ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కవండే ప్రాంతంలో ఇటీవల ప్రారంభించిన ఫార్వార్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్ఒబి) సమీపంలో మావోయిస్టులు ఉన్నట్లు అందిన సమాచారం ఆధారంగా గురువారం మధ్యాహ్నం ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. భారీ వర్షం మధ్య దాదాపు 300 మంది సీ60 కమాండోలు, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది ఆపరేషన్ నిర్వహించారని.. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మావోయిస్టులు కాల్పులు జరపడంతో భద్రతా దళాలు సమర్థమంతంగా తిప్పికొట్టాయని పేర్కొన్నారు. దాదాపు రెండు గంటల పాటు కాల్పుల అనంతరం భద్రతాదళాలు గాలించగా నలుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. ఘటనా స్థలంలో కొన్ని తుపాకులు, వాకీటాకీ, నక్సల్ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న ఎదురుకాల్పులు.. ఛత్తీస్‌గఢ్‌లోని వరుసగా ఎదురుకాల్పులు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. సుక్మా జిల్లాలోని కిష్టారం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు భద్రతా బలగాలకు నిఘా వర్గాల ద్వారా సమాచారం అందింది. దీంతో కిష్టారం అటవీ ప్రాంతంలో పోలీసులు, భద్రతాబలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించాయి. ఈ విషయాన్ని గమనించిన మావోయిస్టులు.. భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు సైతం ఎదురు కాల్పులకు దిగాయి. దీంతో ఇరువైపులా ఎదురు కాల్పులు కొనసాగుతోన్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఈ ఎన్‌కౌంటర్‌ను జిల్లా ఎస్‌పి కిరణ్ చవాన్ పర్యవేక్షిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. వీరిలో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు పలువురు కీలక నేతలు సైతం ఉన్నారు.


## బెట్టింగ్ యాప్‌ల నియంత్రణ పిల్‌పై...

# కేంద్రం స్పందన కోరిన 'సుప్రీం'

'ఇది చాలా తీవ్రంగా పరిగణించాల్సిన అంశం' అని నోటీస్ జారీ

ఆన్‌లైన్ యాప్‌లకు ప్రభావితమై పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని


పిటిషనర్ కెఎ.పాల్ ఆవేదన



**న్యూఢిల్లీ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ముసుగులో ప్రజలు బెట్టింగ్, జూదం ఆడుతున్నారని, బెట్టింగ్ యాప్‌లను నియంత్రించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యం (పిల్)పై శుక్రవారం సుప్రీంకోర్టు కేంద్రం స్పందనను కోరింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కెఎ.పాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రానికి నోటీస్ జారీ చేసింది. ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం యాప్‌లను ఉపయోగించిన తర్వాత అనేకమంది పిల్లలు ఆత్మహత్యలు చేసుకుని చనిపోతున్నారని ఆరోపిస్తూ కెఎ.పాల్ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.ఈ తరహా ఆన్‌లైన్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారిలో యాక్టర్లు, క్రికెటర్లు ఉన్నారని, అందువల్లే పిల్లలు వాటికి ఆకర్షితులు అవుతున్నారని పిటిషన్‌దారు ఆరోపించారు. స్మోకింగ్ వల్ల కలిగే దుష్ఫలితాలను తెలియజేసేందుకు బొమ్మలను,హెచ్చరికల వ్యాఖ్యలను సిగరెట్ ప్యాకెట్లపై ముద్రిస్తున్నారని, కానీ బెట్టింగ్ యాప్‌ల విషయంలో అలాంటి సంకేతాలు, హెచ్చరికలు ఏవీ కూడా లేవని పాల్ తన పిటిషన్‌లో చెప్పారు. ఐపిఎల్ కొనసాగుతున్న సమయంలో ఈ యాప్‌లను మాజీ ఇండియన్ టీమ్ క్రికెటర్లు కూడా ప్రమోట్ చేస్తున్నారని, అలాంటప్పుడు పిల్లలు ఎందుకు ఆకర్షితులు కారని ఆవేదన వ్యక్తంచేశారు. ధర్మాసనం స్పందిస్తూ ఐపిఎల్ పేరుతో అనేకమంది ప్రజలు బెట్టింగ్, జూదంలో మునిగిపోతున్నారని ఇది చాలా తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని చెప్పింది. గత కొద్ది ఏళ్లుగా చనిపోతున్న పిల్లల తల్లిదండ్రులు ఎవరైతే ఉన్నారో వారు మిలియన్లలో వినతిపత్రాలు అందజేస్తున్నారని పాల్ వాదించారు. 'తెలంగాణ రాష్ట్రంలో 1,023మంది ప్రజలు మరణించారు. 25మంది బాలీవుడ్, టాలీవుడ్ యాక్టర్లు/ ఇన్‌ఫ్లూయర్స్ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడారు' అని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.వీటికి సంబంధించిన ఇన్‌ఫ్లూయర్లపై తెలంగాణ ప్రభుత్వం కేసులు నమోదు చేసిందని పాల్ తెలిపారు. 'ఈ రోజుల్లో మనం మన పిల్లలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నాం. వారు వారి పాఠశాలలకు కూడా తీసుకెళుతున్నారు. తల్లిదండ్రులు ఒక టీవీ చూస్తే, పిల్లలు మరొకటి చూస్తున్నారు. ఇది పూర్తిగా సామాజిక ఉల్లంఘన. మనం ఏమి చేయగలం?. ఈ బెట్టింగ్‌లో ప్రజలే స్వచ్ఛందంగా కూరుకుపోతున్నారు. ప్రత్యేకించి దీనిని నిలువరించేందుకు మేం మీతో ఉంటాం. ఈ తప్పుడు భావన కింద కేవలం మీరు మాత్రమే చట్టం ద్వారా నిలిపివేయగలరు' అని బెంచ్ చెప్పింది. జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ 'ప్రజలు హత్య చేయకుండా మనం ఆపలేం. చట్టం కూడా బెట్టింగ్ లేదా జూదంలో కూరుకుపోకుండా ప్రజలను ఆపలేదు' ధర్మాసనం స్పందిస్తూ కేంద్రం దీనిపై తన స్పందనను తెలియజేయాలని కోరింది. ఈ విషయమై అత్యున్నత న్యాయస్థానం అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ సహాయాన్ని కోరింది. అవసరమైతే దీనిపై అన్ని రాష్ట్రాల స్పందనను కూడా తెలియజేయాలని సూచించింది.

## ఈశాన్య భారతంలోని వైవిధ్యమే అతి పెద్ద బలం

''రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్''లో ప్రధాని




**న్యూఢిల్లీ :** ఒకప్పుడు ఈశాన్య ప్రాంతమంటే బాంబులు, తుపాకులు, రాస్తారోకోలకు పర్యాయపదంగా ఉండేదని, ఇప్పుడు అపూర్వమైన ప్రగతిని చూస్తున్నదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ అభివృద్ధిని మరింత వేగం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన ''రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్''లో ప్రధాని ప్రసంగిస్తూ ఈశాన్య భారతంలోని వైవిధ్యమే అతి పెద్ద బలమని, ఈ ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలు పెట్టుబడులు, నాయకత్వానికి సన్నద్ధతను ప్రకటిస్తున్నాయని అన్నారు. ఇందనం, సెమీ కండక్టర్‌లు అనే రెండు వ్యూహాత్మక రంగాలకు ఈశాన్య రాష్ట్రాలు కీలక గమ్యంగా ఎదుగుతున్నాయని చెప్పారు. అస్సోంలో భారతదేశ సెమీ కండక్టర్ ఈకో సిస్టమ్ అభివృద్ధి చెందుతోందన్నారు. ఈశాన్య భారత్ ఆధారిత సెమీ కండక్టర్ ప్లాంట్‌లో మొట్టమొదటి మేడ్ ఇన్ ఇండియా చిప్‌ను త్వరలోనే తీసుకువస్తామని చెప్పారు. ఒకప్పుడు ఈశాన్య భారతమంటేనే తుపాకులు, బాంబులు, రోడ్లకు ఆటంకాలకు నెలవుగా నిలవడం యువత అవకాశాలపై ప్రభావం చూపిందని అన్నారు. తమ ప్రభుత్వం ఉగ్రవాదం, తిరుగుబాటుకు వ్యతిరేకంగా ఏ మాత్రం ఉపేక్షించని విధానం అవలంభిస్తోందని చెప్పారు. శాంతి ఒప్పందాల దిశగా ప్రభుత్వ నిరంతర కృషి ఫలితంగా 10 వేల మంది ఆయుధాలను వీడి, గత 10–11 సంవత్సరాలలో శాంతిని అక్కున చేర్చుకున్నారని మోదీ అన్నారు. ఈ మార్పు నూతన ఉద్యోగ, వ్యాపార అవకాశాలకు ఈ ప్రాంతంలో తలుపులు తెరిచిందని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలలో కేంద్ర మంత్రులు 700లకుపైగా సార్లు పర్యటనలు చేశారని, ఈ భూమిని అర్థం చేసుకోవడంలో వారి నిబద్ధతను అది తెలియజేస్తుందని, ఇక్కడి ప్రజల ఆకాంక్షలు చూశారని, దానిని అభివృద్ధి విధానాలుగా రూపకల్పన చేస్తున్నారని మోదీ పేర్కొన్నారు.

**ముఖేశ్ అంబానీ, గౌతమ్ అదానీ హాజరు**

రెండు రోజుల పాటు జరిగే పెట్టుబడుల సమ్మిట్‌కు ఈశాన్య ప్రాంత ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, అధికారులు, రాయబారులు హాజరవుతున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పారిశ్రామిక వేత్తలు ముఖేశ్ అంబానీ, గౌతమ్ అదానీ తదితరులు పాల్గొన్నారు.

## పాక్‌కు గూఢచర్యం: మరో ఇద్దరి అరెస్ట్





**లక్నో:** పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్నారన్న అనుమానంతో ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ బృందం ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొంది. ఢిల్లీలో తుక్కు వ్యాపారం చేసే మొహద్ హరూన్‌ను నోయిడాలో అదుపులోకి తీసుకొన్నారు. అతడికి పాకిస్థాన్ దౌత్య కార్యాలయంలోని ముజమ్మల్ హుస్సేన్‌తో సంబంధాలున్నట్లు గుర్తించారు. ఇతడు వీసా కోసం డబ్బులు, ఇతర సున్నిత సమాచారం చేరవేయడంతోపాటు తీవ్రవాద భావజాల వ్యాప్తికి పాల్పడుతున్నట్లు భావిస్తున్నారు. హరూన్‌కు పాక్ దౌత్య సిబ్బంది అయిన ముజమ్మల్‌తో మంచి సంబంధాలున్నాయని అధికారులు చెప్పారు. వారు నిత్యం మాట్లాడుకుంటున్నట్లు గుర్తించారు. హరూన్‌కు పాకిస్థాన్‌లో బంధుత్వాలు ఉండటంతో ముజమ్మల్ వీసాలు ఇప్పించినట్లు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.కాగా, హరూన్ పాక్ వీసాలు ఇప్పిస్తానంటూ కొంతమంది నుంచి డబ్బులు వసూలు చేసి వివిధ బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గుర్తించారు. ఆ సొమ్ములో కొంత కమీషన్ తీసుకొని... ముజమ్మల్ చెప్పిన వ్యక్తులకు మిగిలిన మొత్తం ఇచ్చేవాడు. అతడు పాక్ దౌత్య కార్యాలయంలో పనిచేస్తున్నట్లు తెలిసినా... హరూన్ సహకరించాడని ఏటీఎస్ బృందం తెలిపింది. దీంతో సున్నితమైన సమాచారం చేరవేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఆదంపూర్, వారణాసిలో నిర్వహించిన ఆపరేషన్‌లో ఏటీఎస్ బృందం తుఫేల్ అనే మరో వ్యక్తిని అరెస్టు చేసింది. అతడు దేశ వ్యతిరేక వాట్సాప్ గ్రూప్‌లో చేరినట్లు గుర్తించారు. దీనిని పాకిస్థాన్‌లోని సంస్థలు నిర్వహిస్తున్నాయి. దీంతో పాటు అతడు సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్‌కు అందించినట్లు గుర్తించారు. 'తుఫేల్ పాకిస్థాన్‌లోని వ్యక్తులు, సంస్థలతో సంబంధాలు నెరుపుతున్నాడు. పాక్‌లో నిషేధానికి గురైన తెహ్రీక్ ఎ లబ్బేక్ సంస్థ వ్యవస్థాపకుడు మౌలానా షాద్ రిజ్వీ వీడియోలను తరచూ షేర్ చేస్తున్నట్లు గుర్తించారు. గజ్వా ఎ హింద్‌కు సంబంధించిన కంటెంట్‌ను అతడు ప్రమోట్ చేస్తున్నాడు. భారత్‌లో షరియా చట్టం తీసుకురావడం వంటి అంశాలను ప్రచారం చేస్తున్నాడు. వారణాసిలోని రాజ్‌ఘాట్, నమోఘాట్, జ్ఞానవాపీ మసీదు, వారణాసి రైల్వే స్టేషన్, జామా మసీద్, ఎర్రకోట, నిజాముద్దీన్ ఫొటోలను పాక్ వ్యక్తులకు షేర్ చేశాడు' అని ఏటీఎస్ వెల్లడించింది. అతడికి పాకిస్థాన్‌లో దాదాపు 600 మందితో సంబంధాలు ఉన్నాయి. ఫైసలాబాద్‌లోని నఫీస అనే మహిళతో కూడా అతడు మాట్లాడుతున్నాడు. ఆమె భర్త పాక్ ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఈ రెండు కేసులపై వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్యాంగ్‌రేప్ నిందితులకు బెయిల్...

### కార్ల ర్యాలీతో హల్‌చల్

**బెంగళూరు:** కర్నాటకలోని హవేరీలో గతేడాది ఓ మహిళపై ఏడుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర దుమారం రేపింది. ఈ కేసుకు సంబంధించిన నిందితులు ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే, జైలు నుంచి బయటకు వచ్చిన నిందితులు రోడ్లపై విక్టరీ పరేడ్ మాదిరి ర్యాలీగా వెళ్లి హల్‌చల్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఇది తీవ్ర వివాదాస్పదమైంది. హవేరిలోని అక్కి అలూర్ పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితులకు వారి స్నేహితులే స్వాగత ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. కార్లు, బైక్‌ల మీద స్పీడ్‌గా వెళ్తూ... బిగ్గరగా అరుస్తూ వారు వేడుకలు చేసుకున్నారు. ఈ వీడియో చూసిన పలువురు నెటిజన్లు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.కాగా, 2024 జనవరి నాటి కేసు ఇది. తనపై కొందరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హనగల్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో తన స్నేహితుడితో ఉండగా నిందితులు తమ గదిలోకి దౌర్జన్యంగా చొరబడినట్లు తెలిపారు. అనంతరం తనను సమీపంలోని అడవిలోకి లాక్కెళ్లి అత్యాచారం చేసినట్లు ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఏడుగురు ప్రధాన నిందితులు సహా మొత్తం 19 మందిని అరెస్టు చేశారు. బాధితురాలు తొలుత నిందితులను గుర్తించినప్పటికీ... కోర్టు విచారణ సమయంలో వారిని గుర్తుపట్టడటంలో ఇబ్బందిపడ్డారు. దీంతో నిందితుల్లోని 12 మంది పది నెలల క్రితం బెయిల్‌పై విడుదలయ్యారు. ప్రధాన నిందితులైన ఏడుగురికి మాత్రం ఇటీవలే బెయిల్ లభించింది. ఈ క్రమంలోనే తాజా ఘటన చోటుచేసుకుంది.

## పాక్‌కు నిధులిచ్చేందుకు ప్రపంచ బ్యాంక్ సిద్ధం

### వ్యతిరేకించనున్న భారత్



#### ఇప్పటికే 2.3 బిలియన్ డాలర్ల నిధులు ఇచ్చిన ఐఎంఎఫ్

**న్యూఢిల్లీ :** వచ్చే నెలలో పాకిస్థాన్‌కు ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరు పట్ల భారత దేశం వ్యతిరేకించనుంది. గతంలో ఇలాంటి నిధులతో ఇస్లామాబాద్ ఆయుధాలను, మందుగుండును కొనుగోలు చేసిందని, అందుకే ఐఎంఎఫ్ నిధుల విడుదల విషయంలో కూడా వ్యతిరేకించామని భారతదేశ ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. పేదరిక నిర్మూలన, అభివృద్ధి లక్ష్యాల కోసం బహుళ పక్ష సంస్థలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు ఇస్తుంటాయని, కానీ పాకిస్థాన్ గతాన్ని పరిశీలించినట్లయితే ఆ నిధులను సైనిక అవసరాలకు వినియోగించినట్లు స్పష్టమవుతోందని తెలిపాయి. వచ్చే నెలలో పాకిస్థాన్‌కు కంట్రీ పార్ట్‌నర్ షిప్ ఫ్రేమ్‌వర్క్ కింద 20 బిలియన్ డాలర్ల అప్పు ఇచ్చే అంశంపై సమీక్షించే అవకాశం ఉంది. ఈ మేరకు జనవరి మాసంలో ప్రపంచబ్యాంకు అంగీకరించింది. నగదు కరువుతో కొట్టుమిట్లాడుతున్న పాకిస్థాన్‌కు శుద్ధ ఇందనం, వాతావరణ మార్పు తదితర రంగాలకు 2026 నుంచి పదేళ్ళ పాటు నిధులు ఇవ్వనుంది. త్వరలో పాకిస్థాన్‌కు ప్రపంచ బ్యాంకులు నిధులు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తామని ప్రభుత్వ వర్గాలు వెల్లడించారు. గత మాసంలో పాకిస్థాన్‌కు 2.3 బిలియన్ డాలర్ల సహాయం అందించటానికి వ్యతిరేకంగా ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టలీనా జియార్జైవ్, ఐఎంఎఫ్ బోర్డ్ సభ్య దేశాల మంత్రులుతో భారతదేశం లాబీయింగ్ చేసింది. ఉగ్రవాదులుగా ప్రకటించబడిన వ్యక్తుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ సీనియర్ సైనికాధికారులు హాజరవడాన్ని ఆధారంగా చూపుతూ ఇస్లామాబాద్ గత రెండు దశాబ్దాలుగా నిధులను ఆయుధ సేకరణకు వినియోగిస్తున్నదని న్యూ ఢిల్లీ వాదించింది. ఇప్పటికే ఐఎంఎఫ్ ఛీఫ్‌తోపాటు, ఐఎంఎఫ్ బోర్డులోని కొందరు మంత్రులతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారని, అమెరికా వంటి శక్తివంతమైన దేశాల ఎదుట కూడా భారత దౌత్య అధికారులు బలంగా వాదనలు వినిపించారని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. అయితే, పాకిస్థాన్‌కు నిధులు ఇవ్వడాన్ని నిలిపివేయనప్పటికీ, ఆ దేశంపై 11 కఠినమైన షరతులను ఐఎంఎఫ్ విధించింది. నిధులను మంజూరు చేయడంపై ఐఎంఎఫ్ చార్టర్ ప్రకారం వ్యతిరేక ఓటుకు అవకాశం లేకపోవడంతో భారతదేశం ఓటింగ్‌కు గైర్హాజరైంది. ఏ దేశామైనా అభివృద్ధి అవసరాల కోసం నిధులు పొందడానికి భారతదేశం వ్యతిరేకం కాదని, అయితే, భారతదేశం, పాకిస్థాన్‌లకు మధ్య సరిహద్దు ఉద్రిక్తతలతో యుద్ధం వంటి పరిస్థితుల్లో ఐఎంఎఫ్ నిధులు ఇవ్వడం సరైన పద్ధతి కాదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అందుబాటులో ఉన్న సమాచార ప్రకారం పాకిస్థాన్ సగటున సాధారణ బడ్జెట్‌లో 18 శాతం రక్షణ వ్యవహారాలు, సేవలపై ఖర్చు చేస్తుంది. మాములుగా ఘర్షణలు ఎదుర్కొనే దేశాలే సగటున బడ్జెట్‌లో 10–14 శాతమే రక్షణ రంగానికి వ్యయం చేస్తుంటాయి. 1980 నుంచి 2023 వరకు పాకిస్థాన్ ఆయుధ దిగుమతులు ఐఎంఎఫ్ నిధులు విడుదలయ్యే సంవత్సరాలలోనే నాటకీయంగా 20 శాతం పెరిగాయి.



## పాక్ ఆర్మీ ఉగ్ర కార్యకలాపాలు: జైశంకర్

**న్యూఢిల్లీ:** భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ విదేశాల్లో పాకిస్థాన్ చర్యలను ఎండగడుతున్నారు. నెదర్లాండ్స్‌కు చెందిన మీడియాకు వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. తన గడ్డపై జరుగుతోన్న ఉగ్రవాద కార్యకలాపాల గురించి పాకిస్థాన్‌కు తెలియదనే భావనను మంత్రి తీవ్రంగా ఖండించారు. పాక్, ఆ దేశ సైన్యం ఉగ్రవాద కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నాయన్నారు. 'ఐక్యరాజ్య సమితి ఆంక్షల జాబితాలోని కరడుకట్టిన ఉగ్రవాదులంతా పాకిస్థాన్‌లోనే ఉన్నారు. పట్టపగలే ఆ దేశంలోని పెద్దపెద్ద నగరాల నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వారు ఎక్కడ ఉంటారో తెలుసు. వారు ఏ చర్యలకు ఒడిగడుతున్నారో తెలుసు. వారి మధ్యలో ఉన్న సంబంధాలు తెలుసు' అని జైశంకర్ ఘాటుగా స్పందించారు. పహల్గాం ఉగ్రదాడిని ఉద్దేశించి మాట్లాడుతూ 'పాకిస్థాన్ తన ప్రమేయం లేదని నటించకూడదు. పాక్ ప్రభుత్వం ఉగ్రసంస్థలకు సహకారం అందిస్తోంది. పాక్ ఆర్మీ సరిహద్దు ఉగ్రవాదంలో పీకల్లోతు కూరుకుపోయింది' అని ఆయన ధ్వజమెత్తారు. ఉగ్రవాదం, జమ్మూకశ్మీర్ అంశం భారత్‌కు వేర్వేరు అంశాలని తేల్చిచెప్పారు. పాక్ నేతలు, ముఖ్యంగా ఆ దేశ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ మత ఛాందసవాదంపై జైశంకర్ విమర్శలు చేశారు.

## ఎస్-400 ముందస్తు డెలివరీ కోసం దోవల్ యత్నం



**న్యూఢిల్లీ:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వచ్చేవారం రష్యా వెళ్లనున్నారు. మే 27 నుంచి 29 వరకు భద్రతా వ్యవహారాల ఉన్నతస్థాయి ప్రతినిధుల 13వ అంతర్జాతీయ సమావేశం జరగనుంది. మాస్కోలో జరిగే ఈ సమావేశంలో దోవల్ పాల్గొంటారు. ఇదే పర్యటనలో ఆయన రష్యా వద్ద పెండింగ్‌లో ఉన్న ఎస్400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల ముందస్తు డెలివరీ అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. 'ఆపరేషన్ సిందూర్'తో భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ దోవల్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఎస్400 కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. వైమానిక, క్షిపణి దాడులకు దిగితే నిలువరించే అత్యంత శక్తిమంతమైన ఆయుధ వ్యవస్థ ఎస్400. శత్రువుల యుద్ధ విమానాలు, డ్రోన్లు, క్రూజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను అత్యంత కచ్చితత్వంతో ఇది నేలకూల్చగలదు. ప్రత్యర్థి జామింగ్ విధానాలను కూడా తట్టుకోగలదు. వీటిని రష్యాకు చెందిన ఎన్‌పీవో అల్మాజ్ సంస్థ అభివద్ధి చేసింది. మొత్తం ఐదు ఎస్400 క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు 2018లో భారత్‌రష్యా మధ్య ఒప్పందం కుదిరింది. దీని విలువ దాదాపు రూ.35 వేల కోట్లు. ఇప్పటివరకు మూడు వ్యవస్థలు భారత్‌కు చేరగా... మిగతా వాటిని 2026 ఆగస్టు నాటికి అందించే అవకాశాలున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, అంత కంటే ముందుగానే వీటిని డెలివరీ చేసేలా దోవల్ మాస్కోతో చర్చించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ రక్షణ వ్యవస్థలను భారత వైమానిక దళం వినియోగిస్తోంది.

## 33మంది మావోయిస్టుల లొంగుబాటు

**బీజాపూర్/దంతెవాడ:** చత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో శుక్రవారం 33మంది మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. ఇందులో 24మందిపై రూ.91 లక్షల రివార్డు ఉందని, వీరంతా సుక్మా జిల్లా బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాల ముందు లొంగిపోయారని పోలీసులు తెలిపారు. తొమ్మిది మంది మహిళలతో సహా ఇరవై నాలుగుమంది మావోయిస్టులు బీజాపూర్‌లోని సీనియర్ పోలీస్, సీఆర్‌పీఎఫ్ అధికారుల ముందు తమంతట తాముగా లొంగిపోయినట్లు బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపారు. భద్రతా శిబిరాల చుట్టూ ఉన్న మారుమూల గ్రామాల్లో అభివద్ధి పనులను సులభతరం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'నియాద్ నెల్లనార్' పథకం వారిని ఆకట్టుకున్నట్లు చెప్పారని ఎస్పీ వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లో అభివద్ధి పనులు జరగడం, గ్రామాల్లో ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటవడం కూడా మావోయిస్టుల లొంగుబాటుకు ముఖ్య కారణమని యాదవ్ చెప్పారు. లొంగిపోయిన నక్సలైట్లు భద్రతా సిబ్బందిపై దాడులు, ఐఈడి పేలుళ్లు తదితర ఘటనల్లో పాల్గొన్నారని ఆయన చెప్పారు. వీరిలో ప్లైగా బెటాలియన్ నెం. 1997 నుండి చురుగ్గా ఉన్న మావోయిస్టులలో ఇద్దరున్నారని... వీరిపై రూ .10 లక్షల రివార్డు ఉందని వివరించారు. మరో ఇద్దరిపై రూ.8లక్షలు, రూ.5లక్షల చొప్పున ఇద్దరిపై రివార్డు ఉన్నట్లు చెప్పారు. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు సుక్మా జిల్లాలో 227 మంది నక్సలైట్లు హింసను వీడినట్లయిందన్నారు. ఇక జిల్లాలో ప్రత్యేక సంఘటనలలో 119 మంది మావోయిస్టులు హతమవగా, 237 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.



## జెపి ఇన్‌ఫ్రాటెక్‌పై ఈడీ దాడులు

**న్యూఢిల్లీ:** వేల కోట్ల రూపాయల మోసం కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్, జేపీ అసోసియేట్స్, ఇతరులపై ఈడీ దాడులు చేసింది. సదరు సంస్థలు, వ్యక్తుల ఇళ్లపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఈడీ వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ మేరకు అధికారిక వర్గాలు నిర్ధారించాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల కింద ఢిల్లీ, ముంబైలో దాడులు జరుగుతున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. గృహ కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల సొమ్ములు సుమారు రూ.12 వేల కోట్ల మేరకు మోసం, నిధుల మళ్లింపునకు సంబంధించిన కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్, జేపీ అసోసియేట్స్ లిమిటెడ్, ఇతరులపై ఈ సోదాలు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. గౌర్సన్స్, గుల్షన్, మహాగున్, సురక్ష రియాలిటీ వంటి, జేపీ ఇన్ ఫ్రా అనుబంధ సంస్థలపై కూడా దాడులు జరుగుతున్నాయని చెప్పారు. అయితే, దాడుల నేపథ్యంలో సంబంధిత కంపెనీలు ఇప్పటివరకూ ఏమీ స్పందించలేదు.

## పోక్సో కేసులో దోషిగా నిర్ధారించినా ఏ శిక్షా విధించని సుప్రీంకోర్టు!

**న్యూఢిల్లీ:** పోక్సో కేసులో దోషిగా నిర్ధారణ అయినప్పటికీ ఆ వ్యక్తికి తన తుది తీర్పులో ఏ శిక్షా విధించలేదు. ఆ కేసులోని ప్రత్యేక పరిస్థితే అందుకు కారణం. కేసు పూర్వాపరాలలోకి వెళితే... బాలికతో లైంగిక సంబంధం కొనసాగించినందుకు గతంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అతడు కలకత్తా హైకోర్టును ఆశ్రయించాడు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు 2023 అక్టోబరు 18న సంచలన తీర్పు వెలువరించింది. బాలిక ... పిటిషనర్‌తో ఇష్టపూర్వకంగానే లైంగిక సంబంధాన్ని కొనసాగించినట్లు రుజువైనందున అతడిని నిర్దోషిగా ప్రకటిస్తున్నట్లు తెలిపింది. 'కేవలం రెండు నిమిషాల లైంగిక ఆనందం కోసం చూసుకుంటే... సమాజం దష్టిలో బాలికలు పరాజితులుగా మిగిలిపోతారు. కిశోరప్రాయ బాలికలు తమ లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలి' అని ఆ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ తీర్పుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవడంతో ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. అదే సమయంలో నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. దాంతో హైకోర్టు తీర్పును 2024 ఆగస్టు 20న సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆ కేసులో నిందితుడికి ట్రయల్ కోర్టు విధించిన శిక్షను పునరుద్ధరిస్తున్నట్లు స్పష్టంచేసింది. అయితే అదే సమయంలో బాధిత బాలిక మైనర్‌గా ఉన్నప్పుడు తనతో లైంగిక సంబంధం నెరిపిన వ్యక్తినే ఇప్పుడు పెళ్లి చేసుకొని ఒక బిడ్డకు జన్మనిచ్చిన విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం ప్రస్తావించింది. బాధితురాలు, దోషి ఇద్దరూ ఇప్పుడు వివాహ బంధంతో ఒక్కటైనందున పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీ వేసి, బాధితురాలితో చర్చించాలని సూచించింది. ఆ కమిటీ నివేదిక ఆధారంగా శిక్షపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపింది.

**CHANGE OF NAME**

I, YADLAPALLI SAHTEESH (old name), S/o.Shankar Rao, age : 45years, R/o: Thirumalayapalem, Khammam Dist, Telangana State, India. here by declare that I have changed my name YADLAPALLI SATHEESH (new name) for all purpose.

## ఘనంగా మంత్రి కోమటిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పిటిసివం గూరి లక్ష్మయ్యలు పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోని ఆయుష్ ఆరోగ్యాలతో జీవించాలని అదేవిధంగా భవిష్యత్తులో ఇంకా అనేక పదవులు చేపట్టాలని వారి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ సలీం,గురిజ వెంకన్న, బ్రహ్మానంద రెడ్డి, పలువురు మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు గ్రామ పాలనాధికారుల స్క్రీనింగ్ పరీక్ష

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఈనెల 25న నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న గ్రామ పాలనాధికారుల స్క్రీనింగ్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మొత్తం 276 మంది ఈ స్క్రీనింగ్ పరీక్షకు హాజరుకానున్నారని ఆమె వెల్లడించారు ఈ పరీక్షల నిర్వహణకు ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా సూచనలను పాటించాలన్నారు.అభ్యర్థులు ఉదయం 09:00 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకుంటే 10:00 గంటల తరువాత పరీక్ష కేంద్రంలో ప్రవేశం అనుమతించబడదు అన్నారు. పరీక్ష 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:30 వరకు జరుగుతుంది అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాలి. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు అనుమతించబడదని పెర్కొన్నారు.

తాగునీటి సీసా మాత్రమే అనుమతించబడుతుంది.

## సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలంపై వేటు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలంపై ఎట్టకేలకు వేటు పడింది. గత కొన్నేళ్లుగా ఆయనపై అవినీతి, అరోపణలు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు జిల్లా కేంద్రంలో విస్తృతంగా ప్రైవేట్ ఆసుపత్రులలో తనిఖీలు చేశారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యాల, అర్హతలేని వైద్యుల అసలు బండారాలు వెలుగులోకి వచ్చాయి. ఇదిలా ఉండగా పట్టణంలోని శ్రీసాయి గణేష్ అస్పిటల్‌లో వచ్చిరాని వైద్యులు వచ్చిరాని వైద్యం చేసి ఓ మహిళ మృతికి కారణమయ్యారు. అలాగే ఓజోన్ అస్పిటల్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓ మహిళకు అబార్షన్ చేస్తుండగా వికటించి గర్భిణి మృతి చెందింది. దీంతో పెద్ద ఎత్తున వైద్య ఆరోగ్య శాఖ అధికారుల అవినీతి, అక్రమాలపై రోగులు బలి అవుతున్నారంటూ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పెద్ద ఎత్తున వరుస వార్త కథనాలు వస్తున్నాయి. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పందిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలంపై విచారణ చేపట్టింది. ఈ విచారణ పూర్తి కాకముందే ఆయనను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ హైద్రాబాద్‌కు బదిలీ చేస్తూ శుక్రవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో హైద్రాబాద్‌లోని ఎల్‌బి నగర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పని చేస్తున్న పి.చంద్రశేఖర్‌ను నియమించింది.

## పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోని విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన సహాయ,సహకారాలను అందించేందుకు తాను కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ



**ప్రజాపక్షం/గుండాల:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ అని అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గుండాల తహాశీల్దార్ ఆఫీస్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బుర్జుబాయి గ్రామంలో 16 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం ప్రారంభించారు. వాటిలో నాలుగింటికి బిస్మెంట్ బిల్లు కూడా అందించినట్లు తెలిపారు. మండలంలో వరి ధాన్యం కొనుగోళ్ళు ఒకటి, రెండుచోట్ల మిగతా వన్ని పూర్తి అయ్యాయన్నారు. జూన్ 2న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని తెలిపారు. ఈయన వెంట డిప్యూటీ తహాశీల్దార్ నీలిమ, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## భద్రత కరువైన బడులు



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** ప్రభుత్వ పాఠశాలలంటేనే ఎవరికి బాధ్యత లేని విధంగా వ్యవహరిస్తుంటారు. ప్రస్తుతం వేసవి సెలవులు రావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులు ఎవరు బడులకు వెళ్లారు. కాబట్టి ప్రభుత్వ పాఠశాలలోనూ రాత్రి పగలు భద్రత కరువై అసాంఘీక కార్యక్రమాలు ఆటలు తదితర వంటివి చేపట్టడానికి అవకాశం గా మారింది. ప్రభుత్వము విద్యాభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ఖర్చులు చేస్తున్న పాఠశాల భద్రత కోసం వాచ్‌మెన్ కూడా ఏర్పాటు చేయాలని దుస్థితిలో ప్రభుత్వాలు కొనసాగుతున్నారు. ఫర్నిచర్ పాఠశాలను చెట్లను కొట్టడం మద్యం సీసాలు పారవేయడం తదితర జంతువులు సంతరించడం ఆవాసాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ బడులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం స్థానికుల పైన ఉన్న రెండు అలాగనే నిర్లక్ష్యం వివరించడం వల్ల భద్రత లేని దుస్థితిని ఏర్పడింది. ఉండవెల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాలలు 12 ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. 2024 2025 సంవత్సరంలో 2160 మంది విద్యార్థులు విద్యాభ్యాసం అభ్యసించినట్లు అధికారులు వెల్లడించారు. పాఠశాలలో ప్రహరీ గోడలు లేకపోవడంతో పశువులు గొర్రెలు సంచారిస్తూ బడుల్లోనే మందు సేవించడం తదితర వంటి కార్యక్రమం నిర్వహించడం అన్నవైతేగా వస్తుంది. వాచ్‌మెన్లు ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో అపరిశుభ్రతకు దారితీస్తుంది. పాత గోడలు శిథిలావస్థకు చేరిన పాఠశాలలు పడిపోవడానికి కారణం ప్రధానం. పాఠశాలలో దుర్వాసన అపరిశుభ్రత చోటు చేసుకుంటున్నాయి. వివరాల్లోకి వెళితే ప్రగటూరు బైరాపురం బస్వాపురం పాఠశాలలో ప్రహరీ గోడలు లేవు. కంచుపాడు గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లు నరకడం వంటి చోటు చేసుకున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

# తాగు, సాగు నీటి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్




**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు వెంటనే నిధులు కేటాయించి పూర్తి చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. సిపిఐ పార్టీ మండల 7వమహాసభను సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక లిటిల్ ఏంజిల్ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో పాల్గొని ప్రసంగించారు. గత పాలకుల నిర్లక్ష్య మూలంగా , బి వెల్లెంల ప్రాజెక్టు ,ఎస్ ఎల్ బిసి సోరంగం , ధర్మారెడ్డి పిల్లాయి కాలువ పూర్తికి నోచుకోలేక పోయాయని ఆయన విమర్శించారు. బి వెల్లెంల ప్రాజెక్టు కాలువల పూర్తికి నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పేదలకు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్తో శాంతి చర్చలు జరుపుతూ , దేశ పౌరులైన నక్సలేట్లతో చర్చలు జరుపకుండా ఎన్కౌంటర్‌ల పేరుతో హత్య చేయండం తగదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక , రాజకీయ , ఆర్థిక కోణంతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణల విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ , అంబానీలకు కట్టబెట్టడం జర్గుతుందని ఆయన పేర్కొన్నారు. సామాన్యుల వాడే ప్రతి వస్తువు పైన జిఎస్టి పేరుతో ప్రజలను దోపిడి చేస్తూ పరిపాలన చేయడం సిగ్గుచేటు అని ఆయన విమర్శించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ నార్కట్‌పల్లిలో ప్రభుత్వ జూనియర్ కాలేజికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అక్కెనపల్లి నుండి ఆకారం వరకు ఆసిఫ్ నహార్ కాల్వ పూర్తికి నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, బికేఎం యు నియోజకవర్గ అధ్యక్షులు వెంపటి శ్రీనివాస్ , మండల సహాయ కార్యదర్శి వంగాల నాగయ్య, అలకుంట్ల నరసింహ, సిలువేరు వెంకట్‌రాములు, ఏరుగు యోగేంద్ర రెడ్డి , గోపాల్‌రెడ్డి, బోడ మల్లేష్, తోడుసు సైదులు, సంగిశెట్టి రానమ్మ, పెండ్యాల పద్మ, మంటిపల్లి సైదమ్మ, వస్కూల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణను పారదర్శకంగా చేపట్టాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ భూసేకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్. శుక్రవారం ధరూర్ మండలంలోని చింతరేవుల గ్రామాన్ని సందర్శించి జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు సంబంధించిన భూ సేకరణ వివరాలు, లే అవుట్ మ్యాప్, పెగ్ మార్కింగ్ చేసిన ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ , జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ సర్వే పనులకు విధుల కొరత లేకపోవడంతో, ఏ విధమైన ఆలస్యం లేకుండా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ఎంత మేర భూమి పై సర్వే జరుగుతోంది, ఎన్ని ఎకరాలు పూర్తయ్యాయి అనే వివరాలను స్పష్టంగా నమోదు చేసి నివేదిక సమర్పించాలని అన్నారు. సర్వే, పెగ్ మార్కింగ్ పనులను ఒకేసారి జరపుతూ, రైతులను చైతన్యపరచి వారి సహకారంతో భూ సేకరణను సమర్థవంతంగా పూర్తి చేయాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే ల్యాండ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. భూ సేకరణ పనులు త్వరితగతిన పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, నీటి పారుదల శాఖ ఎస్.ఈ. రహీముద్దీన్, ఆర్డీవో శ్రీనివాస రావు, ధరూర్ తహసీల్దార్ భూపాల్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## అన్ని ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి



**ప్రజాపక్షం/భువనగిరి:** మావోయిస్టు నాయకులు కేశవరావు ఎన్కౌంటర్‌తో పాటు జరిగిన అన్ని ఎన్కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామచంద్రయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ సభ్యులు కావలి యాదయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ అన్నారు. ఎన్కౌంటర్లో పాల్గొన్న పోలీసులపై అత్యా నేరము నమోదు చేయాలనీ, సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, ఆపరేషన్ నిలిపివేసి కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక భువనగిరి ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు అనారోగ్యంతో ఉండగా ఒరిస్సా రాష్ట్రంలో పట్టుకొని చత్తీస్గడ్ దండకారణంలోని అంబుజమాడు అడవులలో హత్య చేసి ఎన్కౌంటర్ కట్టుకథలు అల్లుతున్నారన్నారు. కామ్రేడ్ కేశవరావు అలియస్ బసవరాజుది నిజమైన ఎన్కౌంటర్‌గా నమ్మించేందుకు అమాయకులైన మరో 24 మంది ఆదివాసులను హత్య చేసి భారీ ఎన్కౌంటర్‌గా చిత్రీకరిస్తూ ప్రజలను నమ్మబల్కుతున్నారన్నారు. దేశంలోని పౌర సమాజమంతా ఒకవైపు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తుంటే మరోపక్క సరిహద్దులోని ప్రజలను పర్యాటక ప్రజల ప్రాణాలను ఉగ్రవాదులకు బలిస్తూ సరిహద్దులోని సైన్యాన్ని మధ్య భారత దేశంలో మోహరించి ఆ ప్రాంతంలోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టనీకి స్థానిక ఆదివాసి ప్రజలను అక్కడి నుండి తరిమి వేస్తున్నరాని చెప్పారు. ఈ కార్యక్రమంలో థథమండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కమిటీ అధ్యక్షులు కాశపాక మహేష్, ప్రధాన కార్యదర్శి రాసాల నరసింహ్మ, తెలంగాణ వికలాంగుల వేదిక జిల్లా అధ్యక్షులు మచ్చ ఉపేందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మండల సహాయ కార్యదర్శి ఉదుత రాఘవులు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కమిటీ సభ్యులు రాసాల బాలస్వామి, చిక్కుల కర్ణాకర్, నరాల బాలకృష్ణ, చొప్పరి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాల సారథి సిపిఐ

సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రజా పోరాటాల సారధి సిపిఐ అని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రాజీవ్‌నగర్ 22వ వార్డు కమిటీ సమావేశంలో వాడపల్లి వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహాసభల ద్వారా సిపిఐ పార్టీని బలోపేతం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈనెల 25న ఆదివారం కామ్రేడ్ ధర్మబిక్షం భవన్ సిపిఐ ఆఫీస్ నందు పట్టణ 4వ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవిఎల్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. రాజీవ్‌నగర్‌లోని 22వార్డు కమిటిని 16 మంది సభ్యులతో నూతన కమిటిని ఎన్నుకున్నారు. రెండవసారి కార్యదర్శిగా పెండ్ర కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు దంతాల రాంబాబు, చామల అశోక్‌కుమార్, పెండ్ర కృష్ణ, వాడపల్లి గోపి, వెంకన్న, నవీన్, బూర మురళి, పెండ్రాల వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ప్రోత్సాహం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ:**ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రకృతి వ్యవసాయం పట్ల జిల్లా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలే కాకుండా, కూరగాయలు, పండ్ల తోటలు, వాణిజ్య పంటలు సాగు చేయడం, ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం ఉదయాదిత్య భవన్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, వ్యవసాయ అధికారులతో రానున్న వానకాలం వ్యవసాయ సాగు సంసిద్ధతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్ళించాలని, ముఖ్యంగా కంది, కూరగాయలు, పండ్ల తోటలు, అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటలవైపు వారిని మళ్లించాలని తెలిపారు. ఈసదస్సులోపద్మా రెడ్డి అంజిరెడ్డి, వెంకటేష్, రైతు నవీన్ రెడ్డి, శ్రీనివాస్, సత్తిరెడ్డి ,శ్రీనివాసరావు, తదితరులు నూతన పద్ధతిలో పండిస్తున్న ఉద్యాన, కూరగాయల సాగు, పామాయిల్ తోటల పెంపకం, ప్రకృతి వ్యవసాయం, లాభాలు, దిగుబడులు వివరించారు.

**రోగులను ప్రైవేటుకు రెఫర్ చేస్తే కఠిన చర్యలు మిర్యాలగూడ శిరీష హాస్పిటల్‌పై మెజిస్టేరియల్ విచారణకు ఆదేశం. జిల్లా కలెక్టర్**

గత డిసెంబర్‌లో కాన్పు కోసం ఆస్పత్రికి వచ్చిన దామరచర్ల మండలం, జైత్రం తండాకు చెందిన అడావత్ రాజేశ్వరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం సరిగా లేనప్పటికీ సకాలంలో ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడంలో నిర్లక్ష్యం వహించి రాజేశ్వరి మృతికి కారణమైన మిర్యాలగూడ శిరీష ఆస్పత్రి పై మెజిస్టీరియల్ విచారణతో పాటు, శాఖా పరమైన విచారణకు ఆదేశిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఈ కేసు విచారణకు రాగా వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇలాంటి సంఘటనలు జిల్లాలో పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ , డిసిహెచ్ సిడిపిఓలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల జీవితాల్లో మార్పు తేవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బాలు నాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం నుంచి మంజూరు అయిన 271మంది లబ్ధిదారులకు రూ.1,07,63,250 విలువ గల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అర్హులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తోందని అన్నారు.సీఎం సహాయ నిధి లాంటి పథకాలు ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు భరోసా ఇస్తున్నాయని పేర్కొన్నారు.దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి అర్హత కలిగిన లబ్దిదారునికిఈ పథకాల ద్వారా లాభాలు చేరేలా నిత్యం కృషి చేసి,ప్రజల సంతోషమే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్తమ విద్య ద్వారా భవిష్యత్**

ఉత్తమ విద్య ద్వారానే విద్యార్థుల కు బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలో నాలుగు రోజుల నుంచి ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కఠినమైన అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థుల కు సులభతరంగా బోధించే విధముగా మెళకువలను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రామావత్ నాగేశ్వర్ రావు,శిక్షణ మండల స్థాయి రిసోర్స్ పర్సన్స్ వి.రమేష్, శశిధర్, వెంకట్‌రెడ్డి, సతీష్, దేవులయ్య, ఏ.అంజయ్య, రవి కుమార్, శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిమ్ సేవలను యువత సద్వినియోగం

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/బొమ్మలరామారం:** మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో విస్తరిస్తున్న జిమ్ ఫిట్నెస్ సేవలను యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కోరారు. శుక్రవారం బొమ్మలరామారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలైట్ ఫిట్నెస్ జిమ్‌ను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఫిట్నెస్ జిమ్‌లు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం యువతకు గొప్ప అవకాశం అని ఇలాంటి ఫిట్నెస్ జిమ్‌లు యువత శరీర దారుఢ్యాన్ని మెరుగుపరుస్తాయని వారిలో ఉన్న వ్యాయామ కళా నైపుణ్యాన్ని బయటికి తీస్తాయని ఆయన అన్నారు. ఫిట్నెస్ జిమ్‌ల ద్వారా యువత పెడదారిన పడకుండా కూడా ఉపయోగపడతాయని యువత ఆరోగ్యం, ఆహ్లాదకరంగా ఉంటుందని ఆయన అన్నారు. మంచి ఉద్దేశంతో ఎలైట్ ఫిట్నెస్ జిమ్‌ను ఏర్పాటుచేసిన నిర్వాహకులు ఎలబోయిన హరిశంకర్ ఏలబోయిన సాయిలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఎలైట్ ఫిట్నెస్ జిమ్‌ను ప్రారంభించడానికి వచ్చిన ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను ఎలైట్ ఫిట్నెస్ జిమ్ కుటుంబ సభ్యులు ఎలబోయిన బిక్షపతి రాములమ్మ, ఎలబోయిన జంగయ్య లావణ్య, ఎలబోయిన నరేష్‌లు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.


## నకిలీ విత్తనాలు అమ్మితే 'పిడి'యాక్ట్ తప్పదు

జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** నకిలీ విత్తనాలు అమ్మితే వ్యాపారులపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ కె.నర్సింహ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విత్తనాల కొనుగోళ్లలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తింపు పొందిన కంపెనీల లేబుళ్లను తనిఖీ చేసి విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విడిగా విత్తనాలు కొనుగోలు చేయడం ప్రమాదకరమని చెప్పారు. మధ్యవర్తులను నమ్మవద్దని, గుర్తింపు పొందిన దుకాణదారుల నుండి విత్తనాలు కొనుగోలు సదరు దుకాణదారుల నుండి కొనుగోలు చేసిన విత్తనాల బిల్లును పొందలన్నారు. తక్కువ ధరలకు విత్తనాలు వస్తున్నాయని ఎవరైనా ఆశ చూపి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తే రైతులు మోసపోవద్దని అన్నారు. విత్తన దుకాణాలపై తనిఖీలు చేస్తామన్నారు. నకిలీ విత్తనాల గురించి అనుమానిత బ్రోకర్లు, తమ డీలర్ల గురించి సమాచారం తెలిసిన వారు వ్యవసాయశాఖ అధికారులకు, తమ దృష్టికి తేవాలన్నారు.

## గ్రామ పాలన అధికారి పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి:** గ్రామ పాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పాలన అధికారి రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. భువనగిరి పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం వెనక ఉన్న వెన్నెల కళాశాలలో ఏర్పాట్లు చేసిన్నట్లు పరీక్ష నెల 25న (ఆదివారం) రోజున నిర్వహించనున్న పరీక్షకు 151 మంది హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష వ్రాసే వారు పరీక్ష కేంద్రాలకు అర్ధగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు.

# మానవత్వం చాటుకున్న ఎంపి కావ్య

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్** : వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మరోసారి మానవత్వం చాటుకున్నారు. పరకాల పర్యటనలో భాగంగా హనుమకొండ నుండి పరకాల రోడ్డు మార్గంలో వెళుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చూసి తన వాహనాన్ని నిలిపివేశారు. వరంగల్ ఎంపి కడియం కావ్య స్వయానా ఒక డాక్టర్ కావడంతో పాటు రాజకీయ నాయకురాలు అనే కాదు డాక్టర్‌గా ఎందరికో వైద్య సేవలను అందించారు. తాజాగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తులకు వెంటనే ప్రథమ చికిత్స చేసి అందరిచేత ప్రశంసలు అందుకున్నారు. వివరాలలోకి వెళితే దామెర మండలం, సైలని బాబా దర్గా సమీపన బైక్ యాక్సిడెంట్ జరిగింది. అటుగా వెళుతున్న ఎంపి తన వాహనాన్ని ఆపి సంఘటన స్థలంలో జరిగిన ప్రమా దం గురించి ఆరా తీశారు. వెంటనే గాయపడిన వారికి ప్రథమ చికిత్స నిర్వహించి అంబులెన్స్ పిలిపిం చి, సమీప ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపి ఇలా రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి సాయం చేయడం గతంలోనూ జరిగింది.తన కాన్వాయ్‌ని ఆపి.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు.

# తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా పరిగణించి కొనుగోలు చేయండి

### వరంగల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించిన సివిల్ సప్లై కమిషనర్

**ప్రజాపక్షం/నర్సంపేట:** తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా పరిగణించి కొనుగోలు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ను ఆదేశించిన సివిల్ సప్లై కమిషనర్ ఆదేశించినట్లు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో గత నాలుగు, ఐదు రోజులుగా కురిసిన వర్షానికి 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని, తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా పరిగణించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఈ నెల 22న పౌరసరఫరాలు శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి విన్నవించామని, వెంటనే సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తర్వులు జారీ చేయాలని సివిల్ సప్లై కమిషనర్‌ని కోరారు. నర్సంపేట తో పాటు వరంగల్ జిల్లాలో తడిసిన 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ గా పరిగణించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మావోయిస్టుపై ఏకపక్షంగా మిలటరీదాడులు ఆపి శాంతిచర్చలు జరపాలని సిపిఐ జిల్లీఆ సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒక భావజాలాన్ని తుడిచిపెట్టేయాలని దురుద్దేశంతో మావోయిస్టులపై అత్యంత అధునాతన ఆయుధాలతో ఆపరేషన్ కగార్ పేరుతో ఏకపక్షంగా అనేక మంది మావోయిస్టు అగ్రనాయకులను ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని, తక్షణమే ఆపరేషన్ కగార్ ఆపివేయాలని సుధాకర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మావోయిస్టులది ఈ దేశంలో శాంతి భద్రతల సమస్యగా చూడకుండా దాన్ని సామాజిక ఆర్థిక కోణంలో చూసి, మావోయిస్టులు కోరుతున్నట్లుగా శాంతి చర్చలు జరిపి వారిని జన జీవన స్రవంతిలోకి కేంద్రం ఆహ్వానించాలని ఆయన డిమాండ్ చేశారు.

# సైనిక్ స్కూల్ ఫలితాలలో బాలాజీ విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా కేంద్రంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు బైరీ సహర్ష్, నల్ల కృష్ణ చైతన్యలు సైనిక్ స్కూల్‌లో ప్రవేశం పొందారు. అందుకు గాను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొలగాని రజనీకాంత్ మాట్లాడుతూ నిరంతర కృషి, పట్టుదల వల్లనే ఈ సైనిక్ స్కూల్‌లో బాలాజీ ప్రభంజనం జరిగిందని చెప్తూ పిల్లలను అభినందించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు సైన్స్ టీచర్ సుకృత, ఇంగ్లీస్ టీచర్ సురేష్, మ్యాథ్స్ టీచర్స్ రాకేస్ శర్మ, రంజిత్ రెడ్డి, సోషల్ టీచర్ రతన్ సింగ్, ఇంటెలిజెన్స్ పూర్ణేందర్‌లను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** హత్యాయత్నం కేసులో నిందితుడి నేరం రుజువు కావడంతో మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ జడ్జ్ సుచరిత శుక్రవారం తీర్పు వెల్లడించారు. కేసును వాధించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాచరాజు హరిచంద్ర ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జఫర్‌గడ్‌కు చెందిన సాధన అరుణ్ అనే యువకుడు బొమ్మకంటి మల్లేశం అనే వ్యక్తిపై 2017లో జఫర్‌గడ్ పిఎస్‌లో హత్యాయత్నం కేసు పెట్టాడు. ఫిర్యాదుదారుడు అరుణ్ తల్లి, తండ్రిపై నిందితుడు మల్లేశం చికెన్ కట్‌చేసే కత్తితో గాయపరుచడంతో అప్పటి జఫర్గడ్ ఎస్ఐ రాజన్‌బాబు కేసు నమోదు చేశాడు. కానిస్టేబుల్ వంశి సకాలంలో సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా సబ్ జడ్జి సుచరిత నిందితనిపై శిక్షను విధించారు.

# కిరాయి ఇంట్లో ఉన్న వారిపై మహిళా సిఐ దౌర్జన్యం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** నగరంలో మహిళా సిఐ కిరాయి ఇంట్లో ఉన్న వారిపై దౌర్జన్యం చేసిన ఘటన చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం హనుమకొండ టిఎన్‌జిఒ కాలనీలో సిఐ శ్రీలత సొంత ఇల్లును కొంతకాలంగా శ్రీరాముల శ్రావణ్ కుమార్‌కు కిరాయి ఇవ్వడం జరిగింది. శ్రావణ్ కుమారు వృత్తిరీత్యా అడ్వకేట్ ఇతను నిత్యం హైకోర్టుకు రోజు వెళ్లి రావడం జరుగుతున్నది. వీరి ఇంటికి వచ్చే కరెంటు సంబంధించిన బ్రేకర్స్ సిఐ శ్రీలత రూములో ఉండడం జరిగింది. ఈ సందర్భంలో కరెంటు పోవడం వల్ల సిఐకి తెలుపగా తనకు తెలిసిన కానిస్టేబుల్ మాచర్ల సుధాకర్‌కు తెలపడం జరిగింది.ఇదే అదునుగా చూసి శ్రవణ్ భార్యపైన భౌతిక దాడి అసభ్యమైన పదజాలం చేయడం జరిగిందని, తక్ష ణం సుబేదారి పోలీస్ స్టేషన్లో వారిపై ఫిర్యాదు చేయడం జరిగిందని బాధితులు తెలిపారు. తమను తక్షణమే సిఐ శ్రీలత వారిని ఉన్న ఫలంగా ఇల్లు కాల్ చేయమని చెప్పడం జరిగిందని,తను వేరే ఇల్లు వెతుక్కునేదాకా కొంత టైం ఇవ్వమని అడగడం జరిగినా సిఐ శ్రీలత తన అనుచరులతో కిరాయి ఇంట్లో ఉన్న వారి ఇంటి సామాన్లు బయటపడేయడం జరిగిందని తెలిపారు. ఇదే మి అన్యాయం అని అడిగితే నీ దిక్కున్న కాడ చెప్పుకోనందని, అలాగే అందరి ముందు అవమానించడం, దూషించడం, భౌతికంగా దాడి చేయడం జరిగిందని, దీనిపైన వరంగల్ సిపి కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకొని తమకు తగిన న్యాయం చేయాలని కోరుకుంటున్నామన్నారు.

# కల్తీ విత్తనాలను అరికట్టాలి



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** కల్తీ విత్తనాలను అరికట్టాలని, బ్లాక్ మార్కెట్‌కు విత్తనాల తరలించి అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతుకూలి సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి ఈర్లపైడి డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సర ం వ్యవసాయ సీజన్ ప్రారంభం కాబోతోందని, రైతులు తమ పంట భూములను చదును చేసి, విత్తనాలను విత్తుటకు సిద్ధంగా ఉన్నారు. కానీ ఈ సీజన్ ప్రారంభంలోనే ప్రతి సంవత్సరం విత్తన వ్యాపారులు కల్తీ చేసి రైతులను ని లువునా ముంచుతున్నారని, దానికి తోడు ఏ విత్తనములు మంచి దిగుబడిని ఇస్తుందో ఆ విత్తనాల ప్యాకెట్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్‌లో విత్తనాలను అధిక ధరలకు అమ్ముత్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. వరంగల్ జిల్లాలో వరంగల్ పట్టణం, న ర్సంపేట కేంద్రంగా చేసుకొని ఈ దళారీ వ్యాపారులు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారన్నారు. దీనికి వ్యవసా య అధికారులు కూడా సరైన పర్యవేక్షణ కొనసాగించడం లేదని, తక్షణమే స్పందించి కల్తీ విత్తనాలు అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు బోర్ర ఆనంద్, తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు,భైరబోయిన ఐలయ్య, శివరాత్రి కుమారస్వామి, గంట శంకరన్న, తల్లి సమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ

### రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రం సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, సమావేశంలో పాల్గొన్న హన్మకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పిసిసి పరిశీలకులు మక్సూద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా అన్ని మండలాల్లో పిసిసి పరిశీలకుల ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం కోసం సంస్థాగత నిర్మాణ సమావేశాలు జరుగుతున్నాయి అన్నారు. మండల, గ్రామ, బ్లాక్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా సంఘాల అధ్యక్షులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ సెల్ అధ్యక్షులకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతున్నాయని ఆయన వివరించారు. ఇప్పుడు గ్రామ స్థాయిలో పని చేస్తున్న వారు మండల స్థాయికి ప్రమోషన్ వస్తుంది, పని చేసిన వారికి అవకాశాలు వస్తాయని, ఎల్కతుర్తి మండలంలో గ్రామ, గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మండల నాయకులకు సమావేశం ద్వారా వివరించారు. సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి అన్ని ఎన్నికలు కాంగ్రెస్ కైవసం చేసుకోవాలి. తన ఎన్నికల కన్నా మీ ఎన్నికల కోసం ఎక్కువ కష్టపడతానని, మీరు కష్టపడాలి అని వివరించారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజల్లోకి ఇంటింటికీ తీసుకువెళ్లాలన్నారు. అదేవిధంగా ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచుకున్నాం అని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్, సన్న బియ్యం పంపిణీ, సన్న వడ్లకి రూ.500 బోనస్, రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీ, 60వేలకు పైగా ఉద్యోగాల భర్తీ చేశాం, కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నాం, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం, అని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు తాగునీటికి ఎక్కడ ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని, హుస్నాబాద్ అంటే మరింత గౌరవాన్ని పెంచేలా చేస్తానని, అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో ఎల్కతుర్తి మండలంలో 100 శాతం స్థానాలు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలి, అని మండల నాయకులకు పిలుపునిచ్చారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలాల్లో గ్రామాల్లో కమిటీలు ఏసుకునే బాధ్యత మండల నాయకులదేనని, పార్టీని బలోపేతంగా తీసుకువెళ్లే బాధ్యత మండల , నాయకుల మీద ఉంటుంది కాబట్టి కలిసికట్టుగా పనిచేసుకొని, పార్టీ జెండాను గుండెల మీద పెట్టుకుని ముందుకు తీసుకువెళ్ళాలి అని అన్నారు. ఈ సమావేశంలో మండల సీనియర్‌నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈపాస్ మెషిన్ల ద్వారానే ఎరువుల విక్రయాలు

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఎరువుల విక్రయాలను ఈపాస్ మెషిన్ల ద్వారానే చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శుక్రవారం వరంగల్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్‌లో వరంగల్ జిల్లాలోని రిటైల్ ఎరువుల వ్యాపారులకు కొత్త L1 ఈపాస్ మెషిన్ల కంపెనీ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని డీలర్లకు ఈపాస్ మెషిన్‌ను అందజేశారు. కలెక్టర్ మాట్లా డుతూ డీలర్లు అందరూ తప్పనిసరిగా ఎరువుల విక్రయాలను ఈపాస్ మెషిన్ ద్వారా మాత్రమే చేపట్టాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఈపాస్ మిషన్ల స్థానంలో కొత్త L1 ఈపాస్ మెషిన్లను పంపిణీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎరువుల శాఖ వారు, రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం 171 ఈపాస్ మెషిన్లను కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ వారు డీలర్లకు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు ఎరువుల పంపిణీ పారదర్శకంగా సాగేందుకు, ప్రభుత్వ నిబంధనల మేరకు ఆధునిక సాంకేతికత వినియోగం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈపాస్ మెషిన్‌లతో ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా సాగుతుందని, రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో సరైన రేట్లకు అందుబాటులోకి వస్తాయని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, వ్యవసాయ సహాయ సంచాలకులు కే దామోదర్ రెడ్డి , నర్సింగం, వ్యవసాయ అధికారి రవీందర్, టెక్నికల్ ఎఒ కృష్ణారెడ్డి , కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ జోనల్ మేనేజర్ సుజన్ కుమార్, సుమన్ రెడ్డి , కోరమండల్ కంపెనీ సిబ్బంది, వరంగల్ జిల్లాలోని ఎరువుల రిటైల్ డీలర్లు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** స్థానిక సమస్యలపై కార్యకర్తలు కార్యచరణ రూపొందించుకుని పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ గుండంరాజుపల్లి శాఖా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మావోయిస్టుల సమస్యను ఆర్థిక, సామాజిక కోణంలో చూడకుండా శాంతి భద్రతల సమస్యగా చూసి వారిపై ఆధునిక సాంకేతిక ఆయుదాలను ఉపయోగించే మిలిటరీ దాడులను చేయడం అమానుషమని, ఆపరేషన్ కగార్ వెంటనే ఆపి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. గుండంరాజుపల్లి శాఖ కార్యదర్శిగా ఒగ్గుల వెంకన్న, 5గురు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గంజి శేషాద్రిరెడ్డి, దొంతు స్టాలిన్, పోలెపాక వెంకన్న, కందుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఐ రాజీలేని పోరాటం

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి



**ప్రజాపక్షం/శాయంపేట :** జిల్లా సమగ్రాభివృద్ధికై సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని, గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు. శుక్రవారం శాయంపేట మండలంలోని పెద్ద కొడేపాక శివారులో సిపిఐ శాయంపేట మండల 2వ మహాసభ ఘనంగా జరిగింది. మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎండి అంకుషావలి అధ్యక్షతన జరిగిన మహాసభలో తోట భిక్షపతి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా హామీలను అమలు చేయడంలో పాలక పార్టీలు విఫలం అయ్యాయని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమయిందని, దేశాన్ని కార్పొరేట్‌లకు తా కట్టుపెట్టి దివాళా తీయించిందని అన్నారు. మోదీ నమ్మిన బంటు ఆదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను దోచి పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విపక్ష పార్టీల నాయకులపై సిబిఐ, ఈడిలను ప్రయోగిస్తున్న మోదీ ప్రభుత్వం ఆదానీపై ఎందుకు ప్రయోగించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపై మోదీ ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ అని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేశారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు రెండు లక్షల రైతు రుణమాఫీ పూర్తిగా ఇవ్వాలని, ఇందిరమ్మఇండ్ల పంపిణీ పారదర్శకంగా అర్హులైనపేదలకు అందించాలని, జిల్లాలో అసంపూర్తిగా ఉన్నా దేవాదుల ప్రాజెక్టును పూర్తిగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా శాయంపేట మండలంలో ఎన్నో ఏ ళ్లుగా గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు గుడిసె వాసులకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం జరిగిన పోరాటంలో సిపిఐదే ఉమ్మడి జిల్లాలో అగ్రగామి పాత్ర అని, గ్రామాల్లో ఉపాధి హామీ, పట్టణల్లో మున్సిపల్ వర్కర్స్, సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై, నిలువనీడలేని పేదలకు ఇండ్ల స్థలాల కోసం గుడిసెల పోరాటాలు నడిపింది సిపిఐ అని, జిల్లా సమగ్ర అభివృద్ధికై సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని వారన్నారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, సీనియర్ నాయకులు ఇల్లందుల సాంబయ్య, నాయకులు వల్లాల రమేష్, ఎండీ అంకుషావలి, సముద్రాల రవి, ముంద్రాతి రమేష్, ఎండీ మైనొద్దిన్, సాంబయ్య, బోగి రమాదేవి, ఎండీ గౌసియా, రమాదేవి, బొంకురి కోమల, జోడు లక్ష్మి పాల్గొన్నారు. **సిపిఐ మండల సమితి ఎన్నిక :** సిపిఐ మండల కార్యదర్శిగా బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శులుగా అనుకారి అశోక్, సముద్రాల రవి, 9 మంది కార్యవర్గం, 18 మందితో మండల కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# కార్పొరేట్ల కోసమే మావోయిస్టుల హతం

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్



**ప్రజాపక్షం/ ఎల్కతుర్తి :** మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, అలియాస్ గంగన్న మరో పాతిక మందికి పైగా అమాయక ఆదివాసీలను ఎన్కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిలచే న్యాయ విచారణ జరిపించాలని దళిత హక్కుల పోరాట సమితి ( డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం రోజున ఎల్కతుర్తి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు మ్రి శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి శనిగరపు రాజకుమార్, మండల సహాయ కార్యదర్శి మ్రి విజయ్, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో అనిల్ కుమార్ మాట్లాడుతూ ఫహల్గామ్ ఉగ్రవాద నేరస్తుల ఉనికిని సైతం పసిగట్టి శిక్షించలేని పాలకులు మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను, మావోయిస్టుల్ని హత్య చేసి గర్వంగా ప్రకటన ఇవ్వడం ఫాసిస్టు నీతికి నిదర్శనం అని అన్నారు. అడవుల్ని కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యంతో మోదీ సర్కార్ తలపెట్టిన ఆపరేషన్ కగార్ నేడు హత్యాకాండకి బహిరంగ లైసెన్స్ ఇవ్వడం దారణమైన చర్యగా డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సమితిగా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా అబూజ్ మడ్‌లో కేంద్ర సాయుధ బలగాల కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు 27 మందికిపైగా మృతి చెందినట్లు తెల్సిందని, అయితే నంబాల కేశవరావు అలియాస్ గంగన్న ఒడిస్సాలో అనారోగ్యంతో ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూన్న సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకొని చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారు. ఒకవైపు శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని పదే పదే కోరుతున్న సమయంలో ఇలాంటి దారుణనికి ఒడిగట్టడం ఫాసిస్టు నీతిని వెల్లడి చేస్తున్నదన్నారు. ఆపరేషన్ కగార్ ఆపాలని మేధో వర్గాలు, ప్రజాతంత్ర వాదులు, బుద్ధి జీవులు, ప్రజలు ప్రజాస్వామిక వాదులు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర సర్కార్ ని కోరుతున్నా మోదీ, అమిత్ షాల ప్రభుత్వం స్పందించకపోగా తమ నరమేధాన్ని తీవ్రతరం చేసిందన్నారు. అడవి నుండి ఆదివాసీలను ఖాళీ చేయించి, అంతిమంగా అడవి సంపదను బడా కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టడానికే ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందన్నారు. ఫహల్గామ్ ఉగ్రదాడి కూర నేరస్తుల నుండి పర్యాటకులకు భద్రత కల్పించడానికి, ఆ దాడి తర్వాత నేరసుల్ని బంధించి శిక్షించడానికి లేని శ్రద్ధ శాంతి చర్చల్ని కోరుతున్న మావోయిస్టు పార్టీ మీద కేంద్రీకరణ చేస్తున్న క్రూర విధానాన్ని ఖండిస్తున్నామన్నారు. కగార్ ఆపరేషన్ ని వెంటనే ఆపాలనీ, సైనిక బలగాలను వెనక్కి రప్పించాలనీ, ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిలచేన్యాయ విచారణ జరిపించాలనీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఆరెపల్లి చంద్రమౌళి, మోహన్‌రెడ్డి, అంబాలబాలస్వామి, వేముల కుమారస్వామి, వేముల కృష్ణకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించింది సిపిఐనే


### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించినా ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ అన్నారు.హనుమకొండ జిల్లాలోని ధర్మ సాగర్ మండల కేంద్రంలో శుక్రవారం సిపిఐ రెండవ మహాసభ సిపిఐ సీనియర్ నాయకులు బట్టు మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సభకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదరి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని, మన జిల్లాలో పేదల హక్కుల సాధనకై త్యాగాలు చేసిందని, బొడ్డు అబ్రహం, తోకల రాజిరెడ్డి, మంద నారాయణ, జగ్గారెడ్డి ఈ జిల్లాలో అనేక సంవత్సరాలు పోరాటాలు చేసి జిల్లా అభివృద్ధి కోసం తీవ్రంగా కృషి చేశారని అన్నారు. అమరుల ఆశయ సాధన కోసం వరంగల్ జిల్లాలో అనేక కార్మిక, కర్షక, విద్యార్థి సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన ఘనత వారికి దక్కుతుందని అన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో నిలువ నీడలేని పేదలను సమీకరించి భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాల చేసి వేలాది మంది పేదలకు నివాస స్థలాలు సాధించి పెట్టిన సిపిఐ పార్టీ అన్నారు. ఈ తరుణంలో రెండవ జిల్లా మహాసభలను జయప్రదం చేయుటకు కార్యకర్తలు 26న హసన్ పర్తి లో జరిగే భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని, కావున ధర్మసాగర్ మండలంలోని ప్రజలందరూ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మండల రెండో మహాసభలో ముందుగా సిపిఐ సీనియర్ నాయకులు బట్టు మల్లయ్య జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం రెండో మహాసభ లో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కొట్టే వెంకటేష్, సహాయ కార్యదర్శిలుగా గోకల రాజయ్య, కనుకటి రాజయ్య, కోశాధికారిగా రాజారపు రత్నం, కార్యవర్గ సభ్యులుగా చిలుక బాబు, వల్లెపు సారయ్య, చిలుకూరి ప్రభాకర్ ఐదుగురిని కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ సభలో సిపిఐ సీనియర్ నాయకులు చిలక దేవ దాస్, కుమ్మరి అంకుష్, రాజారపు రాజు, వల్లపు రెడ్డి ధర్మారెడ్డి, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి, ధర్మసాగర్ మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మ ణ్, పసునూరి సునీల్, చిలుక ప్రతిభ, వల్లపు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సొసైటీ సేవలు సద్వినియోగం

### ఎంపి కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/పరకాల :** రెడ్ క్రాస్ సొసైటీ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న బ్లడ్ స్టోరేజ్ సెంటర్ నూతన భవనానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్లడ్ స్టోరేజ్ సెంటర్, రెడ్ క్రాస్ సొసైటీ బిల్డింగ్ నిర్మాణ పనులను ఎంపి కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగాఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వైద్యులుగా తమకు రక్తం విలువ తెలుసునని అన్నారు. తాను బ్లడ్ స్టోరేజ్ సెంటర్లో వైద్యురాలిగా పనిచేసినట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర గవర్నర్ సూచించారని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు జిల్లాలలో రెండు జిల్లాలు హనుమకొండ, వరంగల్ లలో రెడ్ క్రాస్ సొసైటీలు ఉన్నాయని అన్నారు. అదేవిధంగా భూపాలపల్లి, జనగామ జిల్లాలలో కూడా వీటిని ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. థలసేమియా బాధితులకు ఎప్పటికప్పుడు రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. థలసేమియా భారీన పడిన చిన్నారులకు అప్పుడప్పుడు రక్తం లభించకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్తుంటారని పేర్కొన్నారు. అట్లాంటి వారందరికీ రెడ్ క్రాస్ ద్వారా సేవలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెడ్ క్రాస్ సేవలు మరింతగా విస్తరించాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీకి ప్రజాప్రతినిధులుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రెండు రోజుల క్రితం ఇక్కడ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డిజబులిటీ సెంటర్ తో పాటు థలసేమియా సెంటర్ను ఏర్పాటు చేయాలని తనకు వినతి పత్రాన్ని అందించారని పేర్కొన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నందున ఢిల్లీ కి వచ్చినట్లయితే హెల్త్ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి వాటి ఏర్పాటుకు కృషి చేద్దాం అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ కొత్త తరహా సేవలను కృషి చేయాలని, ఇందులో భాగంగా మేనుస్ట్రువల్ హైజిన్‌తో పాటు కౌమార దశ బాలికలకు రక్తహీనత ఏర్పడుతుంది కాబట్టి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ పెరగడానికి ఐరన్ మాత్రలను అందించాలన్నారు. పరకాల ఆర్డిఓ డాక్టర్ నారాయణ, సిహెచ్‌సి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహన్, హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, ప్రతినిధులు బొమ్మినేని పాపిరెడ్డి, ఇ.వి. శ్రీనివాసరావు, డాక్టర్ సంధ్యారాణి, వేణుగోపాల్, డాక్టర్ శేషు మాధవ్, రమణా రెడ్డి, ఇతర సభ్యులతో పాటు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళా

**ప్రజాపక్షం/కారేపల్లి :** మండల కేంద్రంలో కమ్మలగుంట ప్రాంతంలో జరిగే ఉపాధి హామీ పనుల ప్రదేశంలో వైరాలో జరగబోయే మెగా జాబ్ మేళాకు యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని పంచాయితీ కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులు మెగా జాబ్ మేళాకు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చొర వతో వైరా ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్ సింగరేణి కాలరీస్ సహకారంతో హైదరాబాద్ వెళ్లకుండానే 80 ప్రైవేట్ సంస్థల సహకారంతో 5000 ఉద్యోగ అవకాశాలు వైరాలో ఈనెల 24వ తేదీన శనివారం ఉదయం 9గంటల నుండి ప్రారంభిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సింగరేణి మండల పరిధిలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జాబ్ మేళాలో అర్హత సాధించాలని కోరారు. అర్హతలో భాగంగా సెవెంత్, టెన్త్ పాస్, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ వంటి కోర్సులలో అర్హతను వినియోగించుకొని జాబ్ మేళాలో పాల్గొనాల్సిందిగా కోరారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నెహ్రూ, ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి టోనీ, సొసైటీ డైరెక్టర్ ఐలయ్య, సురేందర్ మనియార్, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులు... ప్రభుత్వ విద్యారంగానికి మూలస్తంభాలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ రంగ విద్యను నిలబెట్టడంలో కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యావనరుల కేంద్రంలో గత నాలుగురోజులుగా జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. మనస్సుపెట్టి పనిచేస్తే సాధించలేనిది ఏదీ లేదని, పాఠశాలలో సహజభాగస్వామ్యాన్ని పెంచుతూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో తమ వంతు పాత్రని పోషించాలన్నారు. అంతకుముందు పాల్వంచలోని జిల్లా పరిషత్ పాఠశాల్లో జరుగుతున్న జీవ శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. శిక్షణ ద్వారా అవగాహన చేసుకున్న అనేక విషయాలు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్నారు.

## సహకార సంఘం ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** మండల పరిధిలోని గుంపెన గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసన సభ్యులు జారే ఆదినారాయణ హాజరయ్యారు. సహకార సంఘం చైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావుతో కలిసి రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని, రైతుల కొరకు వ్యవసాయానికి సకాలంలో ఎరువులు అందించడం కూడా జరుగుతుందని, ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. భూమికి చావను పెంచే పచ్చిరొట్ట విత్తనాలను రైతులందరూ కూడా తీసుకువెళ్లి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వానకాలం సాగుకు ముందే రైతు భరోసా అందించబడుతుందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. ఈకార్యక్రమంలో అశ్వారావుపేట అదనపు వ్యవసాయ అధికారి రవికుమార్, మండల వ్యవసాయ అధికారి అనూష, సహకార సంఘం వైస్ ఛైర్మన్ వెంకట్‌నారాయణ, సీఈవో సురేందర్, మాజీ వైస్ ఎంపీపీ మామిళ్ళపల్లి రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వనమా గాంధీ, పరస వెంకటేశ్వర్లు, నేరెళ్ల లాలయ్య, యువజన అధ్యక్షులు వేముల నరేష్, దుబ్బాకుల రాము, బాణావత్ భీముడు, రాజకీయ నాయకులు, రైతులు, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రమదోపిడి ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుంది

### ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జ్ తో విచారణ చేయించాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** శ్రమదోపిడి ఉన్నంతకాలం కమ్యూనిజం, నక్సలిజం ఉంటుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు షేక్ ఖాసిం అన్నారు. కొణిజర్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతు ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్ లో మావోయిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి సంబాల కేశవరావుతోపాటు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈదేశంలో ఉన్న కార్పోరేట్ సంస్థలకు అడవి గుట్టల్లో ఉన్న ఖనిజ సంపదను కట్టబెట్టడానికి అడవి బిడ్డలకు అండగా ఉన్న మావోయిస్టులను చంపి అడవిబిడ్డలను అడవుల నుంచి ఖాళీచేయించాలనే ఉద్దేశ్యంతో మావోయిస్టులను కాల్చిచంపడమే లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందని ఆరోపించారు. ఎన్‌కౌంటర్ తర్వాత దేశహోంమంత్రి సంబరాలు చేసుకున్నారని దీంతో అమిత్‌షా క్రూరత్వం బయటపడిందని విమర్శించారు. కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తున్న మావోయిస్టుల అణచివేత ధోరణిని అన్ని రాజకీయపార్టీలు ముక్తకంఠంతో ఖండించాలని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

## ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి గొప్పవరం

### ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/పినపాక :** కాంగ్రెస్ తోనే పేదలకు న్యాయం జరుగుతుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పినపాక రైతు వేదికలో ఏర్పాటుచేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అవినీతి లేకుండా పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పేదింటి ఆడబిడ్డలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటూ ఇందిరమ్మ ఇల్లులు, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఉచిత బస్సు ప్రయాణం, కళ్యాణ లక్ష్మి వంటి అనేక పథకాలను పార్టీలకతీతంగా అందిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పేద ప్రజల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని, బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో పేద ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురయ్యారన్నారు. అందుకే ఆ పార్టీని పక్కకు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎంచుకున్నారన్నారు. అనేక భూ సమస్యలతో ధరణి ఏర్పడితే, భూ వివాదాలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం భూమాత తీసుకువచ్చిందన్నారు. ఇక తెలంగాణలో భూ వివాదాలకు తావు లేదన్నారు. రేషన్ కార్డులు కూడా లేని వారికి రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతూ ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో పాలనలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మి దేళ్లు పాలించి అప్పుల తెలంగాణగా మార్చారని మండిపడ్డారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేసిన ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ప్రస్తుత సీజన్లో జీలుగు విత్తనాలు సైతం 50% సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 31 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు సైతం అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ నాగయ్య, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, కాంగ్రెస్ మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అనధికార నిర్మాణం కూల్చివేత



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అనాధికారికంగా నిర్మిస్తున్న కట్టడాన్ని ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు తొలగించారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురం రోడ్డు నెం.7లో ఎటువంటి అనుమతులు లేకుండా అనాధికారికంగా నిర్మిస్తున్న కట్టడాన్ని అధికారులు తొలగించారు. ఇటీవల ఖమ్మం నగరంలో అనాధికార కట్టడాల కోసం ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉండే నిర్మాణాలను గుర్తించి వాటిని తక్షణమే తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగానే భవన నిర్మాణాలు చేపట్టాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజల సహకారంతో ఖమ్మం నగరాన్ని పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచండి



అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అభివృద్ధిలో ముందంజలో ఉన్న ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని రెండవ డివిజన్ పాండురంగాపురంలో పర్యటించి కోటి రూపాయలతో నిర్మించనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పాండురంగాపురం ఖమ్మం నగరానికి దూరంగా ఉండేదని కాల క్రమేణ అభివృద్ధి చెంది నగరంలో కలిసిపోయిందన్నారు. రెండు, మూడవ డివిజన్‌లో ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలను అమలు చేయాలన్నారు. రోడ్డు వెడల్పు, డ్రైన్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు ప్రజలను ఒప్పించి చేయని పక్షంలో మరోసారి వరదల సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి తెలిపారు. 50 సంవత్సరాల కాలం ఖమ్మం నగరం అభివృద్ధిని అంచనా వేస్తూ అవసరమైన త్రాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన చేయాలన్నారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో డ్రైన్లను శుభ్రం చేయాలన్నారు. పాండురంగాపురం ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచి మొక్కలు పెంచితే మనకు ఆహ్లాదకర వాతావరణంతో పాటు మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రజలను ఒప్పించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఆటంకాలను అధికమించాలన్నారు. డ్రైన్ నిర్మాణ పనులకు వెంటనే పెగ్ మార్క్ చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలన్నారు. నగరంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులు గ్రౌండింగ్ కావాలని, ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని, త్రాగునీటి సరఫరా కోసం మరో రూ. 220 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఖమ్మం నగరానికి చుట్టు ప్రక్కల జాతీయ రహదారులు వచ్చాయని రైల్వే కనెక్టివిటి ఉందని మంచి వైద్య సదుపాయాలు, విద్యా సంస్థలు ఏర్పడ్డాయని, వైద్య కళాశాల, స్టేడియం నిర్మాణం జరుగుతున్నాయన్నారు. నగరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రశాంతంగా, పరిశుభ్రంగా ఉంచే బాధ్యత మనందరిపై ఉందన్నారు. మతాలు, కులాల మధ్య గొడవలు పెట్టి పబ్బం గడుపుకోవాలనుకునే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి తెలిపారు. ప్రజలంతా కలిసి ఉంటేనే ఆనందంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, కార్పొరేటర్లు వలీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, లకావత్ సైదులు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమను తలపిస్తున్న పాలేరు రిజర్వాయర్...

### మంత్రి పొంగులేటి కృషిఫలితం
### మున్నేరు వరదను ఒడిసిపట్టి రిజర్వాయర్‌కు మళ్లింపు
### రూ.162.54కోట్లు మంజూరు
### ఆనందడోలికల్లో పాలేరు నియోజకవర్గ రైతులు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ప్రతి సంవత్సరం వర్షాకాలం సమయంలో మున్నేరు నుండి వందలాది క్యూసెక్కుల నీరు వృధాగా సముద్రం పాలు అవుతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృషితో మున్నేరు వరదను సీతారామ గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌ను నింపేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.162.54కోట్లు మంజూరు చేయగా ఇందుకు సంబంధించి జీవో నెంబర్ 98ని విడుదల చేయటంతో పాలేరు నియోజకవర్గ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పాలేరు రిజర్వాయర్ నుంచి భక్త రామదాసు ఎత్తిపోతల ద్వారా పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల చెరువులకు నీరందిస్తున్నారు. సీతారామ పనులు పూర్తయితే పూర్తిగా పాలేరు నియోజకవర్గం సాగునీరుకు, తాగునీరుకు ఎలాంటి డోకా ఉండదు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముందు చూపుతో డోర్నకల్ వద్ద మున్నేరు వరదను కరెంట్ ఖర్చు గాని మోటర్ల ఖర్చు లేకుండా వచ్చే వర్షం ద్వారా వచ్చే మున్నేరు వరదను సీతారామ గ్రావిటీ కెనాల్‌కు మళ్లించి పాలేరు రిజర్వాయర్‌ను నింపడంతో పాలేరు రిజర్వాయర్ ఎంత ప్రతికూల పరిస్థితులు ఎదురైనా గరిష్టానికి నీటి మట్టం తగ్గకుండా ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. తద్వారా పాలేరు నియోజకవర్గంతో పాటు సాగర్ ఆయకట్టుకు కూడా గోదావరి మున్నేరు వరద నీళ్లు అందించవచ్చని తెలిపారు. పాలేరు రిజర్వాయర్ ద్వారా ఇప్పటికే సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు మిషన్ భగీరథ నీళ్లు వెళ్తున్నాయని, మున్నురు వరద నీరు మళ్లింపు ద్వారా తాగునీరుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, వ్యవసాయ సాగు కోసం డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో పది చెరువులకు సాగునీరు అందుతుందని అధికారులు తెలిపారు. మున్నేరు వరద మళ్లింపు ద్వారా పాలేరు రిజర్వాయర్ పరిధిలో 2.54లక్షల ఎకరాల ఆయకట్టు సాగుకు నీరు అందుతుందని, ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే 1.30లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. రానున్న రోజుల్లో పాలేరు నియోజకవర్గం భక్త రామదాసు, సీతారామ, మున్నేరు వరద మళ్లింపుతో మరో కోనసీమగా పాలేరు నిత్యం సాగునీరు, తాగునీరుతో కళకళలాడబోతుంది. పాలేరు శాసనసభ్యులు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృషితో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మున్నేరు వరదను పాలేరు రిజర్వాయర్‌కి పంపించేందుకు రూ.162.54 కోట్లు మంజూరు చేయటం పట్ల పాలేరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# నంబాల ఎన్‌కౌంటర్ తర్వాత 'హైఅలర్ట్'




### ముమ్మాటికి హత్యే అంటున్న పౌర హక్కుల సంఘాలు
### నంబాల డైరీపై విస్తృత చర్చ

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఎన్‌కౌంటర్ తర్వాత నాలుగు రాష్ట్రాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా ఛత్తీస్‌ఘఢ్‌తో పాటు దండకారుణ్య సరిహద్దు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో సాయుధ బలగాలు అప్రమత్తమయ్యాయి. కేశవరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంలోనూ తీవ్ర జాప్యం జరుగుతుంది. మృత దేహాన్ని స్వాధీనం చేసుకునేందుకు బంధుమిత్రుల సంఘం బాధ్యులు నంబాల బంధువులు వెళ్లినప్పటికీ మృతదేహాన్ని అప్పగించేందుకు పోలీసులు సుముఖంగా లేరని సమాచారం. శ్రీకాకుళం ప్రాంతానికి నంబాల మృత దేహాన్ని తీసుకు వస్తే ఉద్రిక్తత నెలకొని అవాంఛనీయ ఘటనలు జరిగే ప్రమాదం ఉందని అందుకే మృత దేహాన్ని అప్పగించడంలో జాప్యం జరుగుతుందని చర్చ సాగుతుంది. ఇదిలా ఉండగా నంబాల కేశవరావు డైరీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని అందులో డిఆర్‌జి దళాలు మావోయిస్టులను బతకనిచ్చే పరిస్థితి లేదని తప్పించుకోవాలని ఆయన హిందీలో ఒక పుస్తకంలో రాసుకున్న మాటలను చూపుతూ కేశవరావు వద్ద నుంచి ఈ పుస్తకం ద్వారా మావోయిస్టు సమాచారం తెలుసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ ఉద్రిక్తతల నడుమ భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళ్లే ఆంధ్రా, తెలంగాణకు చెందిన ఆర్టీసి బస్సులను శుక్ర, శనివారం రెండు రోజులు నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. ఇదిలా ఉండగా నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘాలు, అమరవీరుల బంధు మిత్రుల సంఘం ఇది ముమ్మాటికి హత్యేనని ఆరోపిస్తున్నారు. ఒడిశాలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేశవరావును ఇంద్రావతి నది దాటించి ఛత్తీస్‌ఘఢ్‌లోకి తీసుకువచ్చి చిత్రహింసలుపెట్టి కాల్చి చంపారని ఆరోపిస్తున్నారు. అర్థ శతాబ్దానికి పైగా మావోయిస్టు ఉద్యమంలో అత్యంత కీలక నేతగా పనిచేసిన కేశవరావుకు ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్, ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక అభిమానులు ఉన్నారు.

**నాయకత్వంలో సింహభాగం తెలంగాణదే :**

మావోయిస్టు ఉద్యమం ఛత్తీస్‌ఘఢ్, పశ్చిమబెంగాల్ సహా 12 రాష్ట్రాల్లో విస్తరించిన మావోయిస్టు పార్టీకి అత్యంత సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించిన ప్రాంతం తెలంగాణ. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలోని ఉస్మానియా విశ్వ విద్యాలయం, వరంగల్‌లోని రీజినల్ ఇంజనీరింగ్ కళాశాల, ఉద్యమ బీజాలను నాటాయి. ఒక మాటలో చెప్పాలంటే విప్లవోద్యమ విత్తన ఉత్పత్తి కేంద్రాలుగా ఇవి పని చేశాయి.అనేక మంది ఈ ప్రాంతంలో ఉన్నత విద్యను అభ్యసించి మావోయిస్టు భావజాలంతో సాయుధ పోరాటంలోకి అడుగు పెట్టారు. అత్యున్నత స్థానాలకు ఎగబాకి మావోయిస్టు ఉద్యమాన్ని తమ కనుసన్నలతో శాసించారు. నిన్నటి ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు సైతం వరంగల్ ఇంజనీరింగ్ కాలేజీ అందించిన యోధుడే. మూడు దశాబ్దాల క్రితం సాయుధ పోరాట భావాజాలం ఇప్పుడు లేదు. మావోయిస్టు పార్టీకి సంబంధించి రిక్రూట్‌మెంట్ జరగడం లేదు. దశాబ్ద కాలం క్రితం కొందరు యువకులు ఆవైపుకు ఆకర్షితులయ్యారన్న ప్రచారం జరిగినప్పటికీ అది అంతగా ఫలితాలను ఇవ్వలేదు.తెలంగాణ ప్రాంతానికి చెందిన పలువురు సాయుధ పోరాట నాయకత్వ స్థానాల్లో ఉన్నప్పటికీ ఆ తర్వాత తరాన్ని ఆవైపుకు నడిపించడంలో వైఫల్యం చెందారు. మారిన పరిస్థితులు, సన్నగిల్లుతున్న భావాజాలం ఇలా కారణాలు ఏమైనా ఎన్‌కౌంటర్‌లో హతం కావడం తప్ప రిక్రూట్‌మెంట్లు లేకపోవడం వల్లనే మావోయిస్టు పార్టీ క్రమేపి బలహీనపడింది.

## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



**ప్రజాపక్షం/ఖమ్మం :** మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని మధ్య భారతంలో ఆదివాసీలపై జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధాన్ని ఆపాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఆదివాసీల అంతం కోసం దండకారుణ్యంలో నెలకొన్న ప్రకృతి సంపదను కాజేసేందుకే మావోయిస్టుల మాటున ఆదివాసీలను తరిమివేస్తున్నారని ఆయన ఆరోపించారు. శుక్రవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కర్రెగుట్ట అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ మధ్య భారతంలో మావోయిస్టు కార్యకలాపాల కారణంగా అపారమైన ఖనిజ సంపద రక్షించబడిందని ఇప్పుడు ఆ సంపదను దోచుకునేందుకే ఆపరేషన్ కగార్ ప్రారంభమైందన్నారు. విదేశాలతోనూ, ఉత్తర భారతంలోని అనేక మిలిటెంట్ గ్రూపులతో శాంతి చర్చలు జరిపిన కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపేందుకు ఎందుకు స్పందించడం లేదని సురేష్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు,జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, మిడికంటి వెంకటరెడ్డి, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, జ్వాలా నర్సింహారావు, నంబూరు శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## టయోటా షోరూం ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం నియోజకవర్గంలోని విద్యానగర్ నందు నూతన నూతనంగా ఏర్పాటు చేసి కాకతీయ టయోటా కార్ షోరూమ్ నుకొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టయోటా కంపెనీ నూతన టెక్నాలజీతో రకరకాల కార్లు కొత్తగూడెం షోరూం నందు అందుబాటులో నుంచి ప్రజల సౌకర్యార్థం సరసమైన ధరలలో అమ్మకాలలో కొనసాగించాలని అన్నారు. పేద మధ్య తరగతి వారికి అది తక్కువ ధరలకు అందించాలని దృక్పథంతో జిల్లా కేంద్రంలో షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలు వారికి నచ్చిన కార్లను కొనుగోలు చేసి టెక్నాలజీకి అనుకూలంగా కార్లను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఏ కారునైనా వివిధ ఫైనాన్స్ సంస్థల ద్వారా ఈఎంఐ పద్ధతిలో కొనుగోలు చేసుకోవచ్చును ఎక్స్చేంజ్ సౌకర్యం కూడా కలదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది కస్టమర్లు ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు




**ప్రజాపక్షం/పెనుబల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ నిర్మాణం లో భాగంగా పెనుబల్లి మండలం లోని అన్ని గ్రామాల వారీగా మొత్తం 599+ మంది పేద కుటుంబ లబ్ధిదారులకు శుక్రవారం పెనుబల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ప్రజలు 10 సంవత్సరాలు నిరీక్షణ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం పేదవాడి ఇంటి కల నెరవేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో, సత్తుపల్లి నియోజకవర్గంలో ఈరోజు ఇందిరమ్మ ఇల్లు గృహ నిర్మాణం చేసుకోవటానికి మనందరం ఒక పండగ లాగా, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు లాగా ఇందిరమ్మ పట్టాలు తీసుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే పేద కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. దళిత నియోజకవర్గమైన మన సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర మంత్రి బట్టి విక్రమార్కకి, తుమ్మల నాగేశ్వరరావుకి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి ప్రజలందరి తరపున ధన్యవాదాలు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆర్డీవో, ఎంపీడీఓ, తహశీల్ధార్, హౌసింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇల్లు నిర్మాణంలో మొదటినుండి చేపట్టవలసిన ప్రతి అంశాన్ని లబ్ధిదారులకు పూర్తిగా వివరించారు. పెనుబల్లి మండలంలో మొత్తం 599 ఇందిరమ్మ ఇల్లు చేపడుతున్నామని, పెనుబల్లి మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం జరుగుతున్న సందర్భంలో వారికి మొదటి విడత లక్ష రూపాయలు అందరి అకౌంట్లో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు జమ చేసిందని వివరాలతో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఇందిరమ్మ ఇల్లు ప్రక్రియలో సత్తుపల్లి నియోజకవర్గం అగ్రగ్రామీగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు నారాయణ వరపు శ్రీనివాస్, కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు,కార్యకర్తలు, గ్రామస్తులు, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు పట్టాలు అందజేత



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** అన్నపురెడ్డిపల్లి మండలంలో ఉన్నటువంటి వివిధ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఇంటికి సంబంధించిన ధ్రువపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడి పక్షాన ఎప్పుడూ ఉంటుందని, పేదవాడి సొంత ఇంటి కలలు నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పని చేస్తుందన్నారు. అందులో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అధికారిక ధ్రువపత్రం అందజేయడం జరిగిందని, ప్రతి ఒక్కరు కూడా సకాలంలో ఇంటి నిర్మాణాలను చేసుకోవాలని, లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా సహకరించానలి తగిన సూచనలు సలహాలు తెలిపారు. మండలంలో భీమునిగూడెం 13 మంది లబ్దిదారులకు, పెద్దిరెడ్డిగూడెం 36 మంది లబ్దిదారులకు, అన్నపురెడ్డిపల్లి 54 మంది లబ్దిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు. ఎవరు నిరాశ చెందవద్దని తర్వాత వచ్చే మూడో ఫేజ్‌లో అర్హులైన మిగిలిన వారికి ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో మహాలక్ష్మి, వ్యవసాయ అధికారి అనూష, హౌసింగ్ ఏఈ రాము, పంచాయితీ కార్యదర్శులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వనమా గాంధీ, పరస వెంకటేశ్వర్లు, వేముల రమణ, యువజన అధ్యక్షులు వేముల నరేష్, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, దుబ్బాకలో రాము, నేరెళ్ల లాలయ్య, బాణావతి భీముడు, రుంజ శ్రీను, రామ్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సానుభూతిపరురాలు మృతి...



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌కు చెందిన సిపిఐ సానుభూతి పరురాలు ఆడెపు చిట్టెమ్మ(74) అనారోగ్యంతో శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. మృతురాలికి ఒక కుమారుడు, కూమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, వెంపటి రాము, ఏఐవైఎఫ్ యువజన సంఘం సభ్యులు మిరియాల నరుణ్‌తేజ్, అక్కినపల్లి దేవయ్య, రెబ్బగొండ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# సైన్స్

## శక్తివంతమైన నూతన వాహనం



'ఇస్రో నాసా' సంయుక్త మిషన్‌గా పేర్కొంటున్నారు. అయితే, నాసాతోపాటు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఇఎస్ఎ)తో కూడా ఇస్రో భాగస్వామ్యాన్ని కొనసాగించనుంది. డీప్ స్పేస్ నెట్‌వర్క్ కమ్యూనికేషన్‌లో సహకారం.. పరికరాల అభివృద్ధిలో భాగస్వామ్యం వంటి

చంద్రయాన్ 5 మిషన్ కోసం జిఎస్ఎల్‌వి ఎంకె III లేదా దీని కోసమే ప్రత్యేకంగా నిర్మించబోయే అత్యంత శక్తివంతమైన ప్రయోగ వాహనాన్ని వాడే అవకాశం ఉంది. అప్పుడే అధిక బరువు కలిగిన పరికరాలను మోసుకెళ్లడం సాధ్యమవుతుంది. చంద్రుడిపై ల్యాండింగ్, నమూనాలు సేకరణ, తిరిగి పంపడం వంటి ప్రక్రియల కోసం ల్యాండర్, రోవర్‌తోపాటు రిటర్న్ క్యాప్సుల్‌ను కూడా ప్రత్యేకంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. చంద్రుని దూర ప్రాంతాలతో భూమి మధ్య అనుసంధానాన్ని మెరుగుపరిచే అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలను ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందిస్తారు. పరికరాల మార్పిడి, సమాచార పంపిణీ వంటి అంశాలపై నాసా సహకారాన్ని ఇస్రో తీసుకుంటుంది. ఈ కారణంగానే చంద్రయాన్ 5న అంశాల్లో ఇఎస్ఎ సహకారం తీసుకుంటుంది. జపాన్‌కు చెందిన జెఎఎక్స్ఎ నుంచి డ్రిల్లింగ్ టెక్నాలజీ, రిటర్న్ మిషన్ టెక్నాలజీ, రొస్కోమొస్ (రష్యా)తో శాంపిల్ రిటర్న్ క్యాప్సుల్ తయారీ వంటి విభాగాల్లో ఇస్రో కలిసి పని చేస్తుంది.

# ఆసక్తి రేపుతున్న 'చంద్రయాన్- 5'

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దేశ పౌరుల ఆశయాలకు అద్దం పట్టే విధంగా చంద్ర మిషన్లలో అద్భుత విజయాలు సాధిస్తూ వస్తోంది. చంద్రయాన్1 నుండి చంద్రయాన్3 వరకు జరిగిన ప్రయోగాలు భారత అంతరిక్ష రంగాన్ని మానవాళి ముందు మరింత భద్రమైన స్థానానికి చేర్చాయి. ప్రస్తుతం ఇస్రో చంద్రయాన్4, 5 వంటి తదుపరి మిషన్లపై ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఈ క్రమంలో చంద్రయాన్ 5 అనే మిషన్ భారత అంతరిక్ష యాత్రలో అత్యంత ఆశాజనకమైన, కీలకమైన ఘట్టంగా పేర్కొంటున్నారు. చంద్రయాన్ 1 (2008) అనేది చంద్రుడిపై నీటి ఆనవాళ్లను గుర్తించిన మొదటి భారతీయ మిషన్. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' సహకారంతో 'మూన్.. మినరాలజీ.. మ్యాపర్' (ఎం3) ప్రయోగాన్ని నిర్వహించింది. 2019లో చేపట్టిన చంద్రయాన్ 2 ఆర్బిటర్ విజయవంతంగా పనిచేస్తున్నా, ల్యాండర్ విఫలమైంది. ఈ ఉపగ్రహం చంద్రుడి పైభాగాన్ని నిఘా చేస్తూ విలువైన సమాచారం అందిస్తోంది. 2023లో ఇస్రో చేపట్టిన చంద్రయాన్ 3 విజయవంతమైన సాఫ్ట్ ల్యాండింగ్‌తో చరిత్ర సృష్టించింది. ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రగ్యాన్ చంద్రుడిపై అనేక పరిశోధనలు చేపట్టాయి. ఈ ప్రణాళికలతో చంద్రయాన్5పై అంచనాలు అధికంగా పెరిగాయి. ఈ మిషన్ ద్వారా చంద్రుడిపై మట్టి, రాళ్ల నమూనాలను సేకరించి భూమికి తీసుకురావాలనే లక్ష్యం ఇస్రో ముందుంచినట్లు తెలుస్తోంది. అదే జరిగితే, ఇది భారతదేశపు తొలి 'శాంపిల్ రిటర్న్ మిషన్' అవుతుంది. చంద్రుడి ఉపరితలంలోని లోతైన పొరల్లో ఉండే ఖనిజాలు, నీటి నిల్వలను గుర్తించడం ఈ మిషన్ లక్ష్యం. అదే విధంగా చంద్రుడిపై భూకంపాలు, భౌగోళిక చలనాలు ఎలా వుంటాయో తెలుసుకోవడం కూడా కీలకమే. ఇస్రో ప్రణాళికలో గగన్‌యాన్ (మానవ అంతరిక్ష యాత్ర) మిషన్ ఉన్నందున, చంద్రుడిపై మానవులు వెళ్లేందుకు అవసరమైన సమాచారాన్ని చంద్రయాన్ 5 అందిస్తుందని అంచనా. చంద్రుడిపై ఉన్న కఠినమైన వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసి, భవి ష్య మానవ వాసస్థలాల భద్రతను అంచనా వేయడం. ఈ మిషన్ కోసం కొన్ని శాస్త్రీయ పరికరాలను సిద్ధం చేసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో ముఖ్యమైనది 'లూనార్ డ్రిల్ మెషిన్' ఇది చంద్రుడి లోతుల్లో నుండి మట్టిని సేకరించే బోర్లింగ్ పరికరం. ఉష్ణోగ్రత మార్పుల అధ్యయనం కోసం 'థర్మల్ ఇమేజర్'ను తయారు చేస్తారు. చంద్రుడి రసాయనిక సమ్మేళనాలను గుర్తించేందుకు ఎక్స్‌రే, ఐఆర్ స్పెక్ట్రమీ మీటర్లను అభివృద్ధి చేయనున్నారు. భూకంపాల మాదిరిగా చంద్రునిపై ఏమైనా ప్రకంపనలు ఉంటే గుర్తించేందుకు



వీలుగా స్మిస్మోగ్రాఫ్ పరికరాన్ని సిద్ధం చేస్తారు. సేకరించిన నమూనాలను భూమికి తీసుకురావడానికి ప్రత్యేకంగా రూపొందించి 'రిటర్న్ క్యాప్సుల్' ఉంటుంది. చంద్రమండలానికి మనిషిని పంపే ప్రయత్నం చేస్తున్న ఇస్రోకు, చంద్రయాన్ 5 ఫలితాలు కీలకమని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందుకే ఈ మిషన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## లక్ష్యాలు.. సవాళ్లు

చంద్రుడిపై మొదటి భారతీయ నమూనా తిరిగి రప్పించాలన్నది ఇస్రో లక్ష్యం. ఇది భవిష్య మానవ మిషన్లకు దారి చూపే పరిజ్ఞానంగా ఉపయోగపడాలని కోరుకుంటున్నది. అంతేగాక, ప్రపంచంలోని ఇతర చంద్రయాన్ మిషన్లకు పోటీగా నిలబడాలన్నది ఇస్రో ధ్యేయం. అయితే, లక్ష్యాలకు తగినట్టుగానే సవాళ్లు కూడా అనేకం ఉన్నాయి. చంద్రుడి పైనుంచి నమూనాలు సేకరించడం అంత తేలిక కాదు. భద్రంగా తిరిగి భూమికి తీసుకురావడంలో సాంకేతిక ప్రతిబంధకాలు ఉత్పన్నమవుతాయి. కమ్యూనికేషన్ లోపాలు తలెత్తవచ్చు. ల్యాండింగ్‌లో ఖచ్చితత అత్యవసరం. అదే విధంగా బడ్జెట్ పరిమితులు తప్పకపోవచ్చు. ఈ మిషన్‌కు అనుకున్నంత బడ్జెట్ ఉంటుందా? అనేది ప్రశ్న. ఇలాంటి సవాళ్లను అధిగమించి, ఇస్రో తన లక్ష్యాలను చేరుకోవాలని ఆశిద్దాం.



## ప్రయోగం ఎప్పుడు?

చంద్రయాన్ 5 ప్రయోగం ఎప్పుడనేది ఇంకా నిర్ధారణ కాలేదు. ఇస్రో ఇప్పుడు చంద్రయాన్ 4కు ఇస్రో సమాయత్తమవుతున్నది. ఇది ఈఏడాది చివరిలో లేదా 2026 ప్రారంభంలో జరిగే అవకాశం ఉంది. అనంతరం చంద్రయాన్ 5 ఉంటుంది. అంటే ఈ మిషన్‌ను 2027 లేదా 2028లో నిర్వహిస్తారు. ముందస్తు పరిశోధనలు, నమూనాల తయారీ, అంతర్జాతీయ సహకారాన్ని దృష్టిలో ఉంచుకుంటే దీని ప్రయోగానికి కనీసం 2-3 సంవత్సరాల సమయం అవసరం. ఇస్రోకు దాదాపుగా ఈ అనుభవం ఉంది కాబట్టి, చంద్రయాన్ 5కి రంగం సిద్ధం చేసుకుంటున్నది.

# అగ్నిపర్వత గాజు 'అబ్సిడియన్'



చాలా మంది అబ్సిడియన్‌ను వజ్రంగా లేదా వైఢూర్యంగా భ్రమపడతారు. కానీ, ఇది నిజానికి అగ్నిపర్వతం గాజు. సహజసిద్ధంగా తయారైన వొల్కానిక్ గ్లాస్. మాగ్మా వేగంగా చల్లబడినప్పుడు ఇది నలుపు, బూడిద రంగు, ఎర్రటి నలుపు, కొన్నిసార్లు గ్రీన్ షేడ్స్ తదితర రంగుల్లో ఉంటుంది. పాలిష్ చేసినట్టు నిగనిగలాడుతూ, అద్దంలా మెరుస్తుంది. దీనికి పదును చాలా ఎక్కువ. గాజు మాదిరిగానే చర్మం లోతుల్లోకి కోసుకుపోతుంది. ఏర్పడుతుంది. పురాతన కాలంలో ఆయుధాలు, కోసే పనికిరిగే సాధనాలు తయారీలో అబ్సిడియన్‌ను ఉపయోగించే వారు. పదును ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఆధునిక శస్త్రచికిత్సలో నిపుణులు కొన్ని సర్జికల్ బ్లేడ్‌లలో దీనిని ఉపయోగిస్తున్నారు. అదే విధంగా ఆభరణాల తయారీలో, జియాలజికల్ అధ్యయనాలలో కూడా అబ్సిడియన్ ఉపయోగపడుతున్నది.

# కృత్రిమ రక్తం సాధ్యమే.. కానీ...

జంతుజాలం జీవించడానికి అత్యంత కీలకమైన రక్తాన్ని కృత్రిమంగా సృష్టించాలనే ఆలోచన ఈనాటిది కాదు. దీనిపై కొన్ని దశాబ్దాలుగా ప్రయోగాలు జరుగుతున్నాయి. తాజా పరిశీలనలు కృత్రి రక్తం సిద్ధం చేయడం సాధ్యమేనని అంటున్నాయి. అయితే, ఇది పూర్తిగా సహజ రక్తాన్ని ప్రత్యామ్నాయంగా మార్చే స్థాయికి ఇంకా రాలేదు. అయినప్పటికీ, అత్యవసర పరిస్థితుల్లో లేదా రక్తదానం అందుబాటులో లేనప్పుడు ఉపయోగించే కృత్రిమ రక్తానికి సంబంధించి పరిశోధనలు పురోగతిలో ఉన్నాయి. ఆక్సిజన్‌ను శరీరంలోని కణాలకు రవాణా చేయడం. శరీరంలోని కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించడం, రక్తం లేని పరిస్థితుల్లో తాత్కాలిక పరిష్కారం అందించడం అనేవి కృత్రిమ రక్తం లక్ష్యాలు. కృత్రిమ రక్తాల్లో రెండు ప్రధాన నమూనాలు ఉన్నాయి. మొదటిని హిమోగ్లోబిన్ ఆధారిత ఆక్సీజన్ క్యారియర్స్ (హెచ్‌బిఒసి). ఈ విధానంలో, శరీరంలో ఉండే హిమోగ్లోబిన్‌ను తీసుకొని సాంకేతికంగా మారుస్తారు. ఈ రక్తాన్ని వెంటనే ఉపయోగించవచ్చు. రక్త సమూహంతో ఎలాంటి సంబంధం లేదు. అం, ఏ నమూనా రక్తానికైనా ప్రత్యామ్నాయంగా దీనిని వాడువచ్చు. అయితే, కొంత



మేర టాక్సిక్ కావడం, ఎఫెక్టివ్ కాలం తక్కువగా ఉండటం అనే సమస్యలు ఎదుర్కొంటున్నది. కాగా, కృతిమ రక్తంలో రెండవది పర్ఫ్లూరోకార్బన్ ఆధారిత ఎమ్యూల్షన్స్ (పిఎఫ్‌సి). ఇది ఆక్సిజన్‌ను కరగదలచే ద్రవ రూపంలో ఉండే రసాయనాలు.చిన్న పరిమాణంలో ఎక్కువ ఆక్సిజన్ మోసుకెళ్లగలగడం దీని ప్రత్యేకత. కాగా, శరీరానికి కొంతవరకూ అనుకూలత లోపించవచ్చు. మొత్తం మీద కొన్ని కృత్రిమ రక్త ఉత్పత్తులు క్లినికల్ ట్రయల్స్‌లో ఉన్నాయి. సైనిక అవసరాలు, అత్యవసర కిట్లు, రక్తం డొనర్ లభ్యత లేని చోట్ల ఈ కృత్రిమ రక్త ప్రయోగాలు చేస్తున్నారు.

## 'ఆపరేషన్ కగార్' నిలిపివేసి శాంతి చర్చలకు పిలవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులను శాంతిచర్చలకు పిలవాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కేంద్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో రోజురోజుకూ ప్రజల్లో వామపక్ష భావాజాలంపై వస్తున్న ఆదరణతో ఎప్పటికైనా మతతత్వ పార్టీ బిజెపికి ముప్పనే కుట్రతోనే మావోయిస్టులతో చర్చలు జరపకుండా ఆపరేషన్ కగార్ పేరుతో దాడులు చేసి ఎన్‌కౌంటర్లకు పూనుకుంటున్నారని ఆయన విమర్శించారు. తక్షణమే మావోయిస్టులపై మిలిటరీ దాడులు ఆపి మూడు దఫాలుగా వారు కోరుతునక్నట్లుగా శాంతి చర్చలకు పిలవాలని ఆయ న పేర్కొన్నారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడపాలనే కుట్రతోనే కేంద్రలోని బిజెపి ప్రభుత్వం ఆధునిక ఆయుధాలతో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు అగ్రనాయకులను టార్గెట్ చేసి హతమార్చడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మావోయిస్టులు లొంగిపోతే రివార్డులు ప్రకటిస్తామని చెప్పుతున్న కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులు ఆయుధాలను ప్రక్కన పెట్టి శాంతి చర్చలకు తాము సిద్ధమేనని చెప్పారంటే వారు లొంగిపోయినట్లు కాదా అని ఆయన ప్రశ్నించారు. మావోయిస్టుల పంథా దేశంలో శాంతి భద్రత ల సమస్య ఏమాత్రం కాదని, దాన్ని సామాజిక ఆర్థిక అంశంగా పరిగణించాలని, మావోయిస్టులు ప్రకటించిన విధంగా శాంతి చర్చలు జరిపేందుకు కేంద్రం ఆహ్వానించాలని విజయసారథి డిమాండ్ చేశారు. వామపక్ష భావాజాలాన్ని అణిచివేయాలని చూస్తే బిజెపి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెపుతారని ఆయన హెచ్చరించారు.

## నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. శుక్రవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ పాల్గొని మాట్లాడారు. భారత స్వాతంత్రానికి ముందు, తర్వాత పోరాడి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను యదావిధిగా కొనసాగిస్తూ 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. 2016లో సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనంగా రూ.32 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సర్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటిసి అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షకార్యదర్శులు మున్సిపల్ యూనియన్ మంతెన కాంతారావు, మెరుగు చిరంజీవి, కోశాధికారి సురేష్, జిల్లా నాయకులు అశోక్, లక్ష్మి, శాంత, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి ముజీబ్, రిమ్స్ బ్రాంచ్ కార్యదర్శి ఎండి ఖాసీం, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సలీం, కోశాధికారి జమీల్, నాయకుడు మోసిన్‌లు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే కూనంనేని ● రూ.2.62 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా సంక్షేమం, గ్రామాలాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పాల్వంచ మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయితీల్లో రూ.2.62 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరి దరకి చేర్చడమే తమ లక్ష్యమన్నారు. సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పాటుపడుతన్నటు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో, బస్తీల్లో పక్కా రహదార్లు, డ్రైనేజీలు నిర్మిణాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వివిధ పథకాలు గ్రాంట్లు ద్వారా ఇప్పటికే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, మరికొన్ని పనులకు సంబంధించి నిధుల మంజూరీ కోసం ప్రతిపానలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, పేదలకు న్యాయం జరిగేలా అధికారులు ముందువరుసలో నిలవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఓ విజయ భాస్కర్‌రెడ్డి, పిఆర్ డిఇ రామకృష్ణ, ఇరిగేషన్ డిఇ రాణి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, టిడిపి రాష్ట్ర నాయకులు కనగాల అనంత రాములు, సిపిఐ నాయకులు వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, నాగరాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకన్న, వీరమోహన్రావు, గిరి, రాంబాబు,వెంకట్రావు, జకరయ్య, అప్పారావు, రింజిత్, మధు, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు స్టాలిన్ ధ్వజం



**ప్రజాపక్షం/హనుమకొండ:** సకల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న విద్యారంగాన్ని కాపాడలేక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ స్టాలిన్ విమర్శించారు. శుక్రవారం బాలసముద్రంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప భుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని దు య్యబట్టారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్రలను అమలు చేస్తున్నారని దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం2020 పేరుతో విద్యా కార్పొరేటీకరణ, విద్యాకేంద్రీకరణ, కాషాయికరణ చేయాలని చూస్తుందని, విద్యారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్ర ప్రభు త్వం స్వాగతం పలుకుతోందని, పాలకులు ప్రపంచ బ్యాంక్ సలహాలపై ఆధారపడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం అనే పద్ధతిలో విద్యావ్యాపారానికి పచ్చ జెండా ఊపయాని అన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పాలక వర్గాలకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని, ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభు త్వం తీసుకున్న నిర్ణయం వల్ల 11 జిల్లాల్లో దాదాపు వందలాది మంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరం అవుతున్నారని, కళాశాలలను మూసివేయ డం కన్నా కళాశాలలను అభివృద్ధి చేసి నిధులు కేటాయించి మరింత బలోపేతం చేయాలని, గురుకుల కళాశాలలో సరైన వసతు లు కల్పించి నాణ్యమైన ఆ హార భోజనాన్ని అందిస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని అన్నారు.ఈ విలేకరుల సమావేశం లో ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యద ర్శి ఉట్కూరి ప్రణీత్ గౌడ్, భాషబోయిన సంతోష్, రా ష్ట్ర నాయకులు జేరిపోతుల జనార్ధన్, దిడ్డి పార్థసారథి, చైతన్య, సాగర్‌తదితరులు పాల్గొన్నారు.

## 26,27 తేదీలలో హనుమకొండ జిల్లా సిపిఐ మహాసభలు



మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి వెల్లడి

**ప్రజాపక్షం/ హసన్ పర్తి :** దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీరోచిత పోరాట చరిత్ర కలిగిన శ్రమజీవుల కార్మిక, రైతు కూలీల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి తెలిపారు. ఈనెల 26,27 తేదీలలో హనుమకొండ జిల్లా సిపిఐ రెండవ మహాసభలు హసన్ పర్తి మండల కేంద్రంలో జరగబోతున్నాయని, 26 వ తేదీన జరిగే ప్రజా ప్రదర్శన బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున హసన్‌పర్తి మండలం పెగడపల్లి గ్రామంలో రాకేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా నేదునూరి జ్యోతి హాజరై మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతుందని ధ్వజమెత్తారు. గుత్తా కోటీశ్వరులకు రైట్ ఆఫ్‌లోన్స్ పేరుతో 16 లక్షల 35 వేల కోట్లు రద్దు చేయడాన్ని ఆక్షేపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతు పెట్టినటువంటి పెట్టుబడికి రెట్టింపు ఖర్చు ఇచ్చినప్పుడే మద్దతు ధర లభిస్తుందని దానికి కేవలం 119 లక్షల కోట్లు మాత్రమే ఖర్చవుతుందని, దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసిన లేనియెడల రైతు ఆత్మహత్యల పాలై ఆహార కొరత ముప్పు కలుగుతుందని తెలిపారు. అనంతరం సిపిఐ సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి మాట్లాడుతూ హసన్ పర్తి శాసన సభ నియోజకవర్గంగా ప్రకటించాలని, హసన్ పర్తిలో వంద పడకల ప్రాంతీయ వైద్యశాల ను ఏర్పాటు చేయాలని డిగ్రీ కళాశాలను పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు నేదునూరి రాజమౌళి, వంగపాడు గ్రామ శాఖ కార్యదర్శి దోమ రాకేష్, సహాయ కార్యదర్శులు దోమ మధున, మంద జ్యోతి, దాసు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాలే ఊపిరిగా సిపిఐ ప్రస్థానం

సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట మండలం 18వ మహాసభ చిన్నకందుకూర్ గ్రా మంలో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభ కు అధ్యక్ష వర్గంగా సిపిఐ మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మహిళా సమాఖ్య మండల ప్రధాన కార్యదర్శి ఆరే పుష్ప వ్య వహరించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా గత వంద సంవత్సరాల నుండి సిపిఐ ప్రయాణిస్తుందని అన్నారు. ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా ప్రజా సమస్యల ఏజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవారికి భూమి కావాలని శ్రమ దోపిడికి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ అని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదుదారులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరిచే విధంగా ఉన్నాయని, పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలి అన్నారు. కేం ద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని ఈ పేరుతో చంపడం సరైనది కాదానీ మావోయిస్టులను చర్చలు ఆహ్వానించి సానుకూలంగా పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణ మే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, సిపిఐ జిల్లా రైతు సం ఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి రాజయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటే ష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ మెంబర్ పేరబొయిన పెంటయ్య, ప్రజా నాట్యమండలి గాయకురాలు హింజ హేమలత తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## రామగుండంలో విద్యుత్తు ప్లాంటు

ప్రజాపక్షం/రామగుండం : రామగుండం పట్టణంలో 800 మెగావాట్ల విద్యుత్తు ప్లాంటును నెలకొల్పాలని జెన్‌కో ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌ను కోరినట్లు రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ తెలిపారు. శుక్రవారం విద్యుత్తుసౌధలో సీఅండ్ఎండిని కలిసి విద్యుత్తు ప్లాంటు ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అన్ని కోణాల్లో చర్చించినట్లు తెలిపారు. విద్యుత్తు ప్లాంటు నెలకొల్పడం ద్వారా రాష్ట్ర విద్యుత్తు అవసరాలను తీర్చడమే కాకుండా స్థానికంగా అభివృద్ధి జరుగుతుందని చెప్పినట్లు తెలిపారు. అదేవిధంగా జెన్‌కో నూతన సీఅండ్ఎండీగా బాధ్యతలు చేపట్టిన హరీష్‌ను కలిసి ఆయనకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.



## పోటీతత్వం ఉండేలా బోధన ఉండాలి



ప్రజాపక్షం/కొండపాక: ఆధునిక సాంకేతిక అభివృద్ధి చెందుతున్నట్లుగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా పాఠశాలల్లో బోధన సాగాలని ఉపాధ్యాయుల శిక్షణ జిల్లా పరిశీలకులు పివి సత్యకుమార్, బాలాభాస్కర్ అన్నారు. కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలను సమాజానికి తెలపాలన్నారు. ఈ సంవత్సరంలో పాఠశాలల పటిష్ఠతకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. పాఠశాలల్లో డిజిటల్ ఏఐ బోధన అందివ్వనున్నదన్నారు. పిల్లల్లో పోటీతత్వం అర్ధమయ్యేలా కార్యక్రమాలు ఉండాలన్నారు. సృజనాత్మకతను పెంపొందించాలన్నారు. ఎంఈఓ బచ్చలి సత్తయ్య, రిసోర్స్ పర్సన్‌లు శ్రీనివాస్, రాంప్రసాద్, రాంచంద్రం అశోక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికీ మందులు ఇవ్వాల్సిందే



ప్రజాపక్షం/గోదావరిఖని : గోదావరిఖని పట్టణంలోని సింగరేణి ఏరియా ఆస్పత్రిని ఆర్‌జి1 జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మందుల నిల్వలు, రోగులకు అందిస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులను స్థానికంగా కొనుగోలు చేసి అందించాలన్నారు. ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా మందులు అందేలా చూడాలన్నారు. మెడికల్ స్టోర్‌కు వెళ్లి మందుల నిల్వల స్థాయిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆస్పత్రిలోని క్యాజువాలిటి వార్డును సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. జీఎంతోపాటు డివై జీఎంవో డాక్టర్ అంబిక, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## హిందూ ఏక్తాయాత్ర విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

### బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః హనుమాన్ జయంతి సంధర్భంగా కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్ ఆద్వర్యంలో నిర్వహించిన 'హిందూ ఏక్తాయాత్ర' ను విజయవంతం చేసిన హిందూబంధువులు, బిజెపి నాయకులు, కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్‌లో 12 సంవత్సరాల క్రితం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆద్వర్యంలో ప్రారంభమైన హిందూ ఏక్తా యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో గుర్తింపు, ప్రాధాన్యత వచ్చిందని తెలిపారు. ప్రతి ఏటా హనుమాన్ జయంతి రోజున కరీంనగర్ పట్టణంలో అత్యంత వైభవంగా హిందూ ఏక్తాయాత్ర నేడు హిందువుల సంఘటిత శక్తికి దిక్సూచిగా మారిందని పేర్కొన్నారు. 22న హనుమాన్ జయంతి రోజున హిందూ ఏక్తాయాత్ర ఎంతో వైభవంగా జరిగిందని, వర్షాన్ని లెక్కచేయకుండా అశేష సంఖ్యలో తరలివచ్చిన హిందూ బంధువుల రాకతో ఏక్తా యాత్ర గ్రాండ్ సక్సెస్ అయ్యిందన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజలు, హిందూ ధర్మం గురించి ఆలోచించే సమాజం, యువత స్వచ్ఛందంగా యాత్రలో పాల్గొన్నారని, వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. యాత్ర విజయవంతం కోసం కృషి చేసిన బిజెపి నాయకులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు కరీంనగర్‌లో 'తానాకాన్' సదస్సు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః తానాకాన్ 2025 డాక్టర్ల సదస్సు ఈ నెల 24, 25 తేదీలలో స్థానిక ప్రతిమ హోటల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సులో సమకాలీన అంశాలపై నిష్ణాతులైన వైద్య నిపుణులచే అవగాహన సదస్సులు నిర్వహించబడుతాయని పేర్కొన్నారు. చిన్న, మధ్య స్థాయి హాస్పిటల్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చతో పాటు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి 33 జిల్లాల నుంచి సుమారు 800 మంది డాక్టర్లు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, వారంతా ఈ కార్యక్రమానికి హాజరై సమకాలీన వైద్య విద్య అవగాహనలో పాల్గొంటారని నిర్వాహకులు తెలియజేశారు.

## సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యం

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ప్రజాపక్షం/వీర్నపల్లి: పేద ప్రజల స్వంత ఇంటి కళ నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అని, వచ్చే దసరా, దీపావళి పండుగలు నూతన గృహములలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రెండవ విడత క్రింద 259 ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ విడత క్రింద లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరింగిదని, ఇట్టి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం జరిగితే 4 దశల్లో గ్రీన చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయలు, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తర్వాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తరువాత మరో లక్ష రుపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటివి చేయాల్సిన అవసరం లేదని, ఏవరైన డుబ్బులు అడిగితే స్వయంగా ఫోన్ చేయవలసిందిగా స్పష్టం చేశారు. పిడి హౌసింగ్‌అధికారి శంకర్ , మండల ప్రత్యేక అధికారి రామదాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భూత శ్రీనివాస్, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులున్నారు.

# నిబంధనలు అతిక్రమించొద్దు



### ఫర్టిలైజర్ వ్యాపారులకు వార్నింగ్
### కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: ఫర్టిలైజర్ వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్డు మార్గంలో పలు ఎరువుల దుకాణాలు, గోదాములను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి విత్తనాల నిల్వ, అమ్మకాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడారు. ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ మిషన్ ద్వారా మాత్రమే విక్రయించాలని డీలర్లకు సూచించారు. బ్లాక్ మార్కెటింగ్ ఆశ్రయించరాదని, అన్ని ఎరువులు, విత్తనాలను గరిష్ట చిల్లర ధర ప్రకారమే విక్రయించాలని ఆదేశించారు. అవసరాన్ని బట్టి ఎరువుల నిల్వ చేసుకోవాలని సూచించారు. దుకాణంలో ఉన్న ఎరువులు, విత్తనాల ధరలతో బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రైతులు ఎరువులు కొనేందుకు ఆధార్ వెంట తెచ్చుకోవాలని, పంట చేతికి వచ్చే వరకు రసీదును భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఏడిఏ జి.రణధీర్ కుమార్, కరీంనగర్ అర్బన్ ఏవో ఎం.శరిత తదితరులున్నారు.



### ప్రాథమిక విద్యే పునాది

పారమిత హెరిటేజ్ స్కూల్ కేంద్రంగా జరుగుతున్న గంగాధర మండల ప్రాథమిక ఉపాధ్యాయుల 5 రోజుల వృత్యంతర శిక్షణలో నాలుగవ రోజు కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఉపాధ్యాయులందరూ శిక్షణలో నేర్చుకున్న అంశాలన్నింటినీ పాఠశాలలో అమలుపరచాలని, తద్వారా నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల అభివృద్ధి జరిగిందనే విషయాన్ని తల్లిదండ్రులకు చేరవేయాలని సూచించారు. ప్రాథమిక విద్య దేశ భవిష్యత్తుకు పునాది అని, ఈ గురుతర బాధ్యతను గుర్తించి ఉపాధ్యాయులందరూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరంలో మన జిల్లా ప్రాథమిక పాఠశాలలలో వినూత్నమైన మార్పులకు శ్రీకారం చుట్టాలని, దానికి ఉపాధ్యాయులందరూ సహకరించాలని కోరారు. అదే విధంగా ప్రాథమిక స్థాయి శిక్షణా షెడ్యూలు ఆవిష్కరించారు. జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ కర అశోక్ రెడ్డి, కోర్స్ డైరెక్టర్ ఎంఈవో గంగాధర ఏనుగు ప్రభాకర్ రావు, పారమిత హెరిటేజ్ డైరెక్టర్ హనుమంతరావు, జిల్లా పరిశీలకులు జి.విశ్రీనివాస్, సంపత్, మండల రిసోర్స్ పర్సన్స్ శ్రీను రాధిక, ప్రశాంత్, శ్యాంకుమార్, మధు చంద్ర, చెన్నారెడ్డి, అనిల్‌కుమార్, ఉపాధ్యాయులున్నారు.

### చొప్పదండి పిహెచ్‌సి పరిశీలన

చొప్పదండిః కరీంనగర్ జిల్లా చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. పిహెచ్‌సిలోని అవుట్ పేషెంట్ విభాగం, లేబరేటరీ, లేబర్ రూం, ఫార్మసీ స్టోర్స్‌లో మందుల నిల్వలను పరిశీలించారు. 13 సంవత్సరాల పైబడిన మహిళలందరికీ 100 శాతం స్క్రీనింగ్ అయ్యేటట్లుగా పూర్తి చేయమన్నారు. ఈ హెల్త్ స్క్రీనింగ్‌లో నాణ్యత పెంచాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సాజిదా, చొప్పదండి వైద్యాధికారి శ్రీకీర్తన, సిబ్బంది పాల్గొన్నారు.



## నంబాల ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు




ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :కేంద్ర ప్రభుత్వం మావోయిస్తుల నిర్మూళన లక్ష్యంగా రాజ్యాంగ విరుద్ధంగా చేపడుతున్న ఆపరేషన్ కగార్, కర్రెగుట్టల ఆపరేషన్ తక్షణమే ఆపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్ లోవివిధ రాజకీయపార్టీలు, విద్యార్థి ,ప్రజాసంఘాలతో రౌండ్ టెబుల్‌సమావేశం నిర్వహించారు. ఈసమావేశానకి పౌరహక్కల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగుల భూపతి అధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మందపవన్ మాట్లాడుతూ మావోయిస్తు కేంద్ర ప్రధానకార్యదర్శి నాంబాల కేశవ రావు మృతిపై అనేక అనుమానాలున్నాయన్నారుస. ఆయన మరణంపై తక్షణమే సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శత్రుదేశమైన పాకిస్తాన్‌తో చర్చలు జరిపే ప్రధాని మోదీ దేశ ప్రజల పక్షాన సూదీర్ఘకాలంగా అనేక త్యాగాలను ఓర్చి ఉద్యమిస్తున్న మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరిపేందుకు ఎందుకు ముందుకు రావటం లేదో తెలుపాలన్నారు. దేశంలో మావోయిస్తుల నిర్మూలన పేరిట భాజాప ఫ్రభుత్వం అడవుల్లో వందలాది అమాయకులు, ఆదివాసీలు చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడవుల్లో సహజసిద్దమైన వనరులు అంబాని, అదాని లాంటి పెట్టుబడిదారులకు అప్పచెప్పటం కోసం అడ్డుగా ఉన్న మావోయిస్టు కేంద్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. దేశ సరిహద్దులో ఉండే మిలిటరీ, పోలీసు బలగాలను అడవుల్లోకి పంపి మారణహోమానికి పాల్పడుతున్నారన్నారు. నిరాయిదులుగా పోలీసులకు దొరికిన మావోయిస్తులను అనేక చి త్ర హింసలకు గురిచేసి ఉద్దేశపూర్వకంగా ఏకపక్షంగా చంపి ఎన్‌కౌంటర్ అని కట్టుకథ అల్లుతున్నారన్నారు. తక్ష ణమే ఆపరేషన్ కగార్ , కర్రెగుట్టలు నిలిపిదల చేసి మావోయిస్టులతో శాంతిచర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. వివిధరాజకీయ,ప్రజాసంఘానేతలు శశిదర్,విజయ్ కుమార్, సత్తయ్య, పోచపోయిన శ్రీహరి, సత్యనారాయణ, రంగాచారి, లక్ష్మ ణ్, గోపాలస్వామి, జనార్ధన్, అభిషేక్, రవి పాల్గొన్నారు.

## పనుల్లో జాప్యం చేస్తే కఠిన చర్యలు

### మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం / హుస్నాబాద్ : గురువారం రాత్రి కురిసిన భారీ వర్షనికి పట్టణం మొత్తం జలమయయైయి పలు దుకాణాల్లో నీళ్లు ప్రవేశించి దుకాణదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఉదయమే మున్సిపల్ కమిషనర్, సిబ్బంది , ఇంజీరింగ్ అధికారులు, రహదారి గుత్తెదారులతో కలిసి పలు దుకాణలను మురికి నీటితో నష్టం కలిగిన షాపులను పలు లోతట్టు ప్రదేశాలను మంత్రి పొన్నం ప్రభకర్‌గౌడు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్కతుర్తి నుండి సిద్ధిపేట జాతీయ రహదారి పనుల్లో జాప్యం వల్ల నష్టం జరుగుతుందని పనుల వేగం పెంచాలని దీనికి పట్టణ వాసులు అందరు సహకరించాలని కోరారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల డ్రైనేజీలు అనుసందానం కాక పోవడం వల్ల గత నాలాలు ముసుకుపోయి ఇళ్లలోకి నీళ్లు ప్రవేశించాయని అన్నారు. శుక్రవారమే సాయంత్రం వరకు మళ్లి వర్షం వస్తే నీళ్లు ఎక్కడ అగకుండ పనుల చేయాలని అధికారులను కోరారు. పట్టణంలోని ఎప్పుడు వర్షం పడ్డ మున్సిపల్ సిబ్బంది నాళాల వద్ద అందుబాటులో ఉండాలని అదేశించారు. రహదారి పనులు ఎల్కతుర్తి నుండి సిద్ధపేట వరకు ఎక్కడ కూడ పనుల అగకుండ జిల్లా కలెక్టర్, అర్డివో, ఇంజనీరింగ్ అధికారులు అందరు క లిసి పనుల జాప్యం లేకుండ చూడలని కోరారు. పనుల్లో అశ్రద్ధ చేస్తే కంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు. పట్టణంలోగాని ఎక్కడ గాని ఓపెన్ ప్లాట్లు ల్లో నీటి నిల్వలు లేకుండ మోరం పోసుకుని గుంతలు పూడ్చాలని అన్నారు.

# నిబంధనలను పాటిస్తూ విత్తనాల విక్రయాలు

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి జిల్లాలోని రైతులకు నిబంధనలను పాటిస్తూ విత్తనాలను విక్రయించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో విత్తనాల విక్రయం లో ఈ పాస్ యంత్రాల వినియోగంపై రిటైలర్లకు నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి కరుణాకర్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేటి అవినాష్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో విత్తనాల డీలర్లు నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని, రాబోయే సీజన్ లో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో రాబోయే వానాకాలం సాగుకు అవసరం అయ్యే విత్తనాలు ఏ ప్రాంతంలో ఎంత డిమాండ్ ఉంటుందో అంచనా వేసి దానికి అనుగుణంగా అక్కడ ఆ విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వానాకాలం పంటకు అవసరమైన ఎరువులు, డీఏపి టన్నుల స్టాక్ అందుబాటులో ఉందని, డీలర్ల వద్ద ఉన్న స్టాక్ వివరాలను ఈ పాస్ యంత్రాల్లో అప్ డేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎరువుల లభ్యత పై అసత్య ప్రచారాలు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. గ్రీన్ మ్యాన్యుర్ స్టాక్ ను కూడా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని అన్నారు. రైతులకు ఎరువులు విత్తనాలు విక్రయించే సమయంలో పంట కాలాన్ని రెండు వారాల పాటు ముందుకు జరుపడం వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్లు, రిటైలర్లు మాత్రమే విక్రయించాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ క్లస్టర్ పరిధిలో ఎవరైనా అనధికారంగా విత్తనాలు విక్రయిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే సంబంధిత డీలర్ల నుంచి రైతులకు శాస్త్రీయంగా నష్టపరిహారం అంచనా వేసి చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేటి అవినాష్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు నేరుగా రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ నుంచి నాణ్యమైన విత్తనాలు అందే విధంగా కృషి చేస్తున్నామని, డీలర్లు సైతం ఈ విషయంలో పూర్తి స్థాయి సహాకారం అందించాలని అన్నారు. దిగుబడి కూడా ప్రభుత్వ రంగ సంస్థలో తయారు చేసిన విత్తనం బాగా ఉందని అన్నారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం విత్తనాల రకాలు అందుబాటులో ఉన్నాయని, పెద్దపల్లి జిల్లాలో కనీసం పది వేల క్వింటాళ్లు ప్రభుత్వ రంగ విత్తనాలు అమ్మాలని డీలర్లకు సూచించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు,తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలం చల్గల్ వ్యవసాయ మార్కెట్, కోనాపూర్, తిప్పన్నపేట గ్రామలలో శుక్రవారం రోజున తడిసిన ధాన్యాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరిశీలించారు. రైతులు అధైర్య పడవద్దు అని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయటానికి చర్యలు తీసుకున్నాం అని, తడిసిన ధాన్యం కొనుగోలు విషయం పై కలెక్టర్, అదనపు కలెక్టర్ లతో మాట్లాడడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ తడిసిన ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, రికార్డ్ స్థాయిలో 60 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయటం జరిగిందని అన్నారు. వడ్ల కొనుగోలులో హమాలీల కొరత లేకుండా, ఎక్కడ ఆలస్యం కాకుండా చూశామని అన్నారు. నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో వర్షాలు కురుస్తున్నాయని ధాన్యం తడవడంతో రైతుకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. ప్రభుత్వ పరంగా అండగా ఉంటా అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. చల్గల్ లో 1444 క్వింటాళ్ల సన్న వడ్లను కొనుగోలు చేశామని తెలిపారు. పేద సన్న కారు రైతులకు రైతు భరోసా అమలు చేయటం జరిగిందని, కొత్త రేషన్ కార్డులు కూడా మంజూరు చేయటం జరిగిందని, అకాల వర్షాలు ఉన్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. జగిత్యాల రూరల్ ఎమ్మెర్వో శ్రీనివాస్, పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మల్లారెడ్డి, మాజీ ఎఎంసి ఛైర్మెన్ దామోదర్ రావు, పెండెం రాములు, బాల ముకుందం, కోల శ్రీనివాస్, శేఖర్ గౌడ్, గంగారెడ్డి, పురిపాటి రాజిరెడ్డి, బోనగిరి నారాయణ, సిఈఓ వేణు, మల్లేష్, కొప్పుమహేష్, వెంకటేష్, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను బోధించి, విద్యార్థుల సంఖ్య పెంచాలని 2 విడత ఉపాధ్యాయ శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులకు టీచర్స్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య సూచించారు. శుక్రవారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి మోడల్ స్కూల్ లో ఆంగ్ల, ప్రధానోపాధ్యాయులు, ఎస్ జి టి ఉపాధ్యాయుల రెండో విడత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా టీచర్స్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య హాజరై మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, నాణ్యమైన విద్యను అందించే ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, నాటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలు అని, ఉపాధ్యాయులు బాధ్యతగా మెలగాలని చెప్పారు. మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య, ప్రోగ్రాం అబ్జ ర్వర్ సిహెచ్ ప్రధ్యుమ్మ కుమార్ లు టీచర్ ఎమ్మెల్సీ ని ఘనంగా శాలువాతో సన్మానించారు.

## పట్టపగలే మహిళపై అత్యాచారం

ప్రజాపక్షం/కొత్తపల్లిః కరీంనగర్ జిల్లాలో దారుణం జరిగింది. పట్టపగలు ఓ దళిత మహిళపై మద్యం సేవించిన మత్తులో యువకుడు అత్యాచారం చేశాడు. మహిళ బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా అడ్డగించి అత్యాచారం చేయడం కరీంనగర్ జిల్లాలో కలకలం రేపుతోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన మహిళ కొండాపూర్‌లోని బందువుల ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తోంది. కమాన్‌పూర్ వద్ద బస్ దిగి తన ఇంటికి కాలినడకన వెళ్తుండగా అప్పటికే మద్యం సేవించి మత్తులో ఉన్న బద్దిపల్లి గ్రామానికి చెందిన సంజీవ్ (25) అక్కడే ఉన్నాడు. మహిళ ఒంటరిగా వెళ్తున్న విషయం గమనించి ఆమెను కొద్దిదూరం ఫాలో అయ్యాడు. దారి మధ్యలో అడ్డగించి బలవంతంగా చెట్లపొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేశాడు. ఇదంతా దూరంగా ఉన్న గ్రామస్తులు గమనించి అక్కడికి చేరుకునే లోపే దళిత మహిళపై అత్యాచారం చేశాడు. స్థానికులు పూర్తిగా మద్యం మత్తులో ఉన్న సంజీవ్‌ను పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అత్యాచారానికి గురై గాయపడిన మహిళను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత మహిళ ఇటీవలే ఓ ప్రమాదంలో గాయపడి అనారోగ్యంతో ఉన్నట్లు సమాచారం, బాధితురాలు అస్వస్థతకు గురైనట్లు డాక్టర్లు చెబుతున్నారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# మూత్రపిండాల గాయానికి యశోదలో 'మ్యాజికల్ రికవరీ'!

### యశోద ఆసుపత్రి ప్రముఖ నెఫ్రాలజిస్ట్
### డా.అరుణ్‌కుమార్ పొన్న




ప్రజాపక్షం/కరీంనగర్ః నొప్పి నివారణ ఇంజక్షన్ల(పెయిన్ కిల్లర్) కారణంగా మూత్ర పిండాల గాయం నుంచి దయాలసిస్ అవసరం లేకుండానే అరుదైన మ్యాజికల్ రికవరీ చేసిన సంఘటన యశోధ హాస్పిటల్‌లో చోటు చేసుకుంది. ఈ సంధర్భంగా కరీంనగర్‌లోని యశోధ మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమాజిగూడ యశోధ ఆసుపత్రి ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డా.అరుణ్ కుమార్ పొన్న మాట్లాడారు. పెయిన్ కిల్లర్లు మూత్రపిండాలకు ప్రమాదకరంఠా ఉంటాయని, ప్రత్యేకించి సరైన మార్గదర్శకత్వం, వైద్యుడి సలహా లేకుండా తీసుకోవడం చాలా ప్రమాదకరమన్నారు. మాత్రల కంటే ఇంజక్షన్లకు వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ తీవ్రంగా ఉంటాయని పేర్కొన్నారు. సిరిసిల్లకు చెందిన 40 ఏళ్ల మహిళ నొప్పి నివారణ ఇంజక్షన్ తీసుకున్న రెండు రోజుల తర్వాత బలహీనత, వాంతులతో ఆసుపత్రికి వచ్చిందని తెలిపారు. పరీక్షలలో ఆమెకు సీరమ్ క్రియేటినిన్ 6 ఎంజి ఉన్నట్లు కనుగొనబడిందని, ఇది మూత్రపిండాలు పనిచేయకపోవడానికి సంకేతమన్నారు. పెద్ద లక్షణాలు లేనప్పటికీ తరువాతి రెండు రోజుల్లో ఆమె క్రియేటినిన్ 10 ఎంజికి తగ్గి మూత్రపిండాల వైఫల్యానికి దారి తీయబోయిందని పేర్కొన్నారు. కాగా దయాలసిస్‌కు వెళ్లకుండా ఖచ్చితమైన రోగ నిర్ధారణపై దృష్టి పెట్టి కిడ్నీ బయాప్సీ తక్షణమే నిర్వహించి సరైన నిర్వహణతో దయాలసిస్ అవసరం లేకుండానే ఆమె మూత్రపిండాల పనితీరు మెరుగుపరిచామని తెలిపారు. సకాలంలో రోగ నిర్ధారణ చికిత్స వల్ల మూత్రపిండాలను రక్షించవచ్చని తెలిపారు. నొప్పి నివారణ మందులు తీసుకున్నప్పుడు శరీరంలో ఏవైనా మార్పులు గమనిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రజలు, సాధారణ వైద్యులు ముందస్తు సంకేతాల నుంచి అప్రమత్తంగా ఉండాలని, సాదారణ నొప్పి నివారణ మందులను ఉపయోగించకుండా ఉండాలని, కిడ్నీ సమస్యలు అనుమానించినట్లయితే నిపుణుల సంరక్షణను త్వరగా తీసుకోవాలని కోరారు. అనంతరం పేషెంట్ రాధ మాట్లాడుతూ ఇంటిదగ్గర నొప్పి నివారణ ఇంజక్షన్ తీసుకున్న తర్వాత జ్వరం, వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యానని, అత్యవసర పరిస్థితిలో ఉన్న నన్ను డాక్టర్లు ధైర్యంచెప్పి సాధారణ స్థితికి తీసుకువచ్చారని కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో వైద్యులు, మెడికల్ సెంటర్ సిబ్బంది, తదితరులున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం సరికాదు
ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



**ప్రజాపక్షం/కౌటాల :** ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు రాస్తారోకో నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు వారికి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాలవర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లాలో 60వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే, ఇప్పటివరకు కేవలం 3,500 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని ఆయన విమర్శించారు.

## కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి



**ప్రజాపక్షం/కౌటాల :** కొమరం భీం జిల్లా, కౌటాల మండలం పరిధిలోని తాటిపల్లి గ్రామంలో శుక్రవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో కుంటలో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలు జారి కుంటలో పడిపోయి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే స్థానికులు స్పందించి వారిని బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కౌటాల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హృదయ విదారక ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు
ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్




**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలోని వాసవి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఉపాధ్యాయుల ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల చేతుల్లోనే భావిభారత ప్రగతి ఆధారపడి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగే విధంగా కృషి చేయాలని, అందుకు అవసరమైన బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారుతారని అందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి పి.రామారావు, మండల విద్యాధికారి ఏ.సుభాష్ రీసోర్స్ పర్సన్లు ఎం.ఎల్లన్న, ఎన్.కృష్ణ, జి.రాజేశ్వర్, ఆర్.హన్మండ్లు, ఎస్.గణేష్, టి.విఠల్‌రెడ్డి, టి.నరేశ్, ఎం.బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పాపన్నపేట శివారులో చిరుత సంచారం
భయాందోళనలో రైతులు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పాపన్నపేట గ్రామ శివారులో వెంకటేశ్వరగుట్ట ఆలయ సమీపంలో చిరుత పులి సంచరించడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రమైన పాపన్నపేట శివారులో వెంకటేశ్వరగుట్ట సమీపాన శుక్రవారం తెల్లవారుజామున చిరుత సంచరించిన ఆనవాళ్లు ఉన్నట్లు రైతులు వెల్లడించారు. అయితే గత నెల రోజుల క్రితం గుట్ట ఆవల వైపు ఉన్న దౌలాపూర్ శివారులో సైతం రెండు చిరుతలు సంచరించాయి. ఈ విషయం అప్పట్లో ఫారెస్ట్ అధికారులు సైతం ధ్రువీకరించారు. అక్కడికి ఎవరు వెళ్ళొద్దని రైతులకు సూచించిన విషయం తెలిసిందే. ఇది ఇలా ఉండగా వెంకటేశ్వర గుట్టవైపు పొలాలు సాగుచేసిన రైతులు వెళ్ళేసరికి రెండు చిరుతపులుల పాదాల ఆనవాళ్లు కనిపించినట్లు రైతులు గుర్తించారు. దీంతో పొలాల వైపు వెళ్లడానికి జంకుతున్నారు. ఒకటి తల్లి చిరుత, రెండోది పిల్ల చిరుత ఉన్నట్లు పాదముద్రలను బట్టి రైతులు వెల్లడించారు. స్థానికులు ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చిరుత పులి సంచరించిన స్థలాన్ని వారు పరిశీలించారు. చిరుత పులి కాళ్ళ ముద్రలేనన్నారు. చిరుత పులి వస్తే ఏం చేయాలో సలహాలు, సూచనలు చేశారు. చిరుత పులి బాధనుండి విముక్తి కలిగించాలని రైతులు కోరుతున్నారు.

## బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు : కలెక్టర్ అభిలాష



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** జిల్లాలో బాల్యవివాహాలను పూర్తి స్థాయిలో నియంత్రించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాల్యవివాహాల నిర్మూలను, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం, మాదక ద్రవ్యాల నిర్మూలన, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, ఇసుక అక్రమ రవాణా, మున్సిపల్ అంశాలు, రహదారి భద్రత, రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు పంపిణి తదితర అంశాలపై సంబంధిత అదికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలలో జిల్లాలో 29 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలు జరుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు తలిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరుచూ గ్రామాలను సందర్శిస్తూ మళ్ళీ వివాహం జరపకుండా చూడాలన్నారు. సంబంధిత బాలబాలికలకు మెరుగైన విద్యను అందించాలన్నారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను తనిఖీలు చేస్తూ, కేంద్రాలలో పనిచేస్తున్న వారి అర్హత పత్రాలను వైద్య శాఖ అధికారులు సరిచూడాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిపేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిర్మల్ జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి,నాటు సారా ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను గుర్తించి, కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గంజా, నిషేదిత మత్తుపదార్థాల నిషేధంపై అధికారులతో కలిసి పోస్టర్ల ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా, ఉపేంద్రరెడ్డితో పాటు జిల్లాలోని అన్నిశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు
కలెక్టర్ వెంకటేష్ దోత్రే





**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** జిల్లాలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే హెచరించారు. శుక్రవారం ఆయన కాగజ్ నగర్ పట్టణంలోని హిమాన్షు ట్రేడర్, సత్యసాయి ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణాలను కలెక్టర్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, రసీదు పుస్తకాలు, ధరల పట్టిక, తూకం యంత్రం, విత్తన ప్యాకెట్లను పరిశీలించి, రైతులకు విక్రయిస్తున్న ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, విక్రయ సమయంలో సంబంధిత కంపెనీ పేరుతో రసీదు తప్పనిసరిగా కొనుగోలుదారుకు అందించాలని ఆదేశించారు. దుకాణంలోని నిల్వల వివరాలను ప్రతిరోజు వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలని సూచించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని కంపెనీల విత్తనాలు అందుబాటులో ఉంచాలని, విత్తనాల విక్రయ సమయంలో కొనుగోలుదారులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, నకిలీ లేదా నిషేధిత విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్లను భద్రపరచుకోవాలని సూచించారు. డివిజన్‌లో తగినంత మొత్తంలో విత్తనాలు అందుబాటులో ఉండేలా, ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రతిరోజు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని వ్యవసాయశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, ఎడిఏ మనోహర్, తహసీల్దార్ కిరణ్, వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, డీలర్లు, రైతులు పాల్గొన్నారు

### నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పిలుపునిచ్చారు. కాగజ్ నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గృహనిర్మాణం, పట్టణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఏక్ పేడ్ మాకే నామ్, ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లుల పేరిట ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పట్టణాల్లో పెరుగుతున్న వేడిని నియంత్రించేందుకు, బ్లూ,గ్రీన్ మౌలిక సదుపాయాలను పెంపొందించేందుకు అమృత మిత్ర కార్యక్రమం కింద మహిళా సంఘాల సభ్యులతో ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. మున్సిపల్ అధికారులు, అమృత మిత్ర సభ్యులు పట్టణాల్లో గుర్తించిన చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, పార్కులలో మొక్క లు నాటడానికి అనువైన ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటి వాటిని రక్షించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపి క చేసి జిల్లా స్థాయి కమిటీకి పంపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అంతకుముందు, కలెక్టర్ ఇందిరా మహిళా శక్తి పథకం కింద మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ప్రోత్సహిస్తుందన్నారు. వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారికి ఈ క్యాంటీన్ సౌకర్యంగా ఉంటుందని, నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి మనోహర్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మోతిరామ్ పాల్గొన్నారు.

## నాణ్యతతో అభివృద్ధి పనులు
అదనపు కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిర్పూర్ (యు) మండలంలో పర్యటించి కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు ప్రక్రియను పరిశీలించారు. పుల్లేరా గ్రామ పంచాయతీ పరిధిలోని దేవులపల్లి గ్రామాన్ని సందర్శించి, అక్కడ కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతి, నిర్మాణంలో నాణ్యత వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం
కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్ :** జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండలం పోలంపల్లి, భీమారం, అక్కపల్లి, అంకుసాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల దృష్ట్యా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, సన్న రకం వడ్లు విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం తాగునీరు, నీడ, ఓఆర్ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు, టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు. అనంతరం మండల తహసీల్దార్ సదానందంతో కలిసి రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ప్రక్రియ, ఇందిరమ్మ ఇండ్లు అంశాలను పరిశీలించారు. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం రాయితీతో కూడిన రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులకు మాత్రమే వర్తింపచేయాలని, అనర్హులకు అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. పథకం అమలులో అవకతవకలు జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, వివిధ రకాల ధ్రువపత్రాల జారీ కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువు లోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్దిదారులకు అందే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం




మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** రైతులకు నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ఉక్కుపాదం మోపేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ హాల్ నందు పోలీస్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఖరీఫ్ సీజన్ నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై టాస్క్‌ఫోర్స్ జాయింట్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విత్తన షాపులపై నిరంతర తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాలను అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రైతులు సీజన్ ప్రారంభం అయినప్పుడు నుంచి వరి విత్తనాలు కొనుగోలుకు మొగ్గు చూపుతారని ప్రభుత్వం ద్వారా మంజూరైన సబ్సిడీ విత్తనాలను అందుబాటులో ఉంచాలని, రైతులు దళాలరును నమ్మి నకిలీ విత్తనాలను కొని మోసపోకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్, వ్యవసాయ శాఖలపై ఉందని వివరించారు. పత్తి విత్తనాలు నకిలీలు వస్తాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం నకిలీ విత్తనాలను అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయ శాఖ ద్వారా సమన్వయంతో పని చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ , జిల్లా వ్యవసాయ అధికారి వినయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పాఠశాల విద్య నాణ్యతను మెరుగుపరచడానికి శిక్షణ

**పాపన్నపేట :** ప్రాథమిక పాఠశాల విద్యార్థుల విద్య నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంపొందించే బృహత్తర కార్యక్రమని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. పాపన్నపేట మండలం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాల మెరుగు దిశగా ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

### ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లోనే సబ్సిడీ విత్తనాలు కొనుగోలు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లోనే సబ్సిడీ విత్తనాలు కొనుగోలు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ రైతులకు సూచించారు. పాపన్నపేట్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అధీకృత విత్తన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలను కొనుగోలు చేసిన తర్వాత విధిగా రైతు సంతకంతో కూడిన రసీదును ఇవ్వాలన్నారు.

## గ్రామపాలన అధికారుల పరీక్షకు ఏర్పాట్లు : అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** గ్రామపాలన అధికారుల నియామకం కోసం ఈనెల 25న జరిగే రాతపరీక్ష నిర్వహణకు పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. రాతపరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై శుక్రవారం ఆయన ఛాంబర్‌లో అధికారులతో సన్నాహాక సమావేశం నిర్వహించారు. గ్రామపాలన అధికారుల రాతపరీక్ష కోసం చేపట్టిన చర్యలపై ఆయా శాఖల వారిగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్ష జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 330 మంది అభ్యర్థులు గ్రామపాలన అధికారుల నియామక పరీక్షకు హాజరు కానున్నారని, వీరికి నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. నియమ నిబంధనలు తు.చ. తప్పకుండా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోని అన్ని గదులలో అభ్యర్థులకు తగిన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా రవాణా అధికారి ఉమా మహేశ్వర్‌రావు, ఏసీపీలు రాజా వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్, కలెకటరేట్ ఏఓ ప్రశాంత్, తహసీల్దార్ బాలరాజు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ పవన్ పాల్గొన్నారు.



# రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/బాన్సువాడ :** బాన్సువాడ సహకార సంఘం ఆద్వర్యంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై జిలుగు విత్తనాలను శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. 30 కిలోల జిలుగు విత్తనాలను 50 శాతం సబ్సిడీతో రూ. 2137.50 లకు అందజేయడం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా, మునిసిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు నార్ల రవీందర్ గుప్తా, మోహన్ నాయక్, ఎజాస్, లింగమేశ్వర్, రెంజర్ల సాయిలు, అమీర్ చావుస్ పాల్గొన్నారు.

### బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

బాన్సువాడ మండలంలోని చిన్న రాంపూర్ గ్రామంలో నిర్మించిన బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా, నాయకులు మోహన్ నాయక్, మోహన్ రెడ్డి, కుర్మ గణేష్, విఠల్, అంజయ్య, పర్వగౌండ, శ్రీనివాస్ నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక పంటలతో ఆర్థికాభివృద్ధి
ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్/నిర్మల్ :** రైతులు ఆధునిక పంటల వైపు దృష్టి సారించి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం దిలావార్‌పూర్ మండలంలోని గండం పల్లి గ్రామంలో ఆయిల్ పామ్ పంట కోత కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని బీరప్ప ఆలయాన్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి, లాభాలు, గడించే పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, రావుల రాంనాథ్, నాయకులు జడ్పీటీసీ తక్కల రమణరెడ్డి, ముత్యం రెడ్డి, వినాయక్ రెడ్డి, సత్యం చంద్రకాంత్, వీరేష్, నర్సారెడ్డి, జమాల్, అరవింద్ ,దినేష్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

### త్వరితగతిన కొనుగోలు ప్రక్రియ


దిలవార్‌పూర్ మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. కల్లాల్లో ధాన్యాన్ని పరిశీలించి త్వరితగతిన కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.





# క్రీడ

## ఇషాన్ కిషన్ ఊచకోత!





ఐపిఎల్ 2025 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సి)తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు దుమ్మురేపారు. దాంతో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 231 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(47 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 94 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. అభిషేక్ శర్మ(17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34) దూకుడుగా ఆడాడు. ఆర్‌సీబీ బౌలర్లలో రోమారియో షెఫర్డ్(2/14) రెండు వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్, లుంగి ఎంగిడి, సుయాష్ శర్మ, కృనాల్ పాండ్యా తలో వికెట్ తీసారు.

**అదిరిపోయే ఆరంభం..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్17) అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్ నుంచే దూకుడుగా ఆడిన ఈ జోడీ 3.3 ఓవర్లలోనే 50 పరుగులు చేసింది. ప్రమాదకరంగా ఆడుతున్న ఈ జోడీని లుంగి ఎంగిడి విడదీసాడు. అభిషేక్ శర్మను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే ట్రావిస్ హెడ్‌ను భువనేశ్వర్ కుమార్ ఔట్ చేయడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా వికెట్లు కోల్పోయింది. క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, హెన్రీచ్ క్లాసెన్ అదే దూకుడును కొనసాగించారు. దాంతో పవర్ ప్లేలో సన్‌రైజర్స్ హైదరాబాద్ 2 వికెట్లకు 71 పరుగులు చేసింది.

### ఇషాన్ విధ్వంసం..

భారీ సిక్స్‌లు బాదిన హెన్రీచ్ క్లాసెన్(13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 24)ను సుయాష్ శర్మ ఔట్ చేయగా.. క్రీజులోకి వచ్చిన అనికేత్ వర్మ(9 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 26) కూడా భారీ సిక్స్‌లు బాదాడు. అతన్ని కృనాల్ పాండ్యా ఔట్ చేయగా.. నితీష్ కుమార్ రెడ్డి(4)ని రొమారియో షెపర్డ్ పెవిలియన్ చేర్చాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా.. మరోవైపు ఇషాన్ కిషన్ 28 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అభినవ్ మనోహర్(12) ఔటైనా.. ప్యాట్ కమిన్స్ సాయంతో ఇషాన్ కిషన్ చెలరేగాడు.

## ఇంగ్లండ్ మ్యాచ్‌లకు బుమ్రా దూరం!

ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) శనివారం ప్రకటించనుంది. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆడిన ఆటగాళ్లలో చాలా మంది ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికవ్వనున్నారు. స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో భారత్‌వ తరఫున ఇంగ్లండ పర్యటనకు వెళ్తున్న కుర్రాళ్లలో కూడా కొంతమందికి సీనియర్ టీమ్‌లో చోటు దక్కనుంది.

**మూడు టెస్ట్‌లకే బుమ్రా..**

భారత పేస్ విభాగాన్ని జస్‌ప్రీత్ బుమ్రా నడిపించనున్నాడు. అయితే టీమ్ సెలెక్షన్‌కు ముందు బుమ్రా.. బీసీసీఐకి బ్యాడ న్యూస్ చెప్పినట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ సమస్యల నేపథ్యంలో తాను ఐదు టెస్ట్‌లు ఆడలేనని బుమ్రా బీసీసీఐకి సమాచారం ఇచ్చాడని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది. మూడు టెస్ట్‌ల కంటే ఎక్కువ ఆడలేనని, అందుకు తన శరీరం సహకరించదని బుమ్రా.. సెలెక్టర్లకు స్పష్టం చేసినట్లు తెలిపింది. ఆస్ట్రేలియా పర్యటనలో బుమ్రా ఐదు మ్యాచ్‌లకు ఐదు ఆడి వెన్ను గాయానికి గురయ్యాడు. ఆఖరి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో గాయపడిన అతను సుదీర్ఘ కాలం జట్టుకు దూరమయ్యాడు. మళ్లీ ఐపీఎల్ 2025తోనే రీఎంట్రీ ఇచ్చాడు.

**కెప్టెన్‌గా సత్తా చాటినా..**

వెన్ను నొప్పి నేపథ్యంలోనే జస్‌ప్రీత్ బుమ్రాను టీమిండియా లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పించినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పటికే బుమ్రా పలు సార్లు వెన్ను గాయానికి గురయ్యాడు. బుమ్రా గత మూడేళ్లుగా టెస్ట్‌ల్లో రోహిత్ శర్మకు డిప్యూటిగా వ్యవహరించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో హిట్ మ్యాన్ గైర్హాజరీలో జట్టును నడిపించి అద్భుత విజయాన్ని కూడా అందించాడు. బౌలింగ్‌లో అసాధారణ ప్రదర్శన కనబర్చాడు.

**కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్..?**

టీమిండియా టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని ఇప్పటికే పలు నివేదికలు వెలువడ్డాయి. అయితే శుభ్‌మన్ గిల్ ఇప్పటికే టెస్ట్ ఫార్మాట్‌లో లీడర్‌షిప్ గ్రూప్‌లో లేడు. కానీ టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం జింబాబ్వే పర్యటనలో తొలిసారి టీ20 ఫార్మాట్‌లో టీమిండియాను నడిపించాడు. శ్రీలంక పర్యటనతో పాటు ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో రోహిత్ శర్మకు డిప్యూటీగా వ్యవహరించాడు. టెస్ట్‌ల్లో గిల్ కెప్టెన్‌గా ఎంపికైతే రిషభ్ పంత్‌కు వైస్ కెప్టెన్సీ దక్కే అవకాశాలు ఉన్నాయి. 2018 నుంచి రిషభ్ పంత్ టెస్ట్‌ల్లో రెగ్యులర్‌గా ఆడుతున్నాడు.





# రీల్



## ఓటిటి పార్ట్‌నర్‌ను లాక్ చేసుకున్న 'వార్ 2'?

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ అలాగే బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ కలయికలో తెరకెక్కించిన భారీ యాక్షన్ చిత్రమే వార్ 2. దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన ఈ సాలిడ్ ప్రాజెక్ట్ నుంచి మేకర్స్ రీసెంట్‌గా రిలీజ్ చేసిన టీజర్ కి మంచి రెస్పాన్స్ కూడా వచ్చింది. అయితే ఈ చిత్రాన్ని థియేటర్స్ లో రిలీజ్ తర్వాత ఓటిటిలో ఎలాగో విడుదలకి తీసుకురావాలి. మరి ఈ చిత్రం స్ట్రీమింగ్ హక్కులపై ఇపుడు వరకు ఎలాంటి అప్డేట్ లేదు. మరి లేటెస్ట్ గా దీనిపై దాదాపు క్లారిటీ వచ్చేసింది. ఈ చిత్రాన్ని దిగ్గజ స్ట్రీమింగ్ యాప్ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్నట్టుగా ఇపుడు హింట్ ఇచ్చారు. ఎన్టీఆర్, హృతిక్ పై పోస్ట్ చేసి ది వార్ ఈజ్ అఫీషియల్ అంటూ వార్ 2 ఓటిటి హక్కులు తామే తీసుకున్నట్టుగా చెప్పకనే చెప్పేసారు. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది.



## 'అవతార్ 2'కి మళ్ళీ సిద్ధమా?

వరల్డ్ వైడ్‌గా భారీ వసూళ్లు సొంతం చేసుకున్న చిత్రాల్లో హాలీవుడ్ సెన్సేషనల్ ఫ్రాంచైజ్ అవతార్ కూడా ఒకటి. దర్శకుడు జేమ్స్ కేమరూన్ తెరకెక్కించిన ఈ విజువల్ వండర్స్ వరల్డ్ వైడ్ గా బిగ్గెస్ట్ గ్రాసర్ గా నిలిచాయి. అయితే గత కొన్నేళ్ల కితమే అవతార్ 1 కి సక్సెసర్ అవతార్ పార్ట్ 2 అవతార్ ది వే ఆఫ్ వాటర్ వచ్చి సంచలనం సెట్ చేసింది. మరి ఈ చిత్రాన్ని ఫైనల్ గా మేకర్స్ మళ్ళీ రీరిలీజ్ కి తీసుకొస్తున్నట్టుగా అనౌన్స్ చేశారు. ఒక్క వారం మాత్రమే లిమిటెడ్ ఎంగేజ్మెంట్ గా థియేటర్స్ లో రీరిలీజ్ కి డేట్ ని ఇచ్చేసారు. దీనితో ఈ సినిమా ఈ రానున్న అక్టోబర్ 3 నుంచి థియేటర్స్ లో సందడి చేయనుంది అని కన్ఫర్మ్ చేశారు. మరి ఇది మాత్రం మళ్ళీ చూడాలి అనుకునేవారికి బిగ్ ట్రీట్ ఇచ్చే అప్డేట్ అని చెప్పవచ్చు. అయితే ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉంటుందా లేక ఓవర్సీస్ మార్కెట్ లోనేనా అనేది రివీల్ కావాల్సి ఉంది.




## శేఖర్ కమ్ముల 'కుబేర'కి షాకింగ్ రన్ టైం?

ఈ జూన్ నెలలో రిలీజ్ కి రాబోతున్న లేటెస్ట్ చిత్రాల్లో కోలీవుడ్ టాలెంటెడ్ హీరో ధనుష్ హీరోగా రష్మిక మందన్నా హీరోయిన్ గా కింగ్ నాగార్జున సాలిడ పాత్రలో మ్యాజికల్ దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కించిన అవైటెడ్ చిత్రం కుబేర కూడా ఒకటి. అయితే తెలుగు సహా తమిళ్ లో కూడా మంచి బజ్ ని సొంతం చేసుకున్న ఈ చిత్రంపై మరో ఇంట్రెస్టింగ్ టాక్ బయటకి వచ్చింది. దీనితో కుబేర సినిమాకి షాకింగ్ రన్ టైం లాక్ అయ్యినట్టుగా తెలుస్తుంది. మేకర్స్ ఈ చిత్రాన్ని దగ్గరదగ్గరగా మూడు గంటల నిడివికి కట్ చేశారట. ఈ సినిమా 2 గంటల 50 నిమిషాల మేర రన్ టైం తో రాబోతున్నట్టుగా ఇపుడు తెలుస్తుంది. మరి దీనిపై మరింత క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా ఆసియన్ సునీల్ అలాగే శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్ పి వారు ఈ చిత్రాన్ని నిర్మాణం వహించగా ఈ జూన్ 20న పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కి రాబోతుంది.

# నిబద్ధత,క్రమశిక్షణతో పోరాడిన రఘుపాల్

### సంతాప సభలో పలువురు వామపక్ష, శాంతి ఉద్యమ నాయకులు నివాళి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) ఉద్యమంలో, కమ్యూనిస్టు మార్క్సిస్ట్ పార్టీ ఉద్యమంలో జి. రఘుపాల్ నిబద్ధతతో, క్రమశిక్షణతో పోరాటాలు నిర్వహించారని పలువురు వామపక్ష, శాంతి ఉద్యమ నాయకులు అన్నారు. రఘుపాల్ సంతాప సభ హైదరాబాద్ హిమాయత్‌నగర్ లోని ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, ఐప్సో జాతీయ నేత, పీస్ అవార్డు గ్రహీత కె.యాదవరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్, అరుణోదయ విమలక్క, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ ప్రసంగించారు. తొలుత అజీజ్‌పాషా మాట్లాడుతూ సిపిఐ(ఎం) పార్టీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా రఘుపాల్ 15 ఏళ్ల పాటు సమర్థవంతగా బాధ్యతలను నిర్వహిస్తునే శాంతి సంఘం ఉద్యమంలో ఉద్యమ వ్యాప్తికి ఏనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన దూరదృష్ట కలిగిన వ్యక్తి అని నిబద్ధత గల కమ్యూనిస్టు యేధ అని సిపిఐ పార్టీ తరుపున నివాళులర్పించారు. జాతీయ పీస్ అవార్డు గ్రహీత జాతీయ నేత కె.యాదవ రెడ్డి మాట్లాడుతూ రఘుపాల్ 83 ఏళ్ల వయసు మీద పడ్డప్పటికీ ఎన్నడు కూడా వయోభారమైనటువంటి కారణంగా ఉద్యమాలకు దూరంగా ఉన్న సందర్భాలు లేవని అన్నారు. అన్ని సమావేశాలకు సమయం కంటే ముందే హాజరయ్యే వ్యక్తిని అన్నారు. శాంతి




ఉద్యమాలలో జిల్లా రాష్ట్ర జాతీయ మహాసభలలో కలిసి తిరిగిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ రఘుపాల్ కమ్యూనిస్టు ఉద్యమ అనే పద్యం నుండి వచ్చారని ఆయన నిత్యం తన ఆలోచనలతో వామపక్ష ఉద్యమాల బలోపేతం గురించి ప్రజలలో స్ఫూర్తిని నింపే వారనీ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి తో పాటుగా ఒకటి రెండు మినహా అన్ని జిల్లాలను తిరిగి ఉద్యమం కోసం కృషి చేశారని అన్నారు. ఐప్సో జాతీయ అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ డి .సుధాకర్ మాట్లాడుతూ రఘుపాల్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు .రఘుపాల్ నిత్యం రాష్ట్ర కేంద్రంలో అందుబాటులో ఉండి అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న నాయకుడని అన్నారు. వారి సేవలు మరువలేనివి అని కొనియాడారు. సిపిఐ(ఎం) రాష్ట్ర సెక్రటేరియట్ నెంబర్ అబ్బాస్ మాట్లాడుతూ రఘు పాల్ కమ్యూనిస్టు శాంతి ఉద్యమ నాయకుడు మాత్రమే కాదు ఆయన గొప్ప మానవతా వాదని, ఆయన అందరినిసహృదయంతో ప్రేమించడంతోపాటు కార్యకర్తల ప్రోత్సహించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. అరుణోదయ నాయకురాలు విమలక్క మాట్లాడుతూ రఘుపాల్ శక్తి విల్ పవర్ శారీరక దృఢత్వం చాలా గొప్పదని షో టీం లో మేమంతా చైనాకు వెళ్ళిన సందర్భంగా ఆయన చూపిన ,చర్చించిన విషయాలను మర్చిపోలేని వని నివాళులర్పించారు. ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ మాట్లాడుతూ పోరాట బాటలో రఘుపాల్‌తో తను చాలా గంటల కొద్ది సమావేశాల్లో, రైళ్లలో, బస్సులలో, ప్రయాణం సందర్భంగా సంఘీభావ సంఘం ఉద్యమ ప్రాధాన్యతను, ఈ సంఘాన్ని ప్రజల సంఘంగా గా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన అనేక విషయాల గురించి మాట్లాడుకునే వారమన్నారు. రఘుపాల్ ఉద్యమ వ్యాప్తికి చేసిన కృషి మరువలేనిదని చెప్పారు . రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి .నాగేశ్వరరావు రఘుపాల్‌తో తనకున్న అనుబంధాన్ని, పోరాటంఅనుభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర జిల్లా నాయకులు వెంకట రామ్ రెడ్డి , గురు బచ్చన్ సింగ్ ,రామరాజ్, ప్రేమ పావని, డాక్టర్ సమత రోషిని, అనూష, కమలా రెడ్డి నరహరి, పి ఎస్ ఎన్ మూర్తి, తిప్పర్తి మహేష్, జగన్మోహన్, లక్ష్మీ కాంతం. జెకె శ్రీనివాస్, శ్రీమన్నారాయణ,డాక్టర్ జి గోపి ,హర్ష అహ్మద్, బొమ్మగాని నాగభూషణం, వెంకట్ గౌడ్, రఘుపాల్ తో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రఘుపాల్ మరణం అనంతరం తన దేహాన్ని ఎయిమ్స్ హాస్పిటల్ కు ఇచ్చిన సందర్భంగా రఘుపాల్ కుమారుడు డాక్టర్ గోపిని సన్మానించారు .

# వెదిరె రామచంద్రారెడ్డికి 'పద్మ విభూషణ్' ఇవ్వాలి

### అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షులు వెదిరె అరవింద్ రెడ్డి




**ప్రజాపక్షం / హైదరాబాద్:** స్వచ్ఛంద భూదాన ఉద్యమ ప్రేరణకర్త, భూదాన ఉద్యమ వ్యవస్థాపకుడు, భూదాన ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిన వెదిరే రామచంద్రారెడ్డికి 'పద్మ విభూషణ్' ఇవ్వాలని పలువురు వక్తలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పాఠ్యాంశాల్లో వెదిరె రామచంద్రారెడ్డి జీవిత చరిత్రను చేర్చి భవిష్యత్ తరాలలో స్ఫూర్తి నింపాలని, హైదరాబాద్‌లోని ట్యాంక్ బ్యాండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'భూదాన ఉద్యమ ప్రాముఖ్యత గతం, వర్తమానం వేదిరె రామ చంద్రా రెడ్డి భూదాన ఉద్యమ వ్యవస్థాపకుడు' అనే అంశంపై సదస్సు తెలంగాణ సర్వోదయ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జరిగింది. సదస్సులో అఖిల భారత సర్వోదయ మండలి మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి, అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షులు వెదిరె అరవింద్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు తోలుపునూరి కృష్ణ గౌడ్, భూదాన్ రామచంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ వెదిరె ప్రబోధ్ చంద్రా రెడ్డి, ప్రమోతిష్ చంద్రా రెడ్డి, తెలంగాణ సర్వోదయ మండలి నేత టి.నరేష్ గౌడ్ తదితరులు ప్రసంగించారు. జులై 17న ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిఎం రేవంత్ రెడ్డికి మహాదేవ్ విద్రోహి విజ్ఞప్తి చేశారు. వెదిరె అరవింద్ రెడ్డి మాట్లాడుతూ శాంతి యాత్రలో భాగంగా పోచంపల్లికి చేరిన ఆచార్య వినోభాభావే కోరిక మేరకు100 ఎకరాలను దానం చేశారని, ఈ ఘటనతో స్ఫూర్తి పొందిన వినోబా భావే దేశ వ్యాప్త భూదాన ఉద్యమానికి భూదాన జ్యోతిని ఈ ప్రాంతంలోనే వెలిగించారన్నారు. అటువంటి మహనీయుని త్యాగచరితను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి గౌరవించాలన్నారు. తోలుపునురి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన భూదాన భూములని కాపాడాలని, రాష్ట్రంలో భూదాన యజ్ఞ బోర్డు ఏర్పాటు చేసి మిగిలిఉన్న భూదాన భూములను పేదలకు పంపిణి చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

## కన్న తల్లే కడతేర్చింది...!

(మొదటి పేజీ తరువాయి)

పుల్లూరులోనే నివాసం ఉండేవారు. శ్రీమాన్ ఇటీవల రెండు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి రావడంతో గ్రామంలో పరువు పోయిందని,అయన అమ్మమ్మ ఊరైన అప్పనపల్లిలో గత రెండు నెలలు నుండి ఉంటున్నారు. ఎంతో సంతోషంగా ఉంటుందనుకున్న ప్రేమ వివాహ జీవితం ప్రశ్నార్థకంగా మారడంతో పాటు ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తరచూ వేధింపులకు గురి చేస్తుండటం, ఆర్థిక ఇబ్బందులు, భర్త ప్రవర్తన, వ్యవహార శైలి నచ్చని కవిత భర్తతో విడిపోవడానికి సిద్ధపడింది. భర్త నుండి విడిపోయి దూరంగా వెళ్లి పోవాలని.. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న పసికందు లేకపోతే భర్తను విడిచిపెట్టి హాయిగా ఉండొచ్చని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పసికందు దీక్షిత్ కుమార్‌ను తీసుకెళ్లి గ్రామ శివారులో ఉన్న పాడుబడిన బావిలో విసిరేసి వెళ్లిపోయింది. తన దగ్గర నుండి ఇద్దరు ముసుగు వేసుకొని వచ్చిన దుండగులు బాబును ఎత్తుకెళ్లారని చెప్పి, అందరిని తప్పుదోవ పట్టిస్తూ కిడ్నాప్ జరిగినట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవిత చెబుతున్న విషయాలకు, జరిగిన ఘటనకు పొంతన లేకపోవడంతో తల్లి కవితను పోలీసులు తమదైన శైలిలో విచారించారు. భర్త నుండి విడిపోయి దూరంగా వెళ్లిపోవాలని.... అడ్డుగా ఉన్న కుమారుడిని తానే బావిలో వేసి చంపినట్లు అంగీకరించింది. దీంతో భర్త శ్రీమాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసును హత్య కేసుగా మార్చిన పోలీసులు కవితను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## చిన్నారులను చిదిమేస్తున్నారు..!

(మొదటి పేజీ తరువాయి)

వారు గతంలో ఆడపిల్లలకు జన్మనిచ్చిన వారు మరోమారు గర్భం దాల్చిన తర్వాత తమకు పుట్టబోయేది ఆడా.. మగా బిడ్డ అనేది తెలుసుకునేందుకు స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. స్కానింగ్‌లో ఆడ శిశువే పుడుతుందని తెలవడంతో కడుపులోని పిండాన్ని తొలగించుకుంటున్నారు. ఇది నేరమని చెప్పినా తాము ఆడపిల్లలకు జన్మనిచ్చి పెంచి పోషించేస్థోమత తమకు లేదంటూ చెబుతున్నారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆసుపత్రుల నిర్వాహకులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో ఆయా గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్ఎంపి, పిఎంపిలను ఏజెంట్లుగా పెట్టుకుని లింగనిర్ధారణ పరీక్షలు, గర్భస్రావాలకు పాల్పడుతున్నారు. లింగనిర్ధారణ, భ్రూణ హత్యలకు పాల్పడిన వారిపై (లింగ ఎంపిక నిర్ధారణ చట్టం 1994 అండ్ 1996 ప్రకారం ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 50వేల జరిమాన విధించే అవకాశం ఉన్నా సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో విద్యానగర్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గర్భిణికి వైద్యురాలు లింగనిర్ధారణ చేసి గర్భ విచ్ఛినానికి పాల్పడింది. ఈ విషయం బయటకు పొక్కడంతో పత్రికల్లో పెద్ద ఎత్తున వార్తలు ప్రచురితమయ్యాయి. దీని ఆధారంగా విచారణ జరిపిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సదరు మహిళ వైద్యురాలుతో బేరసారాలు ఆడి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఆమె తప్పు ఏమీలేదు అన్నట్లు ప్రకటించారు. తాజాగా మోతె మండలంలోని రాఘవపురం గ్రామానికి చెందిన భయ్యా అనూష అనే మహిళ ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చిన తర్వాత మరోమారు గర్భందాల్చగా మగా, ఆడా శిశువు అనే విషయం తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులతో నిర్ధారణ చేసుకునేందుకు ఓ ఆర్ఎంపి వైద్యునితో నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ లో ఉన్న ఓ స్కానింగ్ సెంటర్‌కు వెళ్లింది. ఈ స్కానింగ్‌లో ఆమెకు పుట్టబోయే బిడ్డ ఆడ శిశువు అని తేలడంతో ఆమె కుటుంబ సభ్యులు గర్భస్రావం (అబార్షన్) చేయించుకునేందుకు సిద్దమయ్యారు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ఓమెగా ప్రైవేట్ ఆసుపత్రిలో ఆమెను చేర్పించారు. అక్కడి వైద్యులు ఆమెకు అబార్షన్ చేస్తున్న క్రమంలో అధికంగా రక్తం స్రావం కావడంతో ఆమె ప్రాణాలను ముప్పు ఉన్నదని చెప్పి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే. ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు కుమ్మక్కై ప్రభుత్వ నిబంధనలను పక్కకు పెట్టి లింగ నిర్ధారణ పరీక్షలు, గర్భస్రావాలు (అబార్షన్) లు యధేచ్ఛగా చేస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షకు రూ.15వేలు, గర్భస్రావం (అబార్షన్‌కు)రూ.35 వేలు దండుకుంటున్నారు. ఇవి కాకుండా మందులకు మరో రూ.5 నుండి రూ.10 వేలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఈ అక్రమ దందాకు భాగస్వాములుగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆర్ఎంపి, పిఎంపి వైద్యులకు పెద్ద మొత్తంలో కమిషన్లు ఇస్తున్నారు. దీంతో వారు కాసులకు కక్కుర్తి పడి అబార్షన్‌లు చేపిస్తున్నారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పట్టణ ప్రాంతాలలో లింగ నిర్ధారణ పరీక్షలు, గర్భస్రావాలు అత్యధికంగా జరుగుతున్నాయి. పట్టణ ప్రాంతం వైద్యులే కాకుం డా గ్రామీణ ప్రాంత ఆర్ఎంపి, పిఎంపి లు కూడా అబార్షన్‌లు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే సాగుతున్నా సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఒకటి, రెండు వెలుగులోకి వచ్చినప్పుడు హడావుడి చేస్తున్నారే తప్పా ఈ దందా కొనసాగిస్తున్నా స్కానిం గ్ సెంటర్లు, ఆసుపత్రుల వైపు తిరిగి కన్నేతి చూడటంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం భ్రూణ హత్యలు చే స్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రంలో మళ్ళీ కరోనా

(మొదటి పేజీ తరువాయి)

మాస్కులు ధరించాలని, కరోనా లక్షణాలు ఉన్న వారు తప్పనిసరిగా టెస్టులు చేయించుకొని స్వీయ జాగ్రత్తలు పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పష్టం చేశారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఒక వైద్యునికి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడం కలకలం రేపింది.

**దేశవ్యాప్తంగా పంజా విసురుతున్న కరోనా..**

దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి మరోసారి నెమ్మదిగా పంజా విసురుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. మే 19నాటికి దేశవ్యాప్తంగా 257 కొవిడ్ కేసులు ఉన్నట్లు ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ కొవిడ్ కేసులన్ని దాదాపుగా తేలికపాటివేనని, ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. సింగపూర్, హాంకాంగ్‌లో కొవిడ్ కేసులు పెరుగుతుండడం వల్ల అప్రమత్తమయ్యామని తెలిపింది. సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో కొవిడ్ పెరుగుదల తీవ్రంగా ఉంది. వారంలోనే వేల సంఖ్యలో కేసులు నమోదు అవుతున్నాయి.

**ఆందోళన కలిగిస్తోన్న కేసుల పెరుగుదల..**

పలు రాష్ట్రాల్లో కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కర్ణాటక, కేరళ వంటి పొరుగు రాష్ట్రాల్లో కొత్త కేసులు వెలుగుచూడటంతో తెలంగాణ ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కర్ణాటక రాజధాని బెంగళూరులో తొమ్మిది నెల ల పసికందుకు కరోనా సోకినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. కేరళ లోనూ కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరు గుతోంది. మే నెలలో ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 182 కొత్త ఇన్‌ఫెక్షన్‌లు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com